హామీల అమలు అంతంతే..

మన్యానికి, దత్తత పంచాయతీకి ఏడాది క్రితం సీఎం భారీగా వరాలు


పెదలబుడులో పూర్తికాని అభివృద్ధి పనులు.. అందుబాటులోకి రాని ఉచిత ఫైబర్ నెట్ సేవలు

ప్రకటనలకే పరిమితమైన ఎడ్యుకేషన్ హబ్..ఏర్పాటుకాని ఇంజనీరింగ్, డీఎడ్, బీఎడ్, నర్సింగ్ కళాశాలలు

పట్టాలెక్కని లంబసింగి, డల్లాపల్లి పర్యాటక ప్రాజెక్టులు..

16


దత్తత పంచాయతీలో పూర్తయిన రోడ్లు, ఇంటింటికీ కుళాయి పనులు..వీధుల్లో ఎల్ఈడీ వెలుగులు



గవర్నర్ నరసింహన్



నిర్మాణం పూర్తి కాని
పెదలబుడు - గంజాయి గుడ రహదారి




ముఖ్యమంత్రి చంద్రబాబు

నేడు అరకులో ఆదివాసీ దినోత్సవం

హాజరుకానున్న గవర్నర్ నరసింహన్,
ముఖ్యమంత్రి చంద్రబాబు

16


పోలీసుల అసాధారణ బందోబస్తు



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

విశాఖపట్నం

బుధవారం 9 ఆగస్టు 2017 | 16



వైవిధ్యం.. గిరిజన జీవనం

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కట్టుబాటు, ఆచారాలకు పెద్దపీట

ఆడపిల్ల పుడితే పండగే .. స్నేహానికి అధిక ప్రాధాన్యం

కుండల్లోనే వంటలు.. సేంద్రియ సాగే చేస్తారు..

రాత్రి ఎనిమిది గంటలలోపే భోజనం

పండ్లు, గెడ్డల పేర్లతో ఊర్లు.. మహిళే కుటుంబ సారథి..

విశాఖ ఏజెన్సీలో 18 తెగలు జీవనం

-ప్రత్యేక కథనం సెంటర్‌స్ప్రెడ్‌లో..

రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు



2

17న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

18న నర్సీపట్నం సెగ్మెంట్‌లో 2,393 మందికి పక్కా గృహాల మంజూరు పత్రాలు పంపిణీ

మంత్రి అయ్యన్నపాత్రుడు

కసాయి కొడుకు



10

నిందితుడు సత్యనారాయణ

తల్లిని హత్య చేసిన తనయుడు

డబ్బులు ఇవ్వలేదని కత్తితో గొంతుకోసి అఘాయిత్యం

రిజిస్ట్రేషన్ ఆదాయం సూపర్

- జూలై ఆఖరువారంలో సగం సొమ్ము రాక
- నెల మొత్తం టార్గెట్ రూ.2003.66 లక్షలు
- చివరి వారంలో రూ.1004.32 లక్షలు...
- ఆగస్టు నుంచి భూముల విలువ పెంచడమే కారణం



అనకాపల్లి: పెద్ద నోట్ల ఉపసంహరణ తరువాత రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండిపడింది. కానీ ...మిగతా 2వ పేజీలో..

మన్యంలో 20 శాతం మందికే వంట గ్యాస్



లక్ష్యం 54,707 కుటుంబాలు

పంపిణీ చేసింది 11,200 మందికే

ఐదు కిలోల మినీ సిలిండర్ల కొరతే కారణమంటున్న అధికారులు

సిలిండర్లను విడుదల చేయాలని ఆయిల్ కంపెనీలకు జేసీ లేఖ

6

కార్యదీక్షతో ఏదైనా సాధ్యమే

సివిల్స్ మూడో ర్యాంకర్ రోణంకి గోపాలకృష్ణ



గోపాలకృష్ణ, తండ్రి అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: బడుగు బలహీన వర్గాలకు సేవచేయాలన్న తపన, ఐఏఎస్ జాబితాలో తన పేరు ఉండాలన్న లక్ష్యంతో సివిల్స్‌లో 3వ ర్యాంకు సాధించానని రోణంకి గోపాలకృష్ణ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన గోపాలకృష్ణ మాట్లాడుతూ, కాలం కర్పూరం లాంటిదని, వెలిగిస్తే వెలుగుతుంది, వదిలేస్తే కరిగిపోతుందన్నారు. కాలానికి మించిన సంపద మరొకటి ఉండదని అన్నారు. ఇష్టపడి చేసే ఏపని అయినా ప్రతిఫలం కనిపిస్తుందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న బ్రాహ్మణతర్లకు నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాడినని, మధ్యలో వున్న వాగులకు వరద వస్తే తన తండ్రి అప్పారావు భుజాలపై ఎక్కించుకు గెడ్డలు దాటించేవారని గుర్తు చేసుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బడి మానకూడదని తన తండ్రి నాడు చెప్పిన మాటలు అనంతర కాలంలో ఎంతో పడ్డాయని తెలిపారు. 2006లో టీచర్ పోస్టు వచ్చిందని, 2009లో దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశానని, నాలుగుసార్లు సివిల్స్‌కు హాజరయ్యానని, ఎట్టకేలకు లక్ష్యాన్ని సాధించాలనని గోపాలకృష్ణ చెప్పారు. ప్రస్తుత యువతను సెల్‌ఫోన్లు పెడతోవ పట్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకు పేదరికం, కులం, మతం, భాష అడ్డు కావన్నారు. రోజులో ఎన్ని గంటలు చదివామన్నది ముఖ్యంకాదని, ఎంత నేర్చుకున్నామన్నది ప్రధానమని అన్నారు. నిరంతరం ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుండాలని విద్యార్థులకు సూచించారు.

నన్నయ వర్సిటీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ, గురువును, తల్లితండ్రులను ఎవరైతే పూజించి, గౌరవిస్తారో వారే గొప్ప వారవుతారన్నారు. ఈ నెల 28న గోపాలకృష్ణ ఐఏఎస్ శిక్షణకు వెళ్లనున్నారని చెప్పారు. అనంతరం గోపాలకృష్ణ, అతని తండ్రి అప్పారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, కైరళి ప్రిన్సిపాల్ ఎం.కె.దినేష్, అవుగడ్డ అప్పలనాయుడు ఆదిరెడ్డి చినకన్నబాబు, పెద్దాడ వెంకటరమణ, వరదపురెడ్డి లలితాప్రసాద్, ఉషోదయ, కైరళి విద్యార్థులు పాల్గొన్నారు

రిజిస్ట్రేషన్ ఆదాయం సూపర్

(1వ పేజీ తరువాయి)

గత నెల ఆఖరివారంలో మాత్రం ఆదాయం అనూహ్యంగా పెరిగింది. ఆగస్టు ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ల చార్జీలు పెరగడంతో జూలై 31వ తేదీలోగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే ఎంతోకొంత సొమ్ము ఆదా అవుతుందన్న ఉద్దేశంతో భూముల కొనుగోలుదారులు హడావుడిగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. దీంతో జూలై నాలుగో వారంలో జిల్లాలోని అనకాపల్లి రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా పది కోట్ల నాలుగు లక్షల 32 వేల రూపాయల ఆదాయం సమకూరింది. అనకాపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.99.84 లక్షల ఆదాయం లభించింది. చోడవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.61.61 లక్షలు, కె.కోటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.26.19 లక్షలు, కోటవురట్ల నుంచి రూ.32.55 లక్షలు, లంకెలపాలెం నుంచి రూ.163.36 లక్షలు, మాడుగుల నుంచి రూ.6.48 లక్షలు, నక్కపల్లి నుంచి రూ.73.43 లక్షలు, నర్సీపట్నం నుంచి రూ.90.04 లక్షలు, పెదగంట్యాడ నుంచి రూ.176.84 లక్షలు, సబ్బవరం నుంచి రూ.143.34 లక్షలు, ఎలమంచిలి నుంచి రూ.130.64 లక్షలు.... వెరసి 1004.32 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. జూలై నెల లక్ష్యం 2003.66 లక్షల రూపాయలు కాగా రూ.1787.12 లక్షల ఆదాయం సమకూరి, 89.19 శాతం లక్ష్యాన్ని సాధించారు. జూలై నెల మొదటి వారంలో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వచ్చిన మొత్తం ఆదాయం రూ.278.87 లక్షలు. రెండో వారంలో రూ.256.23 లక్షలు, మూడో వారంలో రూ.247.70 లక్షలు వచ్చింది. జూన్ నెల లక్ష్యం 1526.61 లక్షల రూపాయలు కాగా 1309.79 లక్షల రూపాయలు మాత్రమే సమకూరింది.

రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు

మంత్రి అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం రింగ్‌రోడ్డు మ్యాప్‌ను చూపిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పథకాలకు రూ.70 కోట్లు ఇటీవల మంజూరు చేసామని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో రూ.13 కోట్ల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 150 పడకల విభాగాన్ని హోంమంత్రి చినరాజప్ప, ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావు ఈనెల 17న ప్రారంభిస్తారని తెలిపారు. 33 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నర్సీపట్నం-తాళ్లపాలెం ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులకు, నర్సీపట్నం లత్సాపాత్రుడు పార్కులో 25 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న స్కేటింగ్ రింకుకు కూడా అదే రోజున మంత్రులు శంకుస్థాపన చేస్తారన్నారు.

నియోజకవర్గం పరిధిలోని 2,393 మందికి పక్కాగృహాల లబ్ధిదారులకు ఈనెల 18న మంజూరు పత్రాలను ఆయా మండల కేంద్రాల్లో అందజేయనున్నామని మంత్రి వెల్లడించారు. నర్సీపట్నం-కేడీపేట రహదారిలో అటవీ ప్రాంతంలో ఉన్న రోడ్డు విస్తరణకు 12 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. పట్టణంలో నర్సీపట్నం-తుని రోడ్డు జంక్షన్ నుంచి నర్సీపట్నం-కోటవురట్ల రోడ్డు జంక్షన్ వరకు రహదారిని రూ.3 కోట్ల వ్యయంతో విస్తరించనున్నామన్నారు. వై జంక్షన్ నుంచి శ్రీకన్య జంక్షన్ వరకు రహదారిని రూ.4.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసే పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. పెదబొడ్డేపల్లి వంతెన వద్ద మరో నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. నర్సీపట్నం-చింతపల్లి రోడ్డు జంక్షన్ నుంచి నర్సీపట్నం-చోడవరం రోడ్డు జంక్షన్ వరకు రహదారి నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. పట్టణ శివార్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

నియోజకవర్గంలోని 86 పంచాయతీల్లో తొలిదశలో 36 శ్మశానవాటికలను అభివృద్ధి చేశామని, ముస్లింలు, క్రిస్టియన్‌లకు సంబంధించిన వాటిని కూడా అభివృద్ధి చేస్తామని సంబంధిత వర్గాల వారు ముందుకు రావాలని మంత్రి కోరారు. గొలుగొండ మండలంలో 700 మందికి గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేసేందుకు అవసరమైన డిపాజిట్ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించనుందన్నారు. ఈ ఏడాది కూడా రూ.11 కోట్లతో నీటిపారుదల కాలువలు, చెరువులు, చెక్‌డ్యాంలను అభివృద్ధి చేయనున్నామన్నారు.

నర్సీపట్నం మీదుగా కొత్తగా రెండు జాతీయ రహదారులు నిర్మించనున్నందున పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని అయ్యన్నపాత్రుడు చెప్పారు. మెయిన్‌రోడ్డు విస్తరణకు ప్రభుత్వం 140 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ఇందులో 20 కోట్ల రూపాయలు మాత్రమే కొత్త రోడ్డు నిర్మాణానికి కేటాయించగా, మిగతా 120 కోట్ల రూపాయలు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఖర్చుచేయనున్నామని మంత్రి తెలిపారు.

ఆశ్రమ భూమికి దాత వారసుల ఎసరు!

పెందుర్తిలో రూ.50 కోట్ల భూమి ఆక్రమణ

సిట్‌కు మంత్రి అయ్యన్న మరో ఫిర్యాదు

ఆశ్రమ నిర్వాహకులను చంపేస్తామని బెదిరించిన దాత వారసులు

నర్సీపట్నం ఆశ్రమానికి 50 సంవత్సరాల క్రితమే దానంగా ఇచ్చిన భూమి



సర్వే నంబర్ 240/1బీలో నిర్మించిన గ్రూప్ హౌస్

నర్సీపట్నం, ఆగస్టు 8: సుమారు 50 సంవత్సరాల క్రితం పెందుర్తికి చెందిన శరగడం అప్పన్న అనే దాత, నర్సీపట్నంలోని చిద్గగనానంద మహర్షి ఆశ్రమానికి దానంగా ఇచ్చిన 4.15 ఎకరాల భూమిని దాత వారసులు ఆక్రమించుకున్న ఉదంతంపై రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సిట్‌కు ఫిర్యాదు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు పచ్చిగోళ్ల ఈశ్వరరావు, తనకు అందజేసిన వివరాలను జిల్లాలో భూ కుంభకోణాలను విచారించేందుకు ఏర్పాటైన సిట్‌కు అందజేసినట్టు ఆయన వెల్లడించారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పత్రాలను విలేకరులకు అందజేశారు.

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం కొండపై దత్తాశ్రమ వ్యవస్థాపకులైన చిద్గగనానంద మహర్షి ఆశ్రమానికి పెందుర్తికి చెందిన శరగడం వెంకటస్వామి కుమారుడు అప్పన్న 1962 ఆగస్టు 27వ తేదీన పెందుర్తి గ్రామ పట్టా నంబర్ 2699, ఇనాం మెట్టు సర్వే నంబర్ 140/2లోగల 15 సెంట్ల భూమిని చిద్గగనానంద ఆశ్రమానికి దాన పట్టాగా రాయించి, డాక్యుమెంట్ నంబర్ 2158/1962 ప్రకారం విశాఖపట్నం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. సదరు 15 సెంట్ల స్థలంలో ఆశ్రమం కట్టించి భక్తుల కోసం వినియోగించేవారు. అదేవిధంగా శరగడం అప్పన్న 1973వ సంవత్సరంలో ఆ స్థలాన్ని తన తదనంతరం ఏ విధంగా పంచుకోవాలో తెలియజేస్తూ 1973 డిసెంబర్ 22వ తేదీన విశాఖపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీలునామా రిజిస్ట్రేషన్ చేయించారు. సదరు వీలునామాలో అప్పటి ఆశ్రమ నిర్వాహకులైన అచ్యుతానంద భరతస్వామికి ఆశ్రమ నిర్వహణ ఖర్చుల నిమిత్తం మరో నాలుగు ఎకరాల భూమిని రుణ, దాన, విక్రయ హక్కులు లేకుండా వీలునామా రిజిస్ట్రేషన్ చేయించి సదరు భూమి ద్వారా వచ్చే రాబడిని మఠం నిర్వహణకు వినియోగించాలని పేర్కొన్నారు.

పెందుర్తి ప్రాంతంలో గల పట్టా నంబర్ 2698లో సర్వే నంబర్ 240/1బిలో 3.04 ఎకరాలు, పటా నంబర్ 2699లో సర్వే నంబర్ 240/2బిలో 4.71 ఎకరాలు, పటా నంబర్ 2899 సర్వే నంబర్ 241లో 1.06 ఎకరాలు, పట్టా నంబర్ 675లో సర్వే నంబర్ 271/1లో 25 సెంట్లు వెరసి.... మొత్తం 9.06 ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలను ఆశ్రమ నిర్వహణకు కేటాయించారు. అచ్యుతానంద భారతస్వామి 1991లో మృతిచెందేంత వరకూ నాలుగు ఎకరాల భూమిపై వచ్చే రాబడిని అప్పన్న కుటుంబీకులు ఆశ్రమ నిర్వహణకు ఇచ్చేవారు. 1978 సంవత్సరం వరకూ అప్పన్న వర్ధంతి రోజున ఆశ్రమం వద్ద అన్న సమారాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వారసులు నిర్వహించేవారు.

వారసుల కబ్జా

అయితే శరగడం అప్పన్న వారసులు పెందుర్తిలో నిర్మించిన ఆశ్రమాన్ని నేలమట్టం చేసి, అక్కడ వాణిజ్య సముదాయం నిర్మించి అద్దెలకు ఇచ్చారని మంత్రి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అదే విధంగా ఆశ్రమ నిర్వహణకు ఇచ్చిన నాలుగు ఎకరాల భూమిని కూడా అప్పన్న వారసులు ఆక్రమించుకున్నారని, సదరు భూమిలో కూడా వాణిజ్య సముదాయం, అపార్ట్‌మెంట్‌లు నిర్మించారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ల ప్రకారం సదరు 4.15 ఎకరాల భూములు చిద్గగానానంద ఆశ్రమానికి చెందుతాయని, అధికారులు ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి, చట్ట ప్రకారం సదరు ఆస్తులను ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించాలని సిట్ అధికారులను కోరినట్టు మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు.

చంపేస్తామంటూ బెదిరింపులు

ఆశ్రమ నిర్వాహకులు తమకు చెందిన దాన భూముల గురించి దాత వారసులను వెళ్లి అడిగితే, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. దానం ఇచ్చినట్టుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు ఉన్నా, శరగడం అప్పన్న వారసులు ఆశ్రమ నిర్వాహకులను చంపేస్తామంటూ బెదిరించడంపై పోలీసు, రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

మెలకువలతో కూడిన బోధన ముఖ్యం

కస్తూర్బా పాఠశాలల గణిత ఉపాధ్యాయినిలకు వృత్యంతర శిక్షణ





హాజరైన గణిత ఉపాధ్యాయినిలు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్

నర్సీపట్నం టౌన్: మెలకువలతో కూడిన గణిత బోధనను విద్యార్థినులకు అందించినప్పుడే పాఠశాలల్లో శత శాతం ఫలితాలు వస్తాయని వృత్యంతర శిక్షణ రీసోర్స్ పర్సన్‌లు డి.ఎన్.బి.వర్మ, కె.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వేములపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లాలోని అన్ని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుల(సీఆర్‌టీ)కు ఒకరోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంగ్ల మాధ్యమంలో గణిత బోధనను బాలికలకు అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు. ఇందుకు అవసరమైన మెలకువలను సీఆర్‌టీలకు వివరించామన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మీ పాఠశాలల్లో విద్యార్థినులకు వివరించి, పరీక్షల్లో శత శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సీఆర్టీల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేములపూడి, కోటవురట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలల ప్రత్యేకాధికారులు కూండ్రపు భవాని, వెంకటరామ తులసి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

చోద్యం ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు ఆరోపణ

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో ఏడేళ్లుగా జరుగుతున్న ఉపాధి పనుల్లో అనేక అక్రమాలు జరిగాయని ఎంపీటీసీ నాతిరెడ్డి అప్పలనాయుడు ఆరోపించారు. మంగళవారం ఆయన ఉపాధి పనులు చేపట్టిన వివిధ ప్రదేశాలను విలేఖర్లకు చూపించారు. చోద్యంలో గ్రామానికి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎటుంటి జాబ్‌కార్డు లేకపోయినా చెరువులను తవ్వించారని అప్పలనాయుడు తెలిపారు. కోరుప్రాలు నాగామణి అనే వీఆర్‌పీ తన భర్త పోలుపర్తి నూకరాజు (ప్రస్తుత ఆర్టీసీ డ్రైవర్)గా పనిచేస్తుండగా, భర్త పేరును కోరుప్రోలు నూకరాజుగా మార్చి బోగస్ జాబ్‌కార్డును సృష్టించి పనులకు వెళ్లకుండా మస్టర్లు వేశారని ఆరోపించారు. 2008-2017 వరకు సుమారు లక్ష రూపాయాలు దోచుకున్నట్లు వెల్లడించారు. చోద్యం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీపాద నరసింహమూర్తి తన జిరాయితీ భూమిలో ఎటుంటి జాబ్‌కార్డు లేకపోయినా చేపల చెరువును పంచాయతీ చెరువుగా చిత్రీకరించి రూ.2 లక్షలు నిధులు పక్కదారి పట్టించారన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు ఎటువంటి క్యాటిల్ ఫౌండ్స్(చెరువులు) తవ్వించకపోయినా రూ.6,80,616 బిల్లులను స్వాహా చేసినట్లు ఆరోపించారు. కోరుప్రోలు పాపారావు పనిలోకి వెళ్లకుండా రూ.66 వేలు పనిచేసినట్లు రికార్డులో పేర్కొన్నారన్నారు. జీలుగు నాగమణి అనే ఐదు రోజుల


ప్రభుత్వ చెరువుగా చూపిన జిరాయితీ భూమి

బాలింత జాబ్‌కార్డు మీద బీనామీ పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. శ్రీపాద నరసింహమూర్తి మాట్లాడుతూ తాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నాని, తనకు జాబ్‌కార్డు ఉండదన్నారు. అయితే తన చెరువును ప్రభుత్వ చెరువుగా ఎలా చూపించారో తనకు తెలియదని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై గొలుగొండ ఏపీవో సుప్రీయ వద్ద ప్రస్తావించగా ఎంపీటీసీ తనకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురికి ఎంపీడీఓలుగా పదోన్నతి

విశాఖపట్నం : జిల్లాలో ముగ్గురికి ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని నియామక ఉత్తర్వులు జారీచేశారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావును ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ అక్కడే నియమించారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాయలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ అదే కార్యాలయంలో నియమించారు. విశాఖ జడ్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఉబ్బేటి మధుమోహన్‌ను పాడేరు ఎంపీడీవోగా నియమించారు. జి.మాడుగులలో ఎంపీడీవో పనిచేస్తున్న పద్మజ వ్యక్తిగత కారణాలతో అంతర్ జిల్లా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్‌ను పూర్తి అదనపు బాధ్యతల ఎంపీడీవోగా నియమించారు.

ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు...

జిల్లాలో జడ్పీ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించారు. కణితి జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామిరెడ్డికి పెదబయలు జడ్పీ హైస్కూల్ సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. పాములవాక హైస్కూల్‌లో పనిచేస్తున్న సత్యనారాయణరాజును ముంచంగిపుట్టు జడ్పీ హైస్కూల్‌కు, ఎ.కోడూరులో పనిచేస్తున్న శరత్‌బాబును జీకే వీధి జడ్పీ హైస్కూల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

భూములు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- అనకాపల్లి తహసీల్దార్ సత్యనారాయణ
- జిరాయితీ సర్వే నంబర్లు చూపి ప్రభుత్వ భూముల విక్రయం
- సిట్‌కు వస్తున్న అధిక ఫిర్యాదులు ఇవే
- ఫిర్యాదులపై క్షేత్ర పరిశీలన

కొత్తూరు (అనకాపల్లి): భూములను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అనకాపల్లి తహసీల్దార్ బి.సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి మండలంలోని సంపతిపురం, సుందరయ్యపేట, కొత్తూరు పంచాయతీల్లో సిట్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిరాయితీ సర్వే నంబర్లు వేసి ప్రభుత్వ భూములను అమ్మకం చేసినట్లు సిట్‌కు దరఖాస్తులు అధికంగా వస్తున్నాయన్నారు. అడంగల్, వన్‌బీ కాపీలతోపాటు స్థానిక వీఆర్వో, సర్వేయర్లను భూమి వివరాలకు సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన సిట్ దరఖాస్తుల్లో అధికంగా ఇటువంటి కేసులే ఉన్నాయన్నారు. కొత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ వద్ద సర్వే నంబర్ 322 కూడా ఇటువంటిదేనన్నారు. 11 మంది రైతులు సాగు చేసుకుంటున్న భూమి ఆన్‌లైన్‌లో చెరువుగా నమోదై ఉందన్నారు. దీనిపై


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

సమగ్ర విచారణ జరిపి నివేదిక తయారు చేస్తామన్నారు. అనంతరం సంపతిపురం గ్రామంలో సర్వే నంబర్లు 115, 127, 150, 174 తదితరాలపై వచ్చిన సిట్ దరఖాస్తును పరిశీలించారు. సుందరయ్యపేట గ్రామకంఠాన్ని, చెరువును ఆక్రమించి క్వారీ, క్రషర్ యాజమానులు రహదారిని నిర్మించారని వచ్చిన సిట్ దరఖాస్తును పరిశీలించారు. గ్రామ పంచాయతీ, సభ్యుల తీర్మానంతో రైతులు పొలాలకు వెళ్ళేందుకు రహదారిని ఏర్పాటు చేసినట్లు తీర్మానం కాపీ ఉందన్నారు. గ్రామ రెవెన్యూ రికార్డులు, రైతుల వివరాలతో కూడిన నివేదికను తయారు చేసి సిట్‌కు సమర్పిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్‌కుమార్, వీఆర్వో సాహితీ, నిర్మల, సూరిబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చకామెర్లతో గిరిజనుడి మృతి

కొయ్యూరు: మర్రివాడ శివారు దొడ్డవరం గ్రామానికి చెందిన జలుమూరి వెంకటరమణ(34) అనే గిరిజనుడు ఐదు రోజులుగా జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. జ్వరంతోపాటు పచ్చకామెర్లు సోకిన వెంకటరమణకు పసర మందు ఇప్పించడం కోసం తూర్పుగోదావరి జిల్లా కింద్ర గ్రామానికి ఉదయం తీసుకు వెళ్లారు. మధ్యాహ్నం మృతి చెందాడని మర్రివాడ మాజీ సర్పంచ్ మాదల చిన్నారావు తెలిపారు.

జీడి పరిశ్రమ పొగతో విద్యార్థుల అవస్థలు

- కళ్లల్లో పడుతున్న బూడిద
- త్వరలో నోటీసు ఇస్తాం : సర్పంచ్

పాయకరావుపేట : మండలంలోని పాల్తేరులో ఉన్న జీడి పిక్కల ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ కాలుష్యంతో గ్రామస్థులతోపాటు, ఉన్నత పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు సమీపంలో ఉన్నత పాఠశాల ఉండడంతో జీడి పరిశ్రమ పొగ, బూడిద రేణువులు తమ కళ్లలో పడుతున్నాయని విద్యార్థులు తెలిపారు. జీడిపిక్కల ఫ్యాక్లరీ పొగ బయటకు పోయేందుకు చిమ్నీ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు పనిచేసే ఈ ఫ్యాక్టరీ నుంచి అధిక మొత్తంలో వెలువడుతున్న పొగ గాలికి గ్రామంవైపు వస్తుందన్నారు. రోజూ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు అధిక ంగా పొగ వెలువడుతుందని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల కంటి సమస్యలు వస్తుండగా బూడిద రేణువులు పలువురి కళ్ళలోపడి మంటలు పుడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పొగ కారణంగా కంటి జబ్బులు వస్తున్నాయని చెప్పారు. దీనిపై పంచాయతీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పంచాయతీతోపాటు అధికారులు చర్యలు తీసుకోవాలని


జీడి పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కోరుతున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ కడింపల్లి నాగేశ్వరరావు వద్ద ప్రస్తావించగా జీడిపిక్కల నుంచి వస్తున్న పొగతో గ్రామస్థులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం పంచాయతీ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసు ఇస్తామని ఆయన తెలిపారు.

వ్యవసాయ యాంత్రీకరణతో అభివృద్ధి

అరకులోయ: వ్యవసాయంలో యాంత్రీకరణపై అవగాహనతో పాటు వినియోగం కడా పెరిగితేనే రైతులు అభివృద్ధి చెందుతారని వ్యవసాయ శాఖ ఏడీ శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అరకులోయ విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అరకులోయ పర్యటనకు విచ్చేస్తున్న దృష్ట్యా బహిరంగ సమావేశ స్థలి వద్ద తమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టాల్స్‌లో వ్యసాయంలో వినియోగించే యాంత్రీకరణ పనిముట్లుతో పాటు పవర్‌టిల్లర్లు, ట్రాక్టర్లు, తదితర పనిముట్లను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. ఇక్కడ హాజరయ్యే గిరి రైతులకు వాటి వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం వాటిపై గిరిరైతులకు అందిస్తున్న రాయితీ, రాయితీ పోను రైతులు చెల్లించాల్సినవి, తదితర అంశాలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఏవో సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ శంకర్‌రెడ్డి







టీడీపీ సీనియర్ నేత జానకిరామ్ మృతి

డుంబ్రిగుడ, ఆగస్టు 8: తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు నెమలిపూరి జానకిరామ్ సోమవారం రాత్రి మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలను అందించిన జానకిరామ్.. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటసీమలో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, జన్మభూమి కమిటీ సభ్యులు కె.సుబ్బారావు, ఎం.స్వామి, మాజీ ఎంపీపీ ధన్నేరావు, మాజీ సర్పంచ్ అప్పలరాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు వై.సుబ్బారావు జానకిరామ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ జానకిరామ్ మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు.

వాలీబాల్ టోర్నీ విజేత అనంతగిరి

అనంతగిరిరూరల్: ఆదివాసి దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో అనంతగిరి విజేతగా నిలిచింది. స్ధానిక రైజ్ సంస్థ ప్రతినిదులు మండలంలోని అనంతగిరి ఎగువశోభ పంచాయతీలలో ఆసక్తిగల వాలీబాల్ క్రీడాకారులకు ఈ పోటీలను నిర్వహించారు. క్రీడల ద్వారా మెదడు చురుకుగా ఉండడమే కాకుండా శారీరక ధారుడ్యం కూడా పెరుగుతుందని సంస్ద డైరెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ పోటీలలో 8జట్లు పాల్గొన్నాయన్నారు.

పెదబయలు: మండలంలో 23 పంచాయతీల్లో గత వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం పారదర్శకంగా విధులు నిర్వహించాలని బీజేపీ గిరిజన మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి విరేశలింగం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సంబంధిత శాఖ వారు సామాజిక బర్బందం వెనకల జతకడుతున్నారన్నారు. కావునా తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. సంవత్సరానికి ఈ తనిఖీలను చేపట్టడంతో నిధులు స్వాహా తప్పా, ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులంతా పనులు చేపట్టిన కూలీలకు అందివ్వకుండా సంబంధిత అధికారులు జేబులునింపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ జిల్లా కార్యదర్శి ఆనందరావు, జి.నాగేశ్వరావు, కె.రామన్న, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

'పారదర్శకుంగా సామాజిక తనిఖీలు'











పాలిథిన్ ఉపయోగిస్తే చర్యలు

అరకులోయ: పాలిథిన్ కవర్లు ఉపయోగిస్తేచర్యలు తప్పవని డీఎల్‌పీవో ఉషారాణి హెచ్చరించారు. మంగళ వారం అరకులోయలో ఆమె పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాలిథిన్ వాడ కంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. మానవాళికి నష్టం చేకూర్చే పాలిథిన్ నిషేధానికి వ్యాపార వర్గాలు, ప్రజలు సహకరించాలన్నారు.

సీఎం ప్రకటించిన విధంగానే ఆదివాసీ దినోత్సవం: కిడారి

అరకురూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అరకులో ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఏడాదే సభా ముఖంగా ప్రకటించారని.. ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు తెలిపారు. అదే విధంగా అరకులోయలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఏర్పాటు చేశారన్నారు. బహిరంగ సభావేదికను పార్టీ నాయకులతో కలిసి పరిశీలనకు విచ్చేసిన ఎమ్మెల్యే కిడారి విలేకరులతో మాట్లాడారు.. రాష్ట్రంలో ఉండే అన్ని ఐటీడీఏలను నుంచి గిరిజన కళాకారులు పెద్ద ఎత్తున వస్తున్నారని తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి సదస్సు సీఎం దత్తత పంచాయతీ అరకులోయలో జరుగుతుండటం, ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. మన్య ప్రాంత సమస్యలు పరిష్కారంకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవచూపిస్తున్నారని, అవసరమున్న నిధులు మంజూరు చేస్తూ గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోతో పాటు జిల్లా యంత్రాంగం అంతా ప్రత్యేకంగా చర్యలు చేపడుతుందన్నారు. సుమారు 20 వేల మంది గిరిజనం పాల్గొనే అవకాశం ఉందన్నారు. స్టాల్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తితో ఏర్పాట్ల విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి సోమ, వైస్ ఎంపీపీ అమ్మన్న, పెదలబుడు సర్పంచ్ గులాభీ, మాజీ సర్పంచ్ రఘునాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు బాబురావు తదితరులు ప్రాంగణాన్ని పరిశీలించారు.


సభాస్థలి వద్ద ఎమ్మెల్యే కిడారి

పెదబయలు గురుకుల విద్యార్థులకు జ్వరాలు

పెదబయలు: మండలంలోని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులు గత మూడు రోజుల నుంచి విష జ్వరాలు, విరేచనాలతో మంచం పట్టారు. మూడు గడుస్తున్నా వ్యాధులు తగ్గకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వంతాల సాగర్, కిల్లో మల్లేశ్వరావు, పాంగినారాయణ, వండాల పరశురాంతో పాటు మరికొంత మంది విద్యార్థులు పలు రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. కళాశాలలో తోటి విద్యార్థులే వారికి ఆస్పత్రికి తరలించి చేర్పించారు. తక్షణమే కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విద్యార్థులు దనుర్జయ్, చంద్రశేఖర్, బాబుజీ, హరిష్ తదితరులు కోరుతున్నారు.


జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులు

జీవో 97 రద్దుతో మన్యాన్ని కాపాడాలి

ఆదివాసి వికాస్‌పరిషత్ కార్యదర్శి డాక్టర్ నర్శింగరావు



అనంతగిరి: ఆదివాసీ దినోత్సవం రోజున జీవో 97 ను రద్దు చేసి మన్యాన్ని కాపాడాలని.. ఆదివాసి వికాస్‌పరిషత్ కార్యదర్శి డాక్టర్ నర్శింగరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యంత్రి, గవర్నర్ ఆదివాసీ దినోత్సవం రోజు అరుకులోయలో బహిరంగసభ ఏర్పాటు చేసి దానికి విచ్చేస్తుండడం గిరిజనుడిగా తాను సంతోషిస్తున్నానన్నారు. ఇప్పటికే అన్‌రాక్ సంస్థ నుంచి బాక్సైట్ ఒప్పందాలు రద్దు చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే జీవో 97కూడా రద్దుచేసి ఆదివాసీ దినోత్సవ కానుకగా గిరిజనులకు అందించాలని కోరారు. అదే విధంగా ఉమ్మడి రాష్ట్రంలో అమలవుతున్న ఐదె షెడ్యూల్‌ను మార్పు చేస్తూ రీ షెడ్యూల్ చేయాలన్నారు. దీనివల్ల గిరిజనులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని గిరిజనేతర ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాలను తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళాతామని తెలిపారు.

చంద్రన్న బీమా అందజేత

అరకురూరల్: ఇరగాయి పంచాయతీ కుందిగుడ గ్రామంకు చెందిన గడభంటు గున్నమ్మ అనే మహిళకు.. చంద్రన్న బీమా పథకం నుంచి తక్షణ సాయం రూ.5 వేలు మంజూరైంది. మంగళవారం ఎన్టీఆర్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అందజేశారు. ఆమె బ్యాంకు ఖాతాకు మరో రూ. 25 వేలు జమ అయ్యాయని ఏపీఎం రాజుబాబు తెలిపారు. అదే విధంగా వితంతు పించన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎంకు ఎమ్మెల్యే సూచించారు. గున్నమ్మ భర్త సింహాద్రి ఇటీవలే మృతి చెందాడన్నారు. ఇదే పంచాయతీలో మరో ఇద్దరికీ మంజూరు అయ్యాయని సర్పంచ్ బుట్కి తెలిపారు.

ఆదివాసీలకు ఆహార భద్రత ఏదీ..?

- కుటుంబ సభ్యులు ఎక్కువ.. రేషన్ తక్కువ
- సాంకేతికతతో సక్రమంగా అందని సరుకులు
- గిరిజనులు వ్యయప్రయాలకోర్చినా దక్కని ఫలితం
- పోషకాహార లోపంతో తరచూ మరణాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

అనకాపల్లి: దేశ స్థూల జాతీయ ఆదాయ అంచనాలతో పోషకాహారం అందని వారి సంఖ్య పోటీ పడుతున్నది. ఈ పోటీలో ప్రత్యేకంగా ఆదివాసీలు ముందంజలో ఉంటున్నారు. జిల్లా కేంద్రానికి విసిరేసినట్టుగా ఉండడం... సాంకేతిక విప్లవానికి దూరం కావడం... కనీస సదుపాయాలు లేకపోవడం.. నిరక్షరాస్యతతో అవగాహన లోపించడం.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక లోపాలు అమాయక గిరిజనులకు పోషకాహార సమస్యను సృష్టిస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా సవతి తల్లి ప్రేమ చూపుతుండడంతో వారి ఆహార సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. వెరసి ప్రతి ఏటా పోషకాహార లోపంతో మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు, పాలకులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం ఆదివాసీల దౌర్భాగ్యంగా చెప్పవచ్చు.

ఆహార భద్రతను ఆహార హక్కుగా గుర్తించి ప్రజలందరికీ నాణ్యమైన ఆహారాన్ని చౌక ధరకు అందజేయడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వం 2013 సెప్టెంబరులో 'ఆహార భద్రత చట్టాన్ని' తీసుకు వచ్చింది. ఈ చట్టానికి ముందే సుప్రీం కోర్టు 'ఆహార హక్కు' (పీయుసీసీ వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) కేసులో వివరమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాలు 75 శాతం, పట్టణాలలో 50 శాతం ప్రజలకు ఆహార భద్రత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక మనిషికి, ఒక నెలకు ఐదు కిలోల ఆహారం (బియ్యం/గోధుమలు) ఒక హక్కుగా లభిస్తుందని చెప్పారు. అయితే ఐసీఎంఆర్ (ఐసీఎంఆర్- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి) మార్గదర్శకాల ప్రకారం ఒక మనిషికి, ఒక నెలకు కనీసం 14 కిలోలు కావాలి. చట్టం ద్వారా ఇస్తామన్నది కేవలం ఐదు కిలోలే. ఇవి కూడా అమాయక ఆదివాసీలకు సక్రమంగా అందకపోవడంతో వారిలో పోషకాహార లోపం ప్రస్ఫుటమవుతోంది.

గిరిజనులను ముంచుతున్న సాంకేతికత

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం మైదాన ప్రాంతాలకు తీసుకువస్తున్న సాంకేతిక ప్రక్రియను ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండానే యథాతథంగా వర్తింపజేస్తున్నది. ఇందులో భాగంగా బయోమెట్రిక్ ద్వారా ప్రతి నెలా రేషన్ తీసుకోవాల్సి ఉంది. అలాగే ఆధార్ గుర్తింపును దానికి అనుసంధానం చేయాలి. తాజాగా బ్యాంకు ఖాతాను కూడా లింకు చేయాలని సూచించింది. నెటవర్క్ అంతంతమాత్రంగానే ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఈ ప్రక్రియ అమలుకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రభావం అమాయక ఆదివాసీలపై తీవ్రంగా పడుతోంది.

కుటుంబీకులు ఎక్కువ... రేషన్ తక్కువ!

ఐసీఎంఆర్ (ఐసీఎంఆర్- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి) మార్గదర్శకాల ప్రకారం ఒక మనిషికి, ఒక నెలకు కనీసం 14 కిలోలు కావాలి. చట్టం ద్వారా ఇస్తామన్నది కేవలం ఐదు కిలోలే. ఇందులోనూ చాలా మందికి కోత పడుతుండడం విచారకరం. హకుంపేట మండలంలోని సుకురు పంచాయతీ మేభా గ్రామంలో 53 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 2014 వరకు కార్డులోని కుటుంబ సభ్యుల ప్రకారం రేషన్ లభించేది. ఆ తర్వాత కార్డులో ఎంతమంది ఉన్నా ఐదు కిలోలు మాత్రమే ఇస్తున్నారు. ఉదాహరణకు బాలన్న రేషన్ కార్డులో ఐదుగురు సభ్యులు ఉండగా, రేషన్ ఇస్తున్నది కేవలం ఐదు కిలోలే. కార్డులో ఉన్న వారందరికీ ఆధార్ చేయించినా రేషన్ కార్డులో మిగిలిన వారి పేర్లు చూపించనందున ఈ దుస్థితి తలెత్తింది.

అలాగే చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన 40 రేషన్ కార్డులకు ఈ విధంగా సగానికి సగం రేషన్ తగ్గిపోయింది. అధికారులను అడిగితే ఆధార్ సీడింగ్ కాలేదని చెబుతున్నారు. అలాగైతే గత నెల ఎలా ఇచ్చారు..? అని గిరిజనుల ప్రశ్నలకు తమ చేతుల్లో లేదని దులిపేసుకుంటున్నారు.

కొండకోనలు దాటినా అందని రేషన్

ఆదివాసీ ప్రాంతాలలో జనన, మరణాలు వివరాల నమోదు ఉండదు. రేషన్ కార్డు ఇచ్చేటప్పుడే అధికారులు తోచిన వయసు వేస్తారు. రేషన్, ఆధార్ కార్డుల్లో వయస్సు తేడా వస్తే అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారా తయారవుతున్న రేషన్ కీ-రిజిస్టర్ల నుంచి పేర్లు తొలగిపోతున్నాయి. అవి మరో రేషన్ షాపు జాబితాలో దర్శనం ఇస్తున్నాయి. కొండలు దాటుకొని అంత దూరం వెళ్లలేక రేషన్ వదిలి వేస్తున్నారు. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే కార్డు రద్దయ్యే ప్రమాదం ఉంది. ఇక ఫిర్యాదులు అందించడానికి గిరిజనులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

నగదు బదిలీతో చిక్కులు ఎన్నో..!

తాజాగా మరో ప్రయోగానికి ప్రభుత్వ తెర లేపింది. రేషన్ తీసుకోవాలంటే నగదు చెల్లించనవసరం లేదు. రేషన్‌కార్డు, బయోమెట్రిక్ గుర్తింపు, ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలి. రేషన్ తీసుకోగానే డీలరు వద్ద ఉన్న మిషన్‌లో వివరాలు నమోదు చేస్తే ఖాతా నుంచి డబ్బు బదిలీ అవుతాయి. అలా జరగాలంటే ఖాతాలో నగదు తగ్గకుండా చూసుకోవాలి. నగదు తక్కువ ఉంటే బదిలీ జరగదు. ఇలాంటి సందర్భంలో గిరిజనులకు అనేక చిక్కులు ఎదుర్కోక తప్పదు.

సాంకేతికతతో ఏజెన్సీకి సడలింపు అవసరం

సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో సాంకేతిక ప్రక్రియను ఉపయోగించడం మంచిదే. అయితే, నెట్‌వర్క్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఏజెన్సీ ప్రాంతానికి ఈ విషయంలో మినహాయింపులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే సమస్య ఎదురైతే వెంటనే సరిచేసే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందిస్తే ఆదివాసీలకు కొంత ఊరట లభిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి ఆనంద్‌బాబు

సంక్షేమ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి ఆనంద్‌బాబు

మేహాద్రిగెడ్డ గురుకుల విద్యాలయాల తనిఖీలు

నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి

విశాఖపట్నం: ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వైద్య వసతి కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన శాఖా మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలను మంత్రి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాఠశాలలో రికార్డులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో భోజన ఏర్పాట్లు పరిశీలించి భోజనం కోసం వినియోగించే ఆహారధాన్యాలు నాణ్యంగా లేవంటూ మంత్రి అసహనం వ్యక్తం చేశారు. వసతిగృహం నిర్వహణ సరిగాలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరైనా టెండర్లు పిలవడంలో అలసత్వం వహించిన సంక్షేమ శాఖ ఈఈ ఆదినారాయణపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఏజెన్సీల్లో అనారోగ్య ఘటనలు దృష్టిలో ఉంచుకుని గిరిజనుల వైద్య, విద్యపై మరింత శ్రద్ధ వహిస్తున్నామన్నారు. మంత్రి వెంట పలువురు అధికారులు, ప్రిన్సిపాల్ రామారావు ఉన్నారు.

మన్యంలో 20 శాతం మందికే వంట గ్యాస్

లక్ష్యం 54,707 కుటుంబాలు.. పంపిణీ 11,200 మందికే!

ఐదు కిలోల సిలిండర్ల కొరతే కారణమంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

పొగరహిత మన్యానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. మైదాన ప్రాంతంతో పాటు ఏజెన్సీలో ప్రతీ ఇంటికి వంట గ్యాస్ సిలిండర్లు అందించాలనే ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి రెండు నెలలు గడిచిపోతున్నా సిలిండర్లు అందక, ఎప్పుడొస్తాయా తెలియక లబ్ధిదారులు ఎదురు చూపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏజెన్సీలోని 11 మండలాల్లో ఫిబ్రవరిలో సర్వే నిర్వహించి సుమారు 65 వేల కుటుంబాలకు వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని అధికారులు నిశ్చయించారు. ఆన్‌లైన్ విధానంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో గిరిజనుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీనికి కారణాలను అన్వేషించిన అధికారులు గ్యాస్ వినియోగంపై అవగాహన లేకపోవడమే కారణంగా గుర్తించారు. దీనికితోడు గిరిజన ప్రాంతంలో రహదారుల లేమి కారణంగా మారుమూల ప్రాంతాలకు సిలిండర్లు తీసుకెళ్లడం కష్టమని భావించారు. అలాగే ప్రతి నెలా గ్యాస్‌కు ధర చెల్లించి కొనుక్కొనేకంటే, అడవుల్లో ఉచితంగా దొరికే కర్రలపై మక్కువ చూపుతున్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో మారుమూల ప్రాంతాలకు సునాయాశంగా మోసుకుని వెళ్లేందుకు వీలుగా ఐదు కిలోల సిలిండర్లు ఉచితంగా అందించాలని నిర్ణయించారు.

గ్యాస్ కంపెనీలతో చర్చించినా..

ఏజెన్సీలో ఐదు కిలోల వంట గ్యాస్ సిలిండర్లు సరఫరాకు ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జేసీ సృజన రెండుసార్లు సమావేశం నిర్వహించారు. తొలి విడత 54,707 కుటుంబాలకు ఐదు కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు, రెగ్యులేటర్, పైపు, గ్యాస్‌స్టౌవ్ ఉచితంగా అందజేయాలని నిర్ణయించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి జూన్ నెలాఖరు నాటికి అందరికీ వంటగ్యాస్ అందజేయాలని చర్యలు చేపట్టారు. 11 మండలాల్లో ఐఓసీ కంపెనీ తరుపున 20,893, హెచ్‌పీసీ 12737, బీపీసీ 11083 ఎల్‌పీజీ కనెక్షన్లు అందజేయాలని ప్రతిపాదించారు. ఆయా కంపెనీల తరుపున ఇప్పటికే ప్రతి లబ్ధిదారునికి గ్యాస్ పస్ పుస్తకం, స్టౌవ్, పైపు, రెగ్యులేటర్లు అందించినా కొత్తగా ప్రతిపాదించిన ఐదు కిలోల సిలిండర్లు మాత్రం పంపిణీ చేయలేకపోయారు. చిన్న సిలిండర్ల తయారీకి ఆయా కంపెనీలు ఇండెంట్ పెట్టినా, కావాల్సినన్ని సిలిండర్లు కంపెనీలకు రాకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో జూన్ నెలాఖరు నాటికే ప్రతి గిరిజన కుటుంబానికి వంట గ్యాస్ అందజేయాలని భావించిన అధికారులు కేవలం 11,200 మందికి మాత్రమే ఇవ్వగలిగారు. గిరిజనుల తరపున సిలిండర్ల కోసం రాయితీ మొత్తం సుమారు రూ.3 కోట్లు కంపెనీలకు చెల్లించినా, ఐదు కిలోల సిలిండర్లు ఉత్పత్తి లేక పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతున్నట్టు తెలిసింది. ఇదిలా వుండగా, ఇప్పటికే గ్యాస్ నెపంతో గిరిజన ప్రాంతంలో కిరోసిన్ సరఫరా కూడా నిలిపేశారు. దీంతో గిరిజనుల పరిస్థితి రెండికీ చెడ్డ రేవడిగా మారింది.

గ్యాస్ కంపెనీలకు జేసీ లేఖ..

గిరిజనులకు వంటగ్యాస్ సిలిండర్లు అందించడంలో జరుగుతున్న జాప్యంపై జేసీ సృజన గ్యాస్ కంపెనీలకు లేఖ రాసినట్టు తెలిసింది. ఇప్పటికే గిరిజనులకు రెగ్యులేటర్లు, పైపులు, స్టౌవ్‌లు అందజేశామని, సాధ్యమైనంత త్వరలో సిలిండర్లు కంపెనీలకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సరఫరా చేయాలని లేఖలో ఆమె పేర్కొన్నట్టు సమాచారం.

'ఆదివాసీ ఉత్సవాల నిర్వహణ సబబు కాదు'

విశాఖపట్నం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క గిరిజనుడికీ అటవీ హక్కు పత్రాలు ఇవ్వకుండా ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించడం సబబు కాదని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. జగదాంబ సెంటర్ పరిధి ఎల్లమ్మతోటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాక్సైట్ తవ్వకాలకు సంబంధించిన జీవో నంబర్ 97ను రద్దు చేయకుండా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పేరుతో గిరిజనుల్ని మభ్యపెట్టేందుకు చంద్రబాబు అరకు వస్తున్నారన్నారు. విశాఖ గిరిజన ప్రాంతాల్లో ఈ ఏడాది సుమారు 98 మంది గిరిజనులు మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో మృతి చెందారని, వారికి రూ.10 లక్షల నష్టపరిహారం, 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిపప్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి టి.చిట్టిబాబు పాల్గొన్నారు.





ఆదివాసీ ఆరోగ్యం

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ 'ఆదివాసీ ఆరోగ్యం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమైన రక్తహీనత(ఎనీమియా)ను నియంత్రించడంతోపాటు ఇతర రోగాలతో బాధపడే విద్యార్థులను సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించింది. పాఠశాల విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఆన్‌లైన్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఐటీడీఏ పీవో సమాచారాన్ని తెలుసుకునేందుకు సీఎం డ్యాష్‌బోర్డుతో అనుసంధానం చేసి స్పర్స్(ఎస్‌పీఏఆర్ఎస్‌హెచ్) యాప్ రూపకల్పన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కానుక

నేడు గవర్నర్ నరసింహన్ చేతులు మీదుగా హెల్త్ వలంటీర్లకు ట్యాబ్‌ల పంపిణీ

చింతపల్లి: ఏజెన్సీలోని 145 పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న సుమారు 44 వేల మంది విద్యార్థులకు 'ఆదివాసీ ఆరోగ్యం' లబ్ధి చేకూరనున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం అరకులో నిర్వహించే ఆదివాసీ దినోత్సవంలో ఆశ్రమ పాఠశాలల ఆరోగ్య కార్యకర్తలకు స్పర్స్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అందజేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేసింది.

విశాఖ ఏజెన్సీలో ఆదివాసీ విద్యార్థులు అత్యధికంగా రక్తహీనత(ఎనీమియ) సమస్యతో బాధపడుతున్నారు. గత ఏడాది అనారోగ్యంతో 22 మంది విద్యార్థులు, ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యానికి సంబంధించి 'ఆంధ్ర జ్యోతి' పలు కథనాల ను ప్రచురించిన విషయం తెలిసిందే. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీరియస్‌గా తీసుకున్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధతీసుకునేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌ని ఆదేశించారు. ఈ మేరకు 'ఆదివాసీ ఆరోగ్యం' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల ఒకటిన అధికారికంగా ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నుంచి అన్ని ఆశ్రమ పాఠశాలల్లో అమలు కానున్నది.

ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షణ

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలల్లో ఐటీడీఏ ఇప్పటికే హెల్త్ వంటీర్లను నియమించింది. ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమాన్ని హెల్త్ వంలంటీర్ల ద్వారా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేసింది.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు గిరిజన సంక్షేమ శాఖ స్పర్స్ అనే యాప్‌ని రూపొందించింది. ఈ యాప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ పనిచేస్తుంది. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఆర్యోగ కార్యకర్తలకు పంపిణీ చేస్తారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి వివరాలు వెంటనే ఈ ట్యాబ్ సహాయంతో హెల్త్ వలంటీర్ నమోదు చేయాలి. ఈ సమాచారం ఆన్‌లైన్ ద్వారా ఐటీడీఏ పీవో, డీప్యూటీ డైరెక్టర్, డీఎంహెచ్‌వోలకు చేరుతుంది. విద్యార్థిలకు అందించాల్సిన వైద్యం గురించి వెంటనే సంబంధిత వైద్యాధికారులు హెల్త్ వంలంటీర్‌కు సమాచారం అందిస్తారు. విద్యార్థి చిన్నపాటి అస్వస్థతకు గురైనా... ఈ స్పర్స్ ద్వారా టీడబ్ల్యూ కమిషనర్, ముఖ్యమంత్రి వరకూ సమాచారం చేరుతుంది. దీంతో వెంటనే సేవలు అందించి విద్యార్థిని ప్రాణపాయ స్థితి నుంచి కాపాడవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది.

రక్తహీనత నివారణకు అధిక ప్రాధాన్యం

ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమంలో రక్తహీనత (ఎనీమియా)ను నియంత్రించేందుకు గిరిజన సంక్షేమ శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తున్నది రక్త కణాల్లో హిమోగ్లోబిన్ 11 గ్రాములుకంటే తక్కువగా వుంటే ఎనీమియాగా గుర్తించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల్లో ఏడు, ఎనిమిది గ్రాములకు మించి వుండడం లేదు. రక్తహీనత కారణంగా వ్యాధినిరోధక శక్తితగ్గిపోతున్నది. త్వరగా రోగాలబారిన పడతారు. పరిస్థితి విషమిస్తే మరణం సంభవిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను నివారించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. మలేరియా, అతిసార, ఇతర రోగాలతో బాధపడే విద్యార్థులకు సంబంధించి కూడా నిత్యం ఉన్నతాధికారుల ఆన్‌లైన్ పర్యవేక్షణ వుంటుంది. విద్యార్థికి అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారానే పరిశీలిస్తారు.

హెల్త్ వంటీర్లకు రక్త పరీక్షలపై శిక్షణ

ఏజెన్సీలోని హెల్త్ వంటీర్లకు హిమోగ్లోబిన్, సికెల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఆరకులోయ, పాడేరు, చింతపల్లి యువత శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి రక్త పరీక్షలు చేసే కిట్‌లను అందజేస్తారు. అనంతరం హెల్త్ వంటీర్లు హిమోగ్లోబిన్(హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించి, రక్తహీనత(ఎనిమియా), సికెల్ సెల్ ఎనిమియా వున్న విద్యార్థులను గుర్తిస్తారు. వారికి మూడు నెలలపాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేస్తారు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు స్పర్స్ యాప్‌లో నమోదు చేయాల్సివుంది.

సికెల్ సెల్ ఎనిమియా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ:

సికెల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. వీరికి వారానికి ఒకసారి హెచ్‌బీ పరీక్షలు నిర్వహిస్తారు. హెచ్‌బీ ఏడు గ్రాములకంటే దిగువకు పడిపోతే వెంటనే రక్తాన్ని ఎక్కించేందుకు ఏర్పాట్లు చేస్తారు.

విద్యార్థులకు ప్రత్యేక మెనూ



రక్తహీనత, సికెల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రత్యేక మెనూ అమలు చేస్తారు. రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో గోంగూర, తోటకూర, చుక్కకూర, మెంతికూర, క్యారెట్, బీట్‌రూట్, పాలు, పప్పు దినుసులు, గుడ్డు వుండే వుండేలా చూస్తారు. బెల్లంతో తయారు చేసిన వంటకాలు, నువ్వు ఉండలు ఇస్తారు. పాఠశాలల్లో ప్రత్యేక మెనూకచ్చితంగా అమలు చేసేలా సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు.

జి.విజయకుమార్,
డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, పాడేరు

గిరిజనుల జీవనం.. ప్రత్యేకం!

పశువుల దాణాకు వాడే రాతి కుండీలు





సంప్రదాయ పరికరంతో ధాన్యం కొలుస్తున్న గిరిజనులు



పొలం దున్నేందుకు వినియోగిస్తున్న కర్ర నాగళ్లు



ఆనప డిప్పను గరెటగా వినియోగిస్తున్న మహిళ

కర్రతో చేసిన పని ముట్లతో రాగులు కొడుతున్న గిరి మహిళ





గిరి గ్రామాల్లో ఉపయోగిస్తున్న చెక్క తిరగలి

సహజసిద్ధ వనరులే పని ముట్లు

అనంతగిరి రూరల్: రోజుకో మోడల్.. వారానికో స్టైల్.. నెలకో కొత్త పరికరం.. ఇలా ఎప్పటికప్పుడు మారిపోతున్న ఆధునిక ప్రపంచంలో, గిరిజన జీవన శైలి మాత్రం సంప్రదాయాన్ని దాటడం లేదు. నేటికీ సహజసిద్ధమైన వనరుల నుంచి తయారు చేసుకున్న పరికరాల వినియోగంతోనే వారి బతుకు బాట సాగుతోంది. అడవి తల్లి ఒడే వారికి నీడ కాగా, అక్కడ లభించే రాళ్లు, చెక్కలే నిత్యావసరాలకు ఉపయోగించే వస్తువులు. ప్లాస్టిక్ వస్తువులు, ఆధునిక పరికరాలైన మిక్సీలు, గ్రైండర్లు, మిషన్లు ప్రస్తుతం రాజ్యమేలుతుండగా, గిరిజన గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ కర్రలతో చేసిన నాగళ్లు... పశువులకు దాణా వేసేందుకు కొండల్లో లభించే బండరాళ్ల కుండీలు.. దాన్యం, చోళ్లు ఆడేందుకు రాతి తిరగళ్లు.. గరిటెలకు బదులుగా చేదు ఆనపకాయడిప్పలు.. ఇలా ఒక్కటేమిటి అన్నీ సహజసిద్ధంగానే వినియోగిస్తుంటారు. అందుకే ఈ ఆధునిక యుగంలోనూ వారి జీవనశైలి ఓ ప్రత్యేకతగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి కాదు.

ప్రకృతి సోయగం.. పిల్ల కాల్వల సవ్వడి.. అందచందాల లోయల లోగిళ్లు..కొండల ఒడిలో బతుకు పోరాటం సాగిస్తున్న ఆదివాసీల జీవనం వైవిధ్యంగా ఉంటుంది. నాగరిక ప్రపంచానికి దూరంగా జీవిస్తున్నప్పటికీ అడవి బిడ్డల జీవన విధానం.. ఇతరులకు ఆదర్శంగా ఉంటుంది. వారి ఆహార అలవాట్లు, శ్రమించే తత్వం, కట్టుబొట్టు, భాష, ఆచారాలు, సంప్రదాయాలు ఒకటేమిటీ..? వారి ప్రస్థానమే ఓ వైవిధ్యం. ఆడపిల్ల పుడితే పండగ చేసుకుంటారు. ప్రపంచ 'ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా విశాఖ మన్యంలో గిరిజనులపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

వైవిధ్యం.. గిరిజన జీవనం

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కట్టుబాటు, ఆచారాలకు పెద్దపీట | ఆడపిల్ల పుడితే పండగే | స్నేహానికి అధిక ప్రాధాన్యం | కుండల్లోనే వంటలు | రాత్రి ఎనిమిది గంటలలోపే భోజనం | సేంద్రియ సాగే చేస్తారు.. | గ్రామాలకు పండ్లు, గెడ్డల పేర్లు | మహిళే కుటుంబ సారథి | విశాఖ ఏజెన్సీలో 18 తెగల జీవనం

పాడేరు:
విశాఖ ఏజెన్సీలోని 11 మండలాల్లో 244 పంచాయతీల పరిధిలో 3,574 గిరిజన పల్లెల్లో ఏడు లక్షల మంది (2011) గిరిజనులు జీవిస్తున్నారు. వారిలో 18 తెగలకు చెందిన గిరిజనులున్నారు. భగత, కొండదొర, వాల్మీకి, కొటియా, నూకదొర, కొండరెడ్డి, కొండకాపు, జాతాపు, కమ్మర, కులియా, మాలి, కోయ, నాయిక్, కోందు, పొర్జా, పరంగిపొర్జా, గదబ, డొంగ్రిగదబ (కొందు, పోర్జా, గదబ తెగలను ఆదిమ జాతి గిరిజనులుగా గుర్తిస్తారు) తెగల వారు ఉన్నారు. మొత్తం గిరిజన తెగల్లో భగత, వాల్మీకి, కొండదొరలు అభివృద్ధిలో కాస్త ముందుండగా.. ఇతర తెగలు అభివృద్ధి వైపు నడుస్తున్నాయి. ఆదిమ జాతి తెగలుగా ఉన్న కోందు, పొర్జా, గదబ గిరిజనులు అభివృద్ధి దూరంగా ఉన్నారు.

గిరిజనుల వాడుక భాషలకు లిపి లేదు..

ఏజెన్సీలో ఒడిశా రాష్ట్రానికి ఆనుకుని ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లోని గిరిజనులు ఒరియా భాషను మాట్లాడతారు. అలాగే వాల్మీకి తెగకు చెందిన గిరిజనులు కుపియా భాషను, కోందు తెగకు చెందిన గిరిజనులు కోందు భాషను మాట్లాడతారు. ఒడిశాలో గిరిజనులు మాట్లాడే ఒరియాకు లిపి ఉండగా.. ఒడిశాను ఆనుకుని ఉన్న ఏజెన్సీ గిరిజనులు మాట్లాడే ఒరియాకు మాత్రం ఎటువంటి లిపి లేదు. అయితే స్థానిక గిరిజనులు హిందీ, ఒరియా కలగలిపిన ఒరియాతో మాట్లాడతారు. దీంతో దీనిని దెసియా ఒరియా అంటారు. దీనికి ఎటువంటి లిపి లేదు. అలాగే వాల్మీకి తెగ, కోందు తెగ గిరిజనులు మాట్లాడే భాషలకు సైతం లిపి లేదు. ఏజెన్సీలో ఒడిశాను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో తప్ప పాడేరు, హుకుంపేట, అనంతగిరి, చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి ప్రాంతాల్లోని జీవించే గిరిజనులకు ఒరియా రాని పరిస్థితి చాలా ఏళ్లుగానే ఉంది.

గిరి'జన జీవన' విధానం..

ఏజెన్సీని భౌగోళికంగా చూస్తే.. జిల్లాలో సగభాగం (అంటే ఆరు వేల చదరపు కిలోమీటర్లు) విస్తరించి ఉంది. 18 గిరిజన తెగలకు చెందిన అడవి బిడ్డలు జీవిస్తున్నారు. వారిలో ఏడు లక్షల మంది ఆదిమ జాతికి చెందిన కోదు, గదబ, పోర్జా తెగల గిరిజనులున్నారు. వారు కొండకోనల్లో ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా, హాయిగా జీవించేందుకే ఇష్టపడతారు. తమకు అందుబాటులో ఉన్న అడవి, దాని చుట్టూ ఉన్న భూమిని, తమ కష్టాన్ని మాత్రమే నమ్ముకుంటూ జీవిస్తుంటారు. కొండపై పోడు వ్యవసాయం ద్వారా వరి, రాగులు, సామలు పండించుకుని వారికి అవసరమైన ఆహారాన్ని సమకూర్చుకుంటారు. ఎక్కువగా రాగులతో చేసిన జావ(అంబలి) తాగుతారు. అలాగే వరి, సామ గింజలతో అన్నం వండుకుని తింటారు. తెల్లవారు జామున లేచి కుటుంబమంతా పొలం పనులకు వెళ్లిపోతారు. ఉదయం పది గంటల వరకు పొలం పనులు చేసుకుని ఇంట్లో చేసిన రాగి జావను తాగేసి, మరలా అడవికి వెళ్లిపోతారు. అడవుల్లో లభించే పనస, మామిడి పండ్లను తింటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలోనే వ్యవసాయం, వంట చెరకు సేకరణ వంటి పనులు చేసుకుని సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి చేరుకుంటారు. ఎనిమిది గంటలకల్లా రాత్రి భోజనం (వరి లేదా సామ అన్నం, గుమ్మడి కూర, రాజ్‌మా పిక్కల పులుసు) ఆరగించి నిద్రలోకి జారుకుంటారు. ఇదీ గిరిజనుల రోజు వారి జీవనం విధానం.



వ్యవసాయ పనిలో ఉన్న సగటు గిరిజనుడు



గిరి ఉత్పత్తులను తీసుకువెళుతూ..

నిత్యం ప్రకృతితో మమేకం..

మన్యంలో గిరిజనులు నిత్యం ప్రకృతిలోనే మమేకమై జీవిస్తారు. ఆధునిక పద్ధతులకు దూరంగా సహజసిద్ధంగా బతికేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. అడవిపైనే అన్నింటికీ ఆధారపడతారు. ప్రకృతి సంపద నాశనం కాకుండా వ్యవహరిస్తారు. అంతే కాదు జీవ వైవిధ్య కోణాన్ని తరతరాలకు అందిస్తున్నారని చెప్పవచ్చు. వ్యవసాయం, ఆహార పంటల సాగులో నాటి నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలనే నేటికీ అవలంబిస్తున్నారు. నాటి వరి, రాగులు, సామ విత్తనాలను నేటికీ వినియోగిస్తున్నారు. అలాగే వారి తాతలు, తండ్రుల కాలం నాటి నుంచి సంక్రమించిన పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలను మాత్రమే పెంచుతున్నారు. హైబ్రీడ్ రకాల విత్తనాలు, పశువులను వాడేందుకు గిరిజనులు అంతగా ఆసక్తి చూపరు. వ్యవసాయంలో కూడా గిరిజనులు వైవిధ్యానికే పెద్దపీట వేస్తున్నారు. ఏజెన్సీలో పండించే పంటలకు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను వినియోగించరు. గిరిజనులు తమకు అందుబాటులో ఉన్న పశువుల గెత్తం, పచ్చి రొట్ట వంటి సేంద్రియ ఎరువులు మాత్రమే వినియోగిస్తారు. దీనివల్ల గిరిజనులకు పెట్టుబడి తగ్గుతుంది. అలాగే భూసారానికి ఎటువంటి హాని కలగదు. పైగా గిరిజనులు పండించే పంటలకు ఎటువంటి రసాయనాల బెడద కూడా ఉండదు. అలాగే వరి పంట పొలాలు ఎక్కువ విస్తీర్ణంలో ఉండడం సహజం. భూసారాన్ని కాపాడడం, నీటి యాజమాన్యాన్ని పాటించడం వంటి చర్యల వల్ల గిరిజనులు తమ పొలాలను చిన్న మడులుగా మార్చుకుని వరి పంటను సాగు చేస్తుంటారు.



కొండకోనల్లో ఉండే గిరిజన పల్లెలు

కొనసాగుతున్న సంప్రదాయాలు..

గిరిజనులు పాటించే కొన్ని రకాల ఆచారాలు, సంప్రదాయాలు కూడా ఆసక్తిగానే ఉంటాయి. గిరిజనులు స్నేహానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారు. అలాగే ఒక గ్రామానికి చెందిన వారు మరో గ్రామానికి చెందిన వారితో స్నేహం ఏర్పరచుకుంటారు. అలాగే కష్టాలు, ఇబ్బందులు ఏర్పడినప్పుడు స్నేహితులైన గిరిజనులు పరస్పరం సహాయం చేసుకుంటుంటారు. పంటలు సరిగా పండని సమయాల్లో విత్తనాలు, ఇతర వస్తువులు, డబ్బులు ఇచ్చిపుచ్చుకుంటూ తమ స్నేహాన్ని చాటుకుంటారు. అలాగే వ్యవసాయ పనుల్లో సైతం పరస్పరం సహాయం చేసుకుంటారు. అందువల్లే ఏజెన్సీలో వ్యవసాయ కూలీల కొరత వంటి సమస్యలు తలెత్తవు. అలాగే ఒక తెగలో ఒకే ఇంటి పేరున్న వారంతా ఒకే ప్రాంతంలో పెద్ద ఇళ్లు నిర్మించుకుని సమూహంగా, ఐక్యతగా జీవిస్తుంటారు.



ఇటుకల పండగలో భాగంగా రోడ్డుపై వాహనాలను ఆపుతున్న దృశ్యం



థింసా నృత్యం చేస్తున్న గిరి మహిళలు

గ్రామాల పేర్లలోనూ వైవిధ్యమే..

గిరిజనులు గ్రామాలకు ప్రకృతిలో తమ సంబంధాన్ని ప్రతిబింబించేలా పేర్లను పెడుతుంటారు. ఉదాహరణకు బొర్రమామిడి, పనసపుట్టు, తియ్యదుంప, చిన్నగెడ్డ, చింతమామిడి, చింతగొంది, బురదపనస వంటివి చెప్పుకోవచ్చు. అలాగే తమ ఇళ్ల తలుపులకు సైతం ప్రకృతిలో ఉండే జంతువులు, పక్షుల బొమ్మలతో కూడిన పెయింట్ వేయిస్తుంటారు. అంతేకాదు నేటికీ ఏజెన్సీలో అనేక మంది గిరిజనులు కుండల్లోనే వంట చేసుకుంటున్నారు. అలాగే గిరిజనుల పండగలు సైతం వైవిధ్యంగా ఉంటాయి. గిరి పల్లెల్లో ఎటువంటి కార్యం జరిగినా థింసా నృత్యం ఉంటుంది. గిరిజనులు వ్యవసాయ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రకృతి మాతను మొక్కుకుంటూ అనేక రకాలైన పండగలను చేస్తుంటారు. అలాగే పంటలన్నీ చేతికి వచ్చిన తర్వాత ఇటుకల పండుగను చేస్తారు. ఇది మైదాన ప్రాంతాల్లో సంక్రాంతి పండగ లాంటిది.

ఆడపిల్లలే ఇష్టం

నాగరికతతో జీవిస్తున్న నేటి సమాజంలో ఆడపిల్ల పుట్టకూడదని కోరుకునేవాళ్లే అధికంగా ఉంటారు. కాని ఏజెన్సీలో అందుకు పూర్తి భిన్నంగా తమకు ఆడపిల్ల పుట్టాలని కోరుకున్నవాళ్లే నూటికి నూరు శాతం ఉంటారంటే అతిశయోక్తి కాదు. ప్రధానంగా ఏజెన్సీలో అమ్మాయిలు పుట్టడం వల్ల గిరిజనులకు ఎలాంటి భారం ఉండదు. అలాగే ఖర్చుతో కూడిన పెళ్లిళ్లు, భారీ స్థాయిలో వరకట్నాలు వంటి ఆర్థిక పరమైన ఇబ్బందులు అసలే ఉండవు. అలాగే అమ్మాయిలే తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటారు. దీంతో అమ్మాయి పుట్టిందంటే.. అన్ని విధాలా శుభమనే అభిప్రాయం ఏజెన్సీలో నేటికీ కొనసాగుతున్నది. అలాగే అమ్మాయిలు సైతం చిన్నతనం నుంచి బాధ్యతలు నెత్తిన వేసుకుని తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తారు. దీంతో వారి వల్ల తల్లిదండ్రులకు ఎటువంటి సమస్యలు ఉండవు. పైగా అబ్బాయికి మించి పనులు, ఇతర బాధ్యతలను చేపడతారు. అందువల్ల గిరిజన ప్రాంతంలో అమ్మాయి పుడితే ఆ గ్రామంలో గిరిజనులంతా కలిసి పండగ చేసుకుంటారు. మేకలు కోసి అందరికి మాంసాహార భోజనాలు పెట్టి, తమకు అమ్మాయి పుట్టిందని గర్వంగా చెప్పుకుంటారు. చాలాప్రాంతాల్లో వివాహాలకు అబ్బాయిలను వెతుకుంటున్న తరహాలో మన్యంలో అమ్మాయిలను వెతుక్కుంటారు. అలాగే వివాహాల్లో వరకట్నాలు ఇచ్చే సంప్రదాయం, ఆచారం ఏజెన్సీలో లేదు. కాని అమ్మాయిని వివాహం చేసుకునే అబ్బాయి (పెళ్లి కొడుకు) కుటుంబమే గిరిజన తెగల ఆచారం ప్రకారం అమ్మాయికి మొగనాలి పేరిట (పశు సంపద, కోళ్లు, కొంత మొత్తం నగదు)ముట్టజెప్పాల్సి ఉంటుంది. అంతేకాదు అత్తా కొడళ్ల మధ్య తగాదాలు, గొడవలు వంటివి సైతం ఏజెన్సీలో మచ్చుకైనా కనిపించవు. పుట్టింటి కంటే, అత్త మామల(మెట్టిల్లు) ఇంటి వద్దే మరింత బాధ్యతగా ఉంటూ కుటుంబానికి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తుంది. దీంతో కుటుంబపరంగా కూడా గిరిజన సమాజంలో మహిళల వల్ల ఎటువంటి భిన్నాభిప్రాయాలు, సమస్యలు తలెత్తవు. ఈ కారణంగానే మన్యంలో మగువే కుటుంబ పెద్దగా వ్యవహరిస్తుంది. మహిళే అన్నింటా కీలకమనే భావనతో గిరిజన సమాజంలో వేళ్లానుకుంది.

చిన్నచూపే..

మైదాన ప్రాంత గిరిజనులకు కానరాని సంక్షేమం



ఎదుగూబొదుగూ లేని జీవితం.. రేషన్ కార్డు లేదు.. రోడ్డు లేదు.. బడి లేదు.. గుక్కెడు మంచి నీరు లేదు.. ఐదో షెడ్యూల్‌లో ఉన్నా అంతే.. అధికారులు వినరు.. పాలకులు పట్టించుకోరు.. అగమ్యం మైదాన ప్రాంత గిరిజన జీవనం..

చోడవరం/నర్సీపట్నం:
జిల్లాలోని ఎనిమిది మైదాన మండలాల పరిధిలోని 280 గ్రామాల్లో లక్ష మంది గిరిజనులు అనేక దశాబ్దాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. కొండదొర, వాల్మీకి, భగత, తదితర కులాలకు చెందిన గిరిజనులు జిల్లాలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, కోటవురట్ల, రావికమతం, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల మండలాల్లో నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని అటవీ, ఇనాం, మొఖాసా, భూములను సాగు చేసుకుంటూ వచ్చిన ఫలసాయం ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. వివిధ రకాల తెగలకు చెందిన వీరు పేరుకు గిరిజనులు తప్పితే, ఎలాంటి పథకాలు, సౌకర్యాలు కూడా అమలు కావడం లేదు.

మైదాన ప్రాంత గిరిజనుల జీవితాలు నానాటికీ దుర్భరమయ్యాయి. మైదాన ప్రాంతానికి దగ్గరగా ఉన్నారన్న మాట తప్పితే, ఏజెన్సీలో నివసించే గిరిజనులతో సమానంగా వీరు అన్ని రకాలుగా వెనుకబడే ఉన్నారు. అటు ఏజెన్సీ అధికారుల దయలేక, ఇటు మైదానప్రాంత పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూ 'రెంటికీ చెడ్డ రేవడిలా' తయారైంది మైదానప్రాంత గిరిజనుల పరిస్థితి. ఏళ్ల తరబడి అభివృద్ధి, ఉపాధి, చదువు, కనీస సౌకర్యాల విషయంలో మైదానప్రాంత గిరిజనులు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు అండగా ఐటీడీఏ, సబ్‌కలెక్టర్, అధికార యంత్రాంగం ఉండగా, మైదానప్రాంతంలో కనీసం వీఆర్వో దర్శన భాగ్యానికి కూడా నోచుకోలేని దుస్థితిలో మైదాన ప్రాంత గిరిజనం ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

కొరవడిన సర్కారు సహకారం

గతంలో మైదాన ప్రాంత గిరిజనులకు కేంద్రం నుంచి డీటీజీ పథకం కింద కొద్దోగొప్పో నిధులు మంజూరయ్యేవి. ఈ నిధులతో ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలోనే గిరిజనులకు చిన్నచిన్న అభివృద్ధి పనులు చేసేవారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు తొమ్మిదేళ్లుగా నిలిచిపోయాయి. కేంద్ర నిధులు పూర్తిగా ఏజెన్సీని దృష్టిలో ఉంచుకుని మంజూరు చేస్తుండడంతో మైదాన ప్రాంత గిరిజనులకు కనీస నిధులు కూడా విడుదల కావడం లేదు. విచిత్రమేమిటంటే.. వీరివైపు తొంగిచూసే అధికారి లేరంటే ఆశ్చర్యం కలగకమానదు. గడచిన ఎన్నో సంవత్సరాలుగా విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు ఉపాధి ఇలా.. అన్నీ రకాలుగా అభివృద్ధికి నోచుకోకుండా మైదాన ప్రాంత గిరిజనం అల్లాడిపోతున్నారు. సబ్‌ప్లాన్ నిధులు కూడా వీరికి అందకపోవడంతో ఇప్పటికీ ఈ గ్రామాలు వెనకబడే ఉన్నాయి.



రావికమతం మండలంలోని గిరిజన గ్రామాల రహదారి దుస్థితి ఇది

ఐదవ షెడ్యూల్‌లో ఉన్నా అంతే..

గతంలో కొయ్యూరు పంచాయతీ సమితి పరిధిలో ఉండి మండలాల ఏర్పాటు తర్వాత నాతవరం మండలంలో చేర్చబడిన సరుగుడు, కేవీశరభవరం, చమ్మచింత, మాధవనగరం పంచాయతీలు నేటికీ ఐదవ షెడ్యూల్ పరిధిలోనే ఉన్నాయి. అయితే ఈ నాలుగు పంచాయతీలకు కూడా ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖలు ద్వారా ఎటువంటి అభివృద్ధి పథకాలు అమలు కావడం లేదు. ఇటు మైదాన మండలాల శాఖలు, అటు ఐటీడీఏ శాఖలు కూడా ఈ నాలుగు పంచాయతీల్లో నివసిస్తున్న పది వేల మంది గిరిజనుల గోడు పట్టించుకోవడం లేదు. మైదాన మండలాల్లో నివసిస్తున్న గిరిజనులతో ఏజెన్సీ మండలాలకు చెందిన గిరిజనులు వివాహ బంధాలు ఏర్పర్చుకోవడానికి కూడా ఆసక్తి చూపకపోవడం, గిరిజన కులాల్లోనే ఏజెన్సీ, మైదాన ప్రాంతాల గిరిజనులు వేర్వేరు తెగలుగా కొనసాగుతున్నారు.

మా గోడు పట్టించుకొనేవారు లేరు

మాదెలి రాజుబాబు. కళ్యాణగుమ్మి, దేవరాపల్లి



మాకు కనీస సౌకర్యాలు లేవు. ఎంతోకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా పిల్లలకు చదువు కూడా సాగడం లేదు. వర్షాకాలం వస్తే మేం ఉన్నామో? లేదో? పట్టించుకోరు. సంవత్సరాల తరబడి ఇవే సమస్యలతో బాధపడుతున్నాం.

నిధుల కేటాయింపుతోనే మైదానప్రాంతాల అభివృద్ధి

డి. వెంకన్న, మైదాన ప్రాంత గిరిజనుల కమిటీ కన్వీనర్



మైదానప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేకంగా నోడల్ ఏజెన్సీ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి. మైదాన ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఐటీడీఏలు ఏర్పాటు చేస్తున్నట్టు కొన్నేళ్ల వరకూ ప్రభుత్వం ప్రకటనలు చేసింది. ఇప్పుడు ఆ ప్రకటనలు కూడా వినిపించడం లేదు. మైదాన ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి చెందాలంటే.. వారి బాగోగులు పట్టించుకొనే ఏజెన్సీ ఒకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మైదాన ప్రాంతాల్లోని గిరిజనుల సమస్యలు పరిష్కారానికి జిల్లాలోని సబ్‌ప్లాన్ నిధులు నూరు శాతం కేటాయించాలి.



మైదానప్రాంతంలోని గిరిజనం

వెలుగులకు దూరంగా..

మైదానప్రాంతంలో నివసించే గిరిజనులకు రేషన్‌కార్డులు గానీ, పింఛన్లు గానీ అందని ద్రాక్షగానే చెప్పుకోవాలి. వీరు అటవీ ఉత్పత్తుల సేకరణ, వెదురుకూపుల్లోనూ, గ్రానైట్ క్వారీల్లో కూలీలుగా జీవనం వెళ్లదీస్తున్నారు.ఈ గ్రామాలకు కనీస సౌకర్యాలు కరువనే చెప్పాలి. ఇప్పటికీ ఊటనీటిపై ఆధారపడుతున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. అయినా అధికారులు, పాలకులు కన్నెత్తి చూడరు. రావికమతం మండలం చలిసింగం గిరిజన గ్రామానికి రహదారి లేదు.ఇదే మండలంలో నేరుడువలసలో 18 కుటుంబాల గిరిజనులకు ఇప్పటికీ రేషన్‌కార్డులు లేదు. ఆ గ్రామంలో పాఠశాల కూడా లేదు. రోడ్డు వారే సొంతంగా వేసుకున్నారు. రహదారులతోపాటు విద్యుత్ సౌకర్యం కూడా లేని గ్రామాలు చాలా ఉన్నాయి. చీడికాడ మండలం కోనాం జలాశయం ఎగువన ఉన్న గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు ఇప్పటికీ నాటుపడవలలో ప్రాణాలకు తెగించి బాహ్య ప్రపంచంలోనికి అడుగుపెడుతున్నారు. ఈ గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు.

ఇక, దేవరాపల్లి మండలంలోని నేరళ్లపూడి, బోడిగరువు, మద్యగరువు, తుమ్మలపాలెం, బొర్రచింత, నరకంపాడు, చీడికాడ మండలంలోని బిళ్లలపాలెం గ్రామాలకు కరెంటు లేదు. రోడ్డు సౌకర్యం లేదు. మాడుగుల మండలం శంకరం పంచాయతీలో పలు గ్రామాలకు రహదారి లేకుండా పోయింది. వర్షాలు పడితే రోజుల తరబడి ఈ గ్రామాలు జలదిగ్బంధంలో ఉండిపోవలసిందే.

కోటవురట్ల మండలంలో అల్లుమియ్యపాలెం, అణుకు, గొలుగొండ మండలంలో బుడ్డడపాడు, జమ్మాదేవిపేట, కసిమి, గదబపాలెం గ్రామాల్లో గిరిజనులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు.-

నాతవరం మండలం సరుగుడు, కేవీశరభవరం, చమ్మచింత, మాధవనగరం, సిరిపురం, భమిడికలొద్ది, ముంతమామిడిలొద్ది, సుందరకోట వంటి గ్రామాల్లో కూడా కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటికీ వీరు గ్రామాలకు కాలినడకనే వెళ్లవలసి ఉంటుంది. వానా కాలం వస్తే ఇప్పటికీ ఈ గ్రామాలకు కొన్ని రోజులపాటు బాహ్యప్రపంచంతో సంబంధాలు ఉండవు. మైదానప్రాంత మండలాల అధికారులు గానీ, పాలకులకుగానీ వీరి గురించి ఆలోచించే తీరిక లేదనే చెప్పాలి. కష్టపడి వీరు మండల కార్యాలయాలకు వచ్చినా వీరి గోడు ఎవరూ వినరు. ఏజెన్సీలోని ఐటీడీఏ అధికారుల నుంచి ఏవిధమైన సహకారం అందకపోవడంతో మైదాన ప్రాంతంలోని గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందక చీకట్లో మగ్గిపోతున్నారు. ఇక, ప్రాథమిక సౌకర్యాలు పక్కనపెడితే మైదాన ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఉద్యోగాలలో కూడా సరైన ప్రాధాన్యత లభించక, వలసకూలీలుగా మారుతున్నారు.



మాడుగుల మండలం ఉరకగెడ్డ ఆవలకు గెడ్డ దాటుకుంటూ..



కళ్యాణగుమ్మి గ్రామంలోని గెడ్డ నీరు పట్టుకుంటూ..

ప్రత్యేక ఐటీడీఏ అవసరం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనుల కోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు అవసరం ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసినా ఎటువంటి కార్యకలాపాలు కొనసాగలేదు. రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన సదుపాయాలు పథకాలు తమకెందుకు దక్కడం లేదంటూ మైదాన ప్రాంత గిరిజనులు ఎన్ని ఉద్యమాలు, ఆందోళనలు చేసినా పాలక ప్రభుత్వాలు వారి గోడును పెడచెవిన పెడుతున్నాయి.

120 కిలోల గంజాయి పట్టివేత

విలువ రూ.5 లక్షలు వుంటుందని అంచనా

ముగ్గురి అరెస్టు, ఇద్దరు పరారీ..రెండు ఆటోలు స్వాధీనం



గంజాయి నిందితులతో పోలీసులు

కృష్ణాదేవి పేట: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 120 కిలోల గంజాయిని పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు కొయ్యూరు సీఐ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలిలావున్నాయి. మంగళవారం చింతపల్లి మండలం మారుమూల గ్రామాల నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కేడీపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఎస్‌ఐ రమేష్‌తో పాటు వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో రెండు ఆటోల్లో గంజాయి వున్నట్టు గుర్తించి ఆటోలను స్వాధీనపరచుకున్నారు. ఈగంజాయి రవాణాకు పాల్పడిన చింతపల్లి మండలం కిన్నేర్ల గ్రామానికి చెందిన తమర్‌బణ బాల మురళీకృష్ణ, చిన్నారావు, గున్నమామిడి గ్రామానికి చెందిన కోర్రా రాములను అదుపులో కి తీసుకున్నామన్నారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామానికి చెందిన స్వామినాయుడు, చింతపల్లి మండలం కిన్నేర్ల గ్రామానికి చెందిన ప్రసాదు పరారీలో వున్నారన్నారు. పట్టుకున్న అటోల్లో 120 కిలోల గంజాయిని, నిందితుల నుంచి సెల్‌ఫోనును స్వాధీనపరచుకున్నట్టు సీఐ తెలిపారు. దీని విలువ సుమారు రూ.5లక్షలు ఉంటున్నట్టు అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో కృష్ణాదేవిపేట ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ రమణ, మత్యరాజు, శంకర్, అక్కునాయుడు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో

నక్కపల్లి: స్థానిక హెటెరో హైవే జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురు హెటెరో కార్మికులు,ఉద్యోగులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి.మంగళవారం ఉదయం కొంతమంది ఉద్యోగులు,కార్మికులు ఆటోపై హెటెరో పరిశ్రమకు వెళుతుండగా బోల్తాపడింది. దీంతో ఆటోలో వున్న ఆరుగురు గాయపడ్డారు. వారిని స్థానికులు నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుడ్లు పెట్టిన ఉప్పునీటి మొసళ్లు!

విశాఖపట్నం: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో రెండు ఉప్పునీటి మొసళ్లు గుడ్లు పెట్టి పొదుగుతున్నాయి. ఒక్కో మొసలి సుమారు వంద వరకు గుడ్లు పెట్టింది. ప్రస్తుతం జూలో ఐదు మొసళ్లు వుండగా, వీటిలో మూడు ఆడవి. పదేళ్ల క్రితం ఇదే జంతుప్రదర్శనశాలలో ఒక ఉప్పునీటి మొసలి 22 పిల్లలకు జన్మనిచ్చింది. వాటిని ప్రత్యేక మోటులలో పెంచి, అనంతరం శ్రీశైలం డ్యామ్‌లో విడిచిపెట్టారు. ఆ తరువాత మళ్లీ ఇప్పుడే గుడ్లు పెట్టాయి. ఈ నెలాఖరు నాటికి పిల్లలు బయటకు వచ్చే అవకాశం వుందని భావిస్తున్నారు. మొసళ్లు గుడ్లు పెట్టడానికి ముందు అనువైన చోటు ఎన్నుకొని చిన్నపాటి గొయ్యి ఏర్పాటు చేసుకుంటాయి. ఆ తరువాత గడ్డిని సేకరించి దానిని నోటితో చిన్నచిన్న ముక్కలు చేసి వాటిపై గుడ్లను పెడతాయి. ఆ గుడ్లను శత్రువుల బారిన పడకుండా 24 గంటలు కాపలా కాస్తుంది. 60 రోజుల అనంతరం పిల్లలు బయటకు వస్తాయి. పుట్టిన పిల్లలు సుమారు పది అంగుళాల వరకు వుంటాయి. వీటి శరీరం ఆలీవ్ గ్రీన్ రంగు ఆకారంలో వుంటుంది.

కసాయి కొడుకు

తల్లిని హత్య చేసిన తనయుడు

కశింకోటరూరల్: అడిగిన డబ్బులు ఇవ్వలేదని తల్లిని కుమారుడు కత్తితో గొంతుకోసి హతమార్చిన ఘటన మంగళవారం ఉదయం మండలంలోని ఎన్‌జీపాలెం పంచాయతీ పరిధి అచ్యుతపురంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. అప్పికొండ రాజులమ్మ నూతనగుంటపాలెం పంచాయతీలోగల అచ్యుతపురం గ్రామంలో నివాసం ఉంటోంది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. పెద్దకుమారుడు అప్పికొండ జోగినాయుడు రైల్వేలో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. ఈయన అనకాపల్లి మండలం కాలేజీ జంక్షన్‌లో నివాసం ఉంటున్నాడు. కుమార్తెకు వివాహమైంది. చిన్న కుమారుడు అప్పికొండ సత్యనారాయణ అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతని ప్రవర్తన సక్రమంగా ఉండకపోవడంతో ఇతనిని భార్య వదిలి కొన్నేళ్ల క్రితమే పుట్టింటికి వెళ్లిపోయింది. అదే గ్రామంలో ఇతను ఒంటరిగా ఉంటున్నాడు. ఇతని అవసరాలకు ప్రతిసారి అమ్మపై ఆధారపడి బతుకుతూ ఉండేవాడు.



ఘటనా స్థలంలో రాజులమ్మ మృతదేహం

అదే క్రమంలో మంగళవారం ఉదయం అడిగిన డబ్బులు ఇవ్వలేదని వంట చేస్తున్న ఆమెను పీక కోసి పరారయ్యాడు. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. స్థానికులు ఈ విషయమూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశామని ఏఎ్‌ఐ సన్యాసిరావు తెలిపారు.

అనకాపల్లిలో చోరీ

రెండున్నర తులాల బంగారం

65 తులాల వెండి వస్తువులు అపహరణ

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం మూడో వీధిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో ఆగంతకులు రెండున్నర తులాల బంగారం, 65 తులాల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. చిత్రావర్జుల లక్ష్మీనారాయణ గాంధీనగరంలో మూడోవీధిలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామమైన ఎస్.రాయవరం మండలం గుమ్మాలూరులో గత వారం అతని తల్లి చనిపోవడంతో అక్కడకు వెళ్లారు. అతని కుమార్తె వెంకటలక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈమె కూడా సోమవారం ఉదయం తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మంగళవారం ఉదయం ఇంటికి చేరుకుంది. ఆమె ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడం లోపలకి వెళ్లే సరికి బీరువా తెరిచి ఉండి వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే గుమ్మాలూరులో ఉన్న తన తండ్రికి విషయాన్ని తెలియపరిచారు. లక్ష్మీనారాయణ గ్రామం నుంచి గాంధీనగరంలోని ఇంటికి వచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలో రెండున్నర తులాల బంగారం వస్తువులు, 65 తులాల



చిందరవందరగా ఉన్న బీరువాలోని సామగ్రి

వెండి వస్తువులను ఆగంతకులు అపహరించుకుపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ సూర్యప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి క్రైం సిబ్బందిని అప్రమత్తం చేశారు.



కౌన్సెలింగ్‌నకు హాజరైన అభ్యర్థులు



అభ్యర్థికి ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం,

ఎంసెట్ బైపీసీ అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రారంభం

తొలిరోజు 343 మంది ధ్రువపత్రాల పరిశీలన

విశాఖపట్నం, ఆగస్టు 8:
ఎంసెట్ బైపీసీ గ్రూప్ అభ్యర్థులకు బీ.ఫార్మశీ, ఫార్మాడీ, బయో టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు గాను కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీలో గల హెల్ప్ లైన్ కేంద్రాల వద్ద అధికారులు ర్యాంకుల ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి ర్యాంకు నుంచి 15,000 ర్యాంకు వరకు గల అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 125 మంది హాజరయ్యారు. కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో 15,001 నుంచి 30 వేల ర్యాంకు వరకు గల అభ్యర్థులను పిలవగా 218 మంది హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఈ రెండు కేంద్రాల్లో కలిపి 343 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్లు చేసినట్టు కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు తెలిపారు.

కాగా బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 30,001 నుంచి 40 వేల ర్యాంకు వరకు, కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో 40,001 నుంచి 50 వేల ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

ఎన్‌ఏఓబీలో నిర్వాసితులకు ఉపాధి

విశాఖపట్నం,ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలంలో భారత నౌకాదళం నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ నేవీ స్థావరం (ఎన్ఏఓబీ)లో నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కేంద్ర రక్షణ శాఖా మంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. వీరిద్దరు ఢిల్లీలో మంగళవారం మంత్రిని కలిసి నేవీకి భూములు ఇచ్చి సర్వం కోల్పోయారని, వారికి ఉపాధి కల్పిస్తే జీవితాలకు మార్గం చూపినట్టు అవుతుందని కోరారు.దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ శ్రీనివాస్ తెలిపారు.

నేటి నుంచి పెళ్లిసందడి

16 వరకు మంచి ముహూర్తాలు

కల్యాణ మండపాలు ఫుల్

పురోహితులు బిజీబిజీ..

సింహాచలం, ఆగస్టు 8:
శ్రావణమాసం దైవ కార్యక్రమాలకు ఎంత పవిత్రమైనదో... వివాహాది శుభకార్యాలకు అనుకూలమైనది. రానున్నది భాద్రపదం శూన్య మాసం కావడం... శుభ ముహూర్తాలు లేకపోవడం... ఆశ్వయుజంలో అతితక్కువ సంఖ్యలో వివాహాలకు ముహూర్తాలు ఉండడం... కార్తీకంలో శుభ ముహూర్తాలు లేకపోవడంతో బుధవారం నుంచి పెళ్లిసందడి ఆరంభం కానున్నది. ఈ నెల 16 వరకు పన్నెండు శుభ ముహూర్తాలు పంచాంగంలో ఉండడం... వీటిలో ప్రధానంగా 11, 16 తేదీలలో ఒకేరోజు మూడేసి శుభ ముహూర్తాలు ఉన్నందున ఈ వారం రోజులూ భాజాభజంత్రీలు మోగుతాయని పురోహితులు చెబుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పెళ్లిళ్లు చేసుకోవాలని పలువురు మొక్కుకోవడంతో పాటు సింహగిరిపై, కొండదిగువన అనువైన వివాహ కల్యాణ వేదికలు ఉన్నందున రెండు నెలల ముందు నుంచే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌ను వివాహ నిర్వాహకులు బుక్‌చేసుకున్నారు. ఈ వారం రోజుల్లో అత్యధిక పెళ్లిళ్లు జరగనున్నందున కల్యాణ మండపాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అలాగే ఈ వారం మొత్తం మీద సింహాచలం గ్రామ పురోహితుల సంఘంలోని సుమారు 50 మంది పురోహితులు మొత్తం మీద ఐదారు వందల పెళ్లిళ్లు జరిపేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. విద్యుత్ అలంకరణ, షామియానా, వంట సామగ్రి, వధువు, వరుడు తరపు వారికి ప్రత్యేక గదులు వంటి వాటికి కలిపి ప్రత్యేక ప్యాకేజీగా సాధారణ, మధ్య, ఉన్నతి తరగతులుగా విభజించి కనీసం రూ.35 వేలు నుంచి రూ.లక్షా 20 వేల వరకు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా మంగళవాయిద్యాలు, కేటరింగ్, ఫొటోలు, వీడియో చిత్రీకరణ తదితర వాటికి లక్షల్లో ఖర్చవుతుందని చెప్పవచ్చు. ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ఆయా నిర్వాహకులకు మంచి డిమాండ్ ఏర్పడింది.

డిగ్రీ సెకండ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

విశాఖపట్నం, ఆగస్టు 8:
ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల సెకండ్ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు.

సెప్టెంబర్ 6న స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

ఏయూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు సెప్టెంబర్ ఆరు నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. టైమ్ టేబుల్, పరీక్ష కేంద్రాల వివరాలను త్వరలో వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. పరీక్షలకు మూడు రోజుల ముందుగా పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

ఏయూ ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మశీ, న్యాయ కోర్సులలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు రూ.ఐదు వేల అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు పొడిగించినట్టు ఏయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.


గతంలో ఇచ్చిన స్థలంలో అసంపూర్తిగా నిర్మించిన ఇల్లు


అక్రమంగా నిర్మించిన పాకలు

తగరంపూడిలో యథేచ్ఛగా ఆక్రమణలు

● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

అనకాపల్లి, ఆగస్టు 8: మండలంలోని తగరంపూడి గ్రామంలో ఆక్రమణలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. తగరంపూడి గ్రామం శారదానది ఒడ్డున ఉంది. ఈ గ్రామం పురాతనమైనది. సుమారు నాలుగు వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో గ్రామ కంఠం తక్కువగా ఉంది. దీంతో సుమారు మూడు దశాబ్దాల క్రితం గ్రామానికి సమీపంలో కొంత భూమిని కొనుగోలు చేసి అప్పట్లో ఇళ్లు లేని వారికి స్థలాలు ఇచ్చారు. ఊరికి దూరంగా ఉండడంతో కొంత మంది మాత్రమే అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేసుకొని స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంతానికి తగరంపూడి బీసీ కాలనీగా నామకరణం చేశారు. ఇళ్ల నిర్మాణాలు చేసుకోని వారు తమ స్థలాలను అనధికార విక్రయాలు జరుపుకున్నారు. సుమారు వంద మందికి ఇక్కడ మూడేసి సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వగా మరో రెండు ఎకరాల వరకు స్థలం మిగిలింది. ఈ స్థలం సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని అంచనా. ఈ స్థలాలను కొంత మంది ఐదేసి సెంట్లు, పదేసి సెంట్లు వంతున కబ్జా చేసి పాకలు నిర్మించుకున్నారు. అయితే ఇటీవల కాలంలో గ్రామంలో కొత్తగా వివాహాలు చేసుకున్న పలువురు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాల వారు నివసిస్తున్నారు. దీంతో వీరంతా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కాలనీలో ఉన్న స్థలం వారికి ఇవ్వాలంటే ఆ స్థలం కాస్తా ఆక్రమణకు గురైంది. గతంలో స్థలాలు తీసుకున్న వారు అసంపూర్తిగా ఇళ్లు నిర్మించి వదిలేశారు. అటువంటి ఇళ్లను అమ్మకాలు కూడా జరుపుతున్నారు.

ఈ విషయమై వీఆర్వో పెంటారావును వివరణ కోరగా అప్పుడెప్పుడో స్థలాలు ఇచ్చారు. వాటికి సర్వే లేదు. దానికి నేను బాధ్యుడ్ని కాను. మీ ఆంధ్రజ్యోతి వారు వస్తే దగ్గరుండి కొలిపించి ఆక్రమణలు తొలగించేద్దాం అంటూ ఎద్దేవా చేశారు.

వీఆర్వో అడ్డుకోవాలి

ఆక్రమణలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మాదే. ఆక్రమ నిర్మాణాలు జరిగినప్పుడు స్థానికంగా ఉండే వీఆర్వో అడ్డుకోవాలి. నేనే స్వయంగా వెళ్లి ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాను.

- నవీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

జిల్లాలో 18 వేల ఉపాధి హామీ పనులు పూర్తి

కూలీల వేతనాలకు రూ.216 కోట్లు చెల్లింపు ● డ్వామా పీడీ



అరకురూరల్: జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 39 మండలాల్లో 70 వేల పనులను గుర్తించడం జరిగా నేటి వరకు 18 వేల పనులను పూర్తి చేసినట్లు డ్వామా పీడీ కె.కల్యాణచక్రవర్తి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా అరకులోయకు విచ్చేసిన పీడీ ఎన్‌టీఆర్ మైదానంలో కలిసిన విలేకరులకు వివరాలను తెలిపారు. గుర్తించిన పనులను చేపట్టేందుకు గాను 2.46 కోట్లు పని దినాలు మంజూరు కాగా 1.57 కోట్ల పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.250 కోట్లు వ్యయం కాగా వీటిలో కూలీల వేతనాలకు రూ.216 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. మరో రూ.34 కోట్లు మెటీరియల్‌ను సమకూర్చేందుకు వ్యయం చేశామన్నారు. గత కొంత కాలం నుంచి ఐటీడీఏ పరిధిలో జరిగే పనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలోనే పనులకు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. ఇలా ఐటీడీఏ పరిధిలో సీసీ రోడ్లకు, డబ్ల్యూబీఎం రోడ్లకు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు సుమారు రూ.150 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరయ్యాయన్నారు. కాఫీ ప్రాజెక్టుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులే మంజూరు చేశారన్నారు.

ఇందులో భాగంగానే 2017-18 లో ఐటీడీఏ పరిధిలో ఎంపిక చేసిన 12 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు నాటేందుకు, 15 వేల ఎకరాల్లో నీడ నిచ్చేందుకు వీలుగా సిల్వర్ ఓక్ మొక్కలు నాటేందుకు నిధులు వ్యయం చేశామన్నారు. ఇందుకు 150 కోట్లు మేర నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 9 దఫాలు సోషల్‌ఆడిట్ జరిగిందన్నారు. వీటిలో సోషల్ ఆడిట్‌లో గుర్తించిన పలు రకాల అవకతవకలకు సంబంధించి సోషల్ ఆడిట్ అధికారులు తమకు అందించిన నివేదికలో రూ.9.03 కోట్లు అక్రమాలు జరిగాయని నివేదించారన్నారు. అయితే ఈ నివేదికలను పరిశీలించి రూ.7.42 కోట్లుగా ఫైనలైజ్ చేశామన్నారు. ఇందులో భాగంగా 288 మంది వీఆర్పీలను, 26 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లను, ఈసీ, 13 మంది సీవోలను, ముగ్గురి ఏపీవోలను విధుల నుంచి తొలగించామని డ్వామా పీడీ తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు ఏపీడీ లచ్చన్న, అరకు ఏపీడీ భ్రమరాంబ పాల్గొన్నారు.

విద్యార్థి మృతి కేసులో
ముగ్గురు జువెనైల్‌కు తరలింపు

విశాఖపట్నం : మధురానగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కొట్లాట కారణంగా విద్యార్థి మృతి చెందిన కేసులో ముగ్గురిని జువెనైల్‌కు తరలించినట్టు ద్వారకా సీఐ రాంబాబు తెలిపారు. ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం ఎనిమిదో తరగతి విద్యార్థితో పాటు అతడి సోదరుడు, స్నేహితుడు కొట్లడంతో పదో తరగతి విద్యార్థి సిద్దార్థ చిన్నా తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కొట్లాటలో తగిలిన దెబ్బ కారణంగానే చిన్నా మృతి చెందినట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలడంతో దాడికి పాల్పడిన ముగ్గురిని జువెనైల్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత చిన్నా మృతికి స్పష్టమైన కారణాలు తెలుస్తాయని సీఐ చెప్పారు.

నకిలీ పత్రాలతో గృహోపకరణాల షోరూమ్‌లకు బురిడీ

విశాఖపట్నం : నకిలీ ధ్రువపత్రాలతో ఆధార్, పాన్‌కార్డు పొందిన వ్యక్తి వాటి ద్వారా బ్యాంకు ఖాతా తెరిచాడు. అనంతరం ఆ బ్యాంకు ఖాతా ద్వారా వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులను పొంది ఆ వస్తువులను పలువురి అమ్మి ఓ ఫైనాన్స్ సంస్థకు మోసగించాడు. దీనిపై సదరు సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన నాలుగో పట్టణ పోలీసులు మోసానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సిద్రా సురేష్ తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, వాటితో ఆధార్, పాన్ కార్డులను సొంతంగా రూపొందించుకున్నాడు. వాటి ఆధారంతో బ్యాంక్ ఖాతాలు తెరిచి చెక్కు పుస్తకాలను సంపాదించాడు. అనంతరం ఓ పెద్ద ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో గృహోపకరణాలను తన బ్యాంకు ఖాతా ఆధారంగా ఫైనాన్స్‌కు తీసుకున్నాడు. ఇలా నకిలీ పత్రాలతో భీమవరం, విజయవాడ, గుంటూరు, అనంతపురం, విశాఖపట్నంలోని పలు దుకాణాల్లో రిఫ్రిజిరేటర్లు, ఏసీ యంత్రాలు, పెద్ద పెద్ద టీవీలు కొనుగోలు చేసి వాటిని విక్రయించేవాడు. ఇదేవిధంగా తప్పుడు పత్రాలతో విశాఖలోని డైమండ్ పార్క్ వద్ద గల ఓ షోరూమ్‌లో పెద్ద టీవీని కొనుగోలు చేశాడు. అయితే ఆ పత్రాలను పరిశీలించిన షోరూమ్ సిబ్బంది సురేష్ అప్పటికే పలు శాఖల్లో ఇలా ఫైనాన్స్ తీసుకుని మోసగించినట్టు గుర్తించారు.

ఘాట్‌రోడ్డులో భారీ బందోబస్తు


ఘాట్‌రోడ్డులో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు


అనంతగిరిరూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అనంతగిరి ఘాట్‌రోడ్డులో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.రహదారి అంతా జల్లెడపట్టి పరిశీలించారు. అనుమానం కలిగిన ప్రతీ ప్రదేశాన్ని బాంబు స్క్వాడ్ సభ్యులు పరిశీలించారు. వాతావరణం లో మార్పులు జరిగి ఒకవేళ రోడ్డుమార్గం గుండా కూడా వచ్చే అవకాశం ఉన్నందున గస్తీ ని ముమ్మరం చేశారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద భద్రతా బలగాలతో ఘాట్‌రోడ్డు నిండిపోయింది.

గిరిజన మంత్రి ఆనంద్‌బాబు అరకులో బస

అరకురూరల్: గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అరకులోయ బస చేశారు. మంగళవారం అరకులోయలో చేరుకున్న ఆయన స్థానిక మయూరి రిసార్ట్‌లో బస చేశారు. బుధవారం అరకులోయలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీల దినోత్సవాల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, గవర్నర్ నరసింహన్ హాజరుకానున్న నేపథ్యంలో ఈయన మంగళవారం అరకులోయ చేరుకున్నారు.

గిరిజనులకు మంత్రివర్గంలో చోటివ్వాలి

డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు డిమాండ్



నర్సీపట్నం : రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో గిరిజనులకు ఇంతవరకూ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం శోచనీయమని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిగిలిన అన్నివర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగానే గిరిజనులకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించి గిరిజన సంక్షేమం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమానికి ఎంతో కీలకమైన గిరిజన సహకార సంస్థకు తక్షణం పాలక మండలిని నియమించాలని కోరారు. ఇతర కులాల సమస్యల పరిష్కారానికి కమిషన్‌లు ఏర్పాటు చేసిన మాదిరిగానే రాజ్యాంగబద్ధమైన ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు కూడా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖజిల్లా చింతపల్లిలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, రాజ్యాంగబద్ధమైన గిరిజన సలహా మండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని బాలరాజు కోరారు. అదే విధంగా బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి ఏపీఎండీసీకి ఏజెన్సీ భూములు కేటాయిస్తూ జారీచేసిన జీవోనెంబర్ 97ను పూర్తిగా రద్దుచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని భవిష్యత్‌లో కూడా బాక్సైట్ తవ్వకాలు చేపట్టబోమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టంగా ప్రకటించాలని బాలరాజు డిమాండ్ చేశారు.

బాలికపై మేనమామ అత్యాచారం

గర్భవతి కావడంతో వెలుగులోకి వచ్చిన వైనం

పోలీసులకు బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు

విశాఖపట్నం, ఆగస్టు 8: సెలవుల్లో సరదాగా గడపుదామని తాతయ్య ఇంటికి వెళ్లిన బాలిక (14)పై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆమె గర్భవతి అయ్యింది. వివరాలిలా వున్నాయి. కంచరపాలెం బర్మాక్యాంపు సమీపంలోని లాల్‌బహదూర్‌నగర్‌కు చెందిన బాలికను తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో శ్రీకాకుళం జిల్లా నౌపడ గ్రామంలో వున్న తాతయ్య ఇంటికి పంపించారు. అయితే ఆమెపై కామంతో కళ్లు మూసుకుపోయిన మేనమామ పరిశెట్టి కృష్ణ అలియాస్ శ్రీను (23) పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. వేసవి సెలవులు ముగిసిన తరువాత బాలిక తమ ఇంటికి వచ్చింది. ఇటీవల బాలిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా, గర్భవతి అని తేలింది. బాలికను తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. అది విన్న తల్లిదండ్రులు జరిగిన అన్యాయంపై కంచరపాలెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేశారు. దీనిపై కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాధితురాలు నివాసం తమ పరిధిలో వున్నప్పటికీ శ్రీకాకుళం జిల్లాలోని నౌపడలో అత్యాచారం జరగడంతో కేసును అక్కడ పోలీస్ స్టేషన్‌కు బదలాయిస్తున్నామని తెలిపారు.

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: **ఎ**
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : ------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ---------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: **డి**
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : ------------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: థర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది థర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: వంద కిలోగ్రామ్‌లు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాఖియ వెల్లి
సి) ఇండియన్ షేక్‌స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్‌స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : -------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రొటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: పెరుగుదలకు ప్రొటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

- ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.
- ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I)
అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: **బి**

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

6	1	13	5	12	15	22	5
F	A	M	E	L	O	V	E
+4	+4	+4	+4	+4	+4	+4	+4
J	E	Q	I	P	S	Z	I
10	5	17	9	16	19	26	9

4. **JOY: MQZ :: KNR : -----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: **సి**

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: **డి**

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: N పద్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
కాబట్టి LO సమాధానం అవుతుంది

12. **RKNI : NHLH :: KIND : ---------**
ఎ) GFED బి) GFLC సి) JFEC డి) ఏదీకాదు
సమాధానం: **బి**

18	11	14	9	11	9	14	4
R	K	N	I	K	I	N	D
-4	-3	-2	-1	-4	-3	-2	-1
N	H	L	H	G	F	L	C
14	8	12	8	7	6	12	3

13. **NRKI : JUIJ :: TFNK : ---------**
ఎ) IUJJ బి) LIPL సి) PILL డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ:

14	18	11	9	20	6	14	11
N	R	K	I	T	F	N	K
-4	+3	-2	+1	-4	+3	-2	+1
J	U	I	J	P	I	L	L
10	21	9	10	16	9	12	12

JOBS ఉద్యోగాలు

యుఐఐసిఎల్

యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యుఐఐసిఎల్)- **అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 696
అర్హత: జూన్ 30 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
వేతనం: నెలకు రూ.23,000
ఎంపిక: ప్రిలిమ్స్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ ద్వారా
ప్రిలిమ్స్ టెస్ట్: సెప్టెంబరు 22న
మెయిన్ ఎగ్జామ్: అక్టోబరు 23న
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 14 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.uiic.co.in

ఓఐసిఎల్

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసిఎల్)- **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 300
పోస్టులు - ఖాళీలు: అకౌంటెంట్స్ 20, యాక్చురీస్ 2, జనరలిస్ట్స్ 223, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10.
వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష: అక్టోబరు 22న
దరఖాస్తు ఫీజు: రూ.600
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18 నుంచి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.orientalinsurance.org.in/Career.jsp


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - సెక్యూరిటీ ఆఫీసర్ (మేనేజర్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది
ఖాళీలు: 13
అర్హత: డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీ/ నేవీ/ ఎయిర్‌ఫోర్స్/ పారా మిలిటరీ/ పోలీస్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వయసు: 25 - 40 ఏళ్ల మధ్య
వేతనం: రూ.31,705 నుంచి రూ.45,950 వరకు
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబెషన్: రెండేళ్లు
దరఖాస్తు ఫీజు: రూ.600
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 12 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డుకాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?

భారత రాజ్యాంగం- చట్టాలు

1. ఈస్టిండియా కంపెనీ స్థాపన?
1) 1600 డిసెంబరు 28 2) 1600 డిసెంబరు 29
3) 1600 డిసెంబరు 30 4) 1600 డిసెంబరు 31
2. కలెక్టర్ పదవిని ఎప్పుడు సృష్టించారు?
1) 1770 2) 1771 3) 1772 4) 1773
3. మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
3) మన్రో 4) ఎవరూ కాదు
4. బెంగాల్ గవర్నర్ పదవిని బెంగాల్ గవర్నర్ జనరల్‌గా మార్చిన చట్టం?
1) మొదటి చార్టర్ చట్టం - 1793
2) రెండో చార్టర్ చట్టం - 1813
3) మూడో చార్టర్ చట్టం - 1883
4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
5. భారతదేశంలో మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ 1687లో ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) మద్రాసు 2) కలకత్తా 3) బొంబాయి 4) ఏదీకాదు
6. భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
3) విలియం బెంటింక్ 4) లార్డ్ మెకాలే
7. భారతదేశంలో ఆధునిక సివిల్ సర్వీస్ పితామహుడు?
1) నెహ్రూ
2) సర్దార్ వల్లభాయ్ పటేల్
3) సుభాష్ చంద్రబోస్
4) ఎవరూకాదు



8. ఇండియన్ పీనల్ కోడ్‌ను ఎప్పుడు చట్టం చేశారు?
1) 1858 2) 1859 3) 1860 4) 1861
9. ప్రస్తుత(21వ) లా కమిషన్ చైర్మన్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) ఎ.పి.షా
3) బల్బీర్‌సింగ్ చౌహాన్ 4) ఎవరూ కాదు
10. 'సతి'ని ఎప్పుడు రద్దు చేశారు?
1) 1853 2) 1828 3) 1829 4) 1830
11. ప్రపంచంలో తొలిసారిగా పోటీ పరీక్షలు నిర్వహించిన దేశం?
1) రష్యా 2) చైనా 3) భారత్ 4) బ్రిటన్
12. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడు?
1) విలియం బెంటింగ్ 2) లార్డ్ మెకాలే
3) కారన్ వాలిస్ 4) లార్డ్ రిప్పన్
13. కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1856 2) 1857
3) 1859 4) 1860
14. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పితామహుడు?
1) లార్డ్ మేకాలే 2) కారన్ వాలిస్
3) విలియం బెంటింగ్
4) లార్డ్ రిప్పన్
15. మొట్టమొదటి ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి?
1) రవీంద్రనాథ్ ఠాగూర్
2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) సుభాష్ చంద్రబోస్
4) సురేంద్రనాథ్ బెనర్జీ
16. భారతదేశ మొట్టమొదటి వైశ్రాయి?
1) లార్డ్ కానింగ్ 2) లార్డ్ మేయో
3) లార్డ్ రిప్పన్ 4) ఎవరూ కాదు
17. భారతదేశ మొట్టమొదటి రాజ్య కార్యదర్శి?
1) హంటర్ 2) చార్లెస్ ఉడ్స్
3) లార్డ్ మెకాలే 4) ఎవరూ కాదు



తాళ్లపెల్లి సదయ్య
రామప్ప అకాడమీ
హన్మకొండ

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

18. 1833లో లా కమిషన్ చైర్మన్?
1) లార్డ్ మేయో 2) లార్డ్ మెకాలే
3) లార్డ్ విలియం బెంటింక్ 4) ఏదీకాదు
19. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆద్యుడు?
1) మంగళ్‌పాండే 2) తాంతియా తోపే
3) నానా సాహెబ్ 4) కున్వర్‌సింగ్
20. సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభివర్ణించింది?
1) సయ్యద్ అహ్మద్‌ఖాన్ 2) వి.డి.సావర్కర్
3) నెహ్రూ 4) ఎవరు కాదు
21. పోర్టుపోలియో విధానాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1857 2) 1858 3) 1859 4) 1862
22. కలకత్తా, బొంబాయి, మద్రాసు హైకోర్టులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1859 2) 1860 3) 1861 4) 1862
23. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
1) 21 2) 22 3) 23 4) 24
24. రౌలత్ చట్టాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1909 2) 1917 3) 1918 4) 1919
25. బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు?
1) దాదాబాయి నౌరోజి
2) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు
26. భారతదేశంలో 'విభజించు - పాలించు' అనే విధానానికి బీజం వేసిన చట్టం?
1) 1909 చట్టం 2) 1813 చట్టం
3) 1853 చట్టం 4) 1833 చట్టం
27. మత నియోజకవర్గాల పితామహుడు?
1) లార్డ్ మెకాలే 2) మార్లే
3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
28. ముస్లింలీగ్ స్థాపన?
1) 1905 2) 1906 3) 1907 4) 1908
29. సూరత్‌లో కాంగ్రెస్ చీలిక?
1) 1906 2) 1907 3) 1908 4) 1909
30. మాంటెంగ్ ప్రకటన ఎప్పుడు వెలువడింది?
1) 1917 ఆగస్టు 20 2) 1917 ఆగస్టు 21
3) 1917 ఆగస్టు 23 4) 1917 ఆగస్టు 25
31. ద్వంద్వ పాలన పితామహుడు ఎవరు?
1) కారన్ వాలిస్ 2) విలియం డ్యూక్
3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
32. అలహాబాద్ హైకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?



1) 1861 2) 1863 3) 1855 4) 1866
33. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?
1) 1919 ఏప్రిల్ 13 2) 1919 ఏప్రిల్ 14
3) 1919 ఏప్రిల్ 15 4) 1919 ఏప్రిల్ 16
34. ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1919 2) 1920 3) 1921 4) 1922
35. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును సూచించిన కమిటీ?
1) లీ కమిటీ 2) హోలీ కమిటీ
3) మాడ్డిమాన్ కమిటీ 4) ఏదీకాదు
36. నెహ్రూ నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
37. జిన్నా నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
38. కమ్యూనల్ అవార్డును ఎప్పుడు ప్రకటించారు?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
39. గాంధీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
40. భారత్ నుంచి బర్మాను ఎప్పుడు వేరు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
41. మౌంట్ బాటన్ ప్రణాళిక ఎప్పుడు వెలువడింది?
1) 1947 జూన్ 3 2) 1947 జూన్ 4
3) 1947 జూన్ 5 4) 1947 జూన్ 6
42. ఆర్‌బిఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1934 2) 1935 3) 1936 4) 1937
43. ఆర్‌బిఐకి తొలి భారతీయ గవర్నర్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) చింతామణి ద్వారాకానాథ్ దేశ్‌ముఖ్
4) ఎవరూ కాదు
44. ప్రస్తుత(24వ) ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
1) ఉర్జిత్ పటేల్ 2) రంగరాజన్
3) వై.వి.రెడ్డి 4) ఎవరూ కాదు
45. ఫెడరల్ కోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
46. భారతదేశంలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1950 జనవరి 26 2) 1950 జనవరి 27
3) 1950 జనవరి 28 4) 1950 జనవరి 29
47. స్థానిక సంస్థల పితామహుడు ఎవరు?
1) లార్డ్ మెకాలే 2) లార్డ్ రిప్పన్
3) లార్డ్ మేయో 4) ఎవరూ కాదు
48. సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు వేరు చేశారు?
1) 1920 2) 1921 3) 1922 4) 1923
49. కేంద్రంలో ద్విసభా విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1919 2) 1909 3) 1935 4) 1947
50. రాష్ట్రాల్లో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1909 2) 1919 3) 1935 4) 1947

సమాధానాలు

1) 4	9) 3	17) 2	25) 1	34) 3	43) 3
2) 3	10) 3	18) 2	26) 1	35) 1	44) 1
3) 1	11) 2	19) 1	27) 3	36) 2	45) 3
4) 4	12) 3	20) 3	28) 2	37) 3	46) 3
5) 1	13) 2	21) 3	29) 2	38) 3	47) 2
6) 3	14) 2	22) 4	30) 1	39) 3	48) 2
7) 2	15) 2	23) 4	31) 2	40) 3	49) 1
8) 3	16) 1	24) 4	32) 4	41) 1	50) 3
			33) 1	42) 2	

JOBS ఉద్యోగాలు

కెన్ ఫిన్ హోమ్స్

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని కెన్ ఫిన్ హోమ్స్ లి. - క్లరికల్ కేడర్‌లో **ప్రొబెషనరీ అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 30
బ్రాంచ్‌ల వారీ ఖాళీలు: బెంగళూరు 8, చెన్నై 4, హైదరాబాద్ 5, ముంబై 4, జైపూర్ 2, భోపాల్ 1, ఇండోర్ 1, ఢిల్లీ/ నొయిడా/ గ్రేటర్ నొయిడా 5
అర్హత: మే 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డేటా ఎంట్రీలో ప్రావీణ్యం + కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉండాలి.
వయసు: 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
ప్రొబెషన్: ఏడాది
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
వెబ్‌సైట్: www.canfinhomes.com/jobapplication.php, www.canfinhomes.com

ఇస్రో

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖా స్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 128
పోస్టులు - ఖాళీలు: లైట్ వెహికిల్ డ్రైవర్ ఎ 50, హెవీ వెహికిల్ డ్రైవర్ ఎ 76, స్టాఫ్ కార్ డ్రైవర్ 2
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.isro.gov.in

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ - **అప్రెంటిస్‌ల** నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 24
డిగ్రీ అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
డిప్లొమా అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిస్‌లు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 3, ఆఫీస్ సెక్రటరీ/ స్టెనోగ్రఫీ 3, పర్చేజింగ్ & స్టోర్ కీపింగ్ 3
అర్హత: అభ్యర్థులు సంబంధిత విభాగంలో డిగ్రీ / డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్: ఏడాది
స్టయిపెండ్: గ్రాడ్యుయేట్స్‌కు రూ.4984, డిప్లొమా అభ్యర్థులకు రూ.3542, టెక్నీషియన్స్‌కు రూ.2758 చెల్లిస్తారు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, వైవా, మెడికల్ టెస్ట్
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
చిరునామా: General Manager/Grey Iron Foundry, Jabalpur - 482009

జెఎన్‌టిబిజిఆర్‌ఐ

జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జెఎన్‌టిబిజిఆర్‌ఐ)- తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 46
పోస్టులు - ఖాళీలు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(బోటనీ 21, బయోటెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్ 2, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ/ అనలిటికల్ కెమిస్ట్రీ 4, మైక్రో బయాలజీ/ ఇంటిగ్రేటెడ్ బయాలజీ 2, జువాలజీ/ వైల్డ్ లైఫ్ బయాలజీ 1), ప్రాజెక్ట్ అసిస్టెంట్(బోటనీ/ అగ్రికల్చర్/ హార్టికల్చర్ 13), కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ) 2, సిస్టం అడ్మినిస్ట్రేటర్ 1
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఫస్టుక్లాస్ మార్కులతో ఎమ్మెస్సీ/ బిఎస్సీ/ బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
స్టయిపెండ్: విభాగాన్ని అనుసరించి రూ.19000 నుంచి రూ.25000 వరకు ఇస్తారు.
వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 36 ఏళ్లు ఉండాలి.
ఇంటర్వ్యూ: ఆగస్టు 22, 23, 24న
వేదిక: JNTBGRI, Karmiancode, PO, Pacha Palode, Thiruvanthapuram 695562
వెబ్‌సైట్: www.jntbgri.res.in

మధ్యాహ్న భోజనంలో గుడ్డు సున్నా

- మారుమూల ప్రాంతాలకు సరఫరా చేయని కాంట్రాక్టర్
- జాతీయ రహదారికి సమీప గ్రామ పాఠశాల విద్యార్థులకు మాత్రమే గుడ్డు భోజనం





మధ్యాహ్న భోజనంలో కానరాని గుడ్డు

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు పౌష్టికాహారం అందజేసి, వారిని ఆరోగ్యవంతంగా తయారు చేయడమే గాకుండా, పాఠశాలల్లో హాజరు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వారానికి మూడు రోజులు కోడి గుడ్డుతో కూడిన భోజనాన్ని అందజేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. కానీ ఇప్పటికీ పలు చోట్ల అరకొరగానే కోడిగుడ్ల సరఫరా జరిగినట్టు తెలుస్తోంది. వారానికి మూడు రోజులు తమకు కోడిగుడ్డు ఇస్తారని సంబరపడిన చిన్నారుల్లో నిరాశ ఎదురైంది. కోడి గుడ్ల సరఫరా చేసే కాంట్రాక్టర్ ప్రధాన పాఠశాలలతోపాటు మండల కేంద్రానికి, హైవేకు సమీపంలో ఉన్న పాఠశాలలకే అందజేస్తున్నారని తెలిసింది. నక్కపల్లి మండలంలోని మారుమూల ప్రాంతాల్లో వుండే 16 పాఠశాలల్లో ఇప్పటి వరకూ మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడం లేదని తెలిసింది. మండలంలోని డొంకాడ, చీడిక, సీతానగరం, ముకుందరాజుపేట, రేబాక, జి.జగన్నాథపురం, తిరుపతిపాలెం, దోసలపాడు అగ్రహారం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకూ కోడిగుడ్డు భోజనం పెట్టడం లేదని ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

కోడిగుడ్లు సరఫరా కాలేదు : సీతానరగం హెచ్‌ఎం



తమ పాఠశాలకు ఇప్పటి వరకూ కోడిగుడ్లు సరఫరా కాలేదని సీతానగరం ప్రధానోపాధ్యాయుడు తోడపు వెంకట రమణ తెలిపారు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతి రోజూ తమను అడుగుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంగళవారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన చెప్పారు.

కాంట్రాక్టర్‌తో మాట్లాడాను : ఎంఈఓ



అన్ని పాఠశాలలకు సకాలంలో కోడిగుడ్లను సరఫరా చేయాలని మూడు మండలాలకు కోడిగుడ్లను సరఫరాచేసే కాంట్రాక్టర్‌కు సూచించామని ఎంఈఓ డి.వి.డి.ప్రసాద్ తెలిపారు. నేరుగా కాంట్రాక్టరే స్కూళ్లకు కోడిగుడ్లు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అందువల్ల ఎన్ని పాఠశాలలకు కోడిగుడ్లు అందలేదో తెలియడం లేదని చెప్పారు.

నేవీ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

కేంద్ర రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీకి ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్యే పంచకర్ల వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు అర్హత మేరకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర రక్షణ, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఢిల్లీ పార్లమెంటు హౌస్‌లో కేంద్ర రక్షణ, ఆర్థిక శాఖా మంత్రి అరుణ్‌జైట్లీని కలిశారు. కర్నాటక రాష్ట్రంలోని కర్వార్ ప్రాజెక్టు సీబర్డ్‌లో నిర్వాసితులైన (పీడీఎఫ్) కుటుంబాలలో అర్హులైన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన విధంగా రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్ ఏర్పాటుతో నిర్వాసితులైన కుటుంబాల్లోని అర్హులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఆరుణ్ జైట్లీ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేవీ నిర్వాసిత నాయకులు సీహెచ్.ప్రసాద్‌రావు,వి.వెంకటరావు, ఎల్.మంగరాజు, వై.మల్లికార్జునరావు, పి.అప్పలరాజు, ఎ.దివాణంలు ఉన్నారు.

బంగారమ్మపాలేన్ని దత్తత తీసుకున్న జెడ్పీ సీఈవో



అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన సీఈఓ జయప్రకాశ్

సబ్బవరం రూరల్ : మిషన్ అంత్యోదయ పథకంలో భాగంగా సబ్బవరం మండలంలోని బంగారమ్మపాలెం గ్రామాన్ని జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ దత్తత తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి వచ్చిన ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నామని దండోరా వేయించాలని కార్యదర్శికి సూచించారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. గ్రామ జనాభా వివరాలు సేకరించారు. త్వరలో గ్రామసభ నిర్వహణకు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటికి పది వేలు ఆదాయం వచ్చేలా ప్రణాళిక చేస్తామన్నారు. సిరసపల్లిలో ఫ్లోరైడ్ ప్రభావం ఉందని గ్రామస్థులు చెప్పగా సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి అప్పారావు, లింగాలతిరుగు దేవస్థానం చైర్మన్ దొడ్డి రాజుకోటి, తహసీల్దార్ పైల రామారావు, ఎంపీ డీవోవో పూర్ణిమాదేవి, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణరాజు, వీఆర్వో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో వృద్ధుడి మృతి

పాడేరురూరల్: జ్వరంతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ పెదబయలు మండలం గలగండ గ్రామానికి చెందిన కుర్తాడి లక్ష్మయ్య(65) అనే గిరిజనుడు మృతి చెందాడు. నెల రోజుల క్రితం మలేరియా రావడంతో లక్ష్మయ్య వైద్యసేవలు పొందాడు. మలేరియా తగ్గడంతో తన స్వగ్రామానికి వెళ్లారు. మళ్లీ మూడు రోజులుగా జర్వం రావడంతో మంగళవారం ఉదయం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆ గ్రామానికి తరలించారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.30
క్యాబేజీ	రూ.20
బీన్స్	రూ.80
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.30
మిర్చి	రూ.40
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.50
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పుదినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.75
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనెధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	340
విజయనగరం	344
శ్రీకాకుళం	344

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	91.00	90.00
విత్ స్కిన్	127.00	150.00
స్కిన్ లెస్	150.00	160.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3590	4240
రెండో రకం	3130	4150
మూడో రకం	2900	3290

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.




వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పదాలు కనుక్కోండి



నవ్వుల్ నవ్వుల్

టింకు : అరేయ్ బిట్టూ! మా టామీ మీ ఇంటి కన్నా ఎక్కువ ఎత్తు ఎగరగలదు తెలుసా?

బిట్టు : అంత సీను లేదు రా! నేను నమ్మను.

టింకు : చూడు మా టామీ ఎగిరింది. మరి మీ ఇల్లు ఎగురుతుందా?

బిట్టు : !!!!!!!!!!!!





బుల్‌ఫైట్ తెలుసు. స్ట్రీట్ ఫైట్ తెలుసు. కానీ ఫుడ్‌ఫైట్ గురించి తెలుసా! వేల మంది ఒకచోట గుమికూడి రోడ్లపై టన్నుల కొద్దీ టొమాటోలు కుమ్మరించి వాటితో కొట్టుకోవడమే ఫుడ్‌ఫైట్. స్పెయిన్ దేశంలోని బ్యునెల్‌లో ఈ ఫుడ్‌ఫైట్ జరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు నెల చివరి బుధవారంలో జరిగే ఈ ఫుడ్‌ఫైట్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వెళుతుంటారు.



అతి పెద్ద టొమాటో ఫైట్

బ్యునెల్....

స్పెయిన్‌లో చిన్న ఊరు. అక్కడి జనాభా తొమ్మిది వేలే. కానీ, ఆగస్టు నెల చివరి బుధవారం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ జనమయం అవుతాయి. ఎక్కడ చూసినా టొమాటోలే కనిపిస్తాయి. 'వరల్డ్ బిగ్గెస్ట్ ఫుడ్‌ఫైట్'గా పిలిచే ఈ వేడుకను తిలకించడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2013లో సుమారు 50 వేల మంది ఈ ఫైట్‌లో పాల్గొనడానికి వచ్చారట. అంత మంది పాల్గొనడం కష్టమని భావించిన నిర్వాహకులు లాటరీ సిస్టమ్‌ను పెట్టి 20 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ఫుడ్‌ఫైట్‌కు ఉన్న క్రేజ్ అది.

ఎలా మొదలయింది?

ఈ టొమాటో ఫుడ్‌ఫైట్ సంప్రదాయంగా వస్తోంది. అయితే ఇది ఎలా మొదలయిందీ అనే విషయం కచ్చితంగా తెలియదు. రకరకాల కథనాలు చెబుతుంటారు. 1944-45లో మొదటి సారి ఫుడ్‌ఫైట్ జరిగింది. స్నేహితుల మధ్య ఆహారం కోసం జరిగిన పోరు అని చెబుతుంటారు. ప్రమాదవశాత్తు ఒక లారీ బోల్తా పడటం వల్ల మొదలయిందని అంటుంటారు. అన్నింటికన్నా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథనం ఏమిటంటే ఒక రోజు టౌన్‌లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో సిటీ కౌన్సిల్‌మెన్ పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు టొమాటోలతో దాడి చేశారట. ఫుడ్‌ఫైట్ ఎలా మొదలయినా దాన్ని బాగా ఎంజాయ్ చేయడంతో మరుసటి సంవత్సరం కూడా నిర్వహించారు. అలా అది ప్రతి ఏడాది జరుగుతూ వచ్చింది. అయితే ఫ్రాన్సిస్కో ఫ్రాంకో పాలన సమయంలో ఫుడ్‌ఫైట్‌కు ఎలాంటి సంప్రదాయ ప్రాముఖ్యత లేకపోవడంతో ఆ రోజు సెలవును రద్దు చేశారు. అయితే 1970లో ఆయన తరువాత మళ్లీ సెలవును పునరుద్ధరించారు. పట్టణాన్ని రక్షించే దేవతలైన ల్యూయిస్ బెర్‌ట్రాన్, మారె ది డ్యూ డేల్స్ గౌరవార్థం ఈ పండుగను నిర్వహిస్తున్నారు.

సందడే సందడి


ఉదయం 11 గంటలకు టౌన్ సెంటర్‌లోకి టొమాటోలతో ట్రక్కులన్నీ చేరుకుంటాయి. తరువాత రెండు అంతస్తుల పొడవున్న ఒక పొడవాటి కర్రకు గ్రీజును పూసి సెంటర్లో పాతుతారు. దాన్ని పైకి ఎక్కిన తరువాతే ఫుడ్‌ఫైట్ మొదలవుతుంది. ఫుడ్‌ఫైట్ ప్రారంభానికి సంకేతంగా నీటి ఫిరంగులను ప్రయోగిస్తారు. దాంతో పండుగ మొదలవుతుంది. వేల మంది టొమాటోలతో కొట్టుకోవడం మొదలుపెడతారు. సరిగ్గా ఒక గంట తరువాత ఫైట్ ముగుస్తుంది. అప్పుడు ఎవ్వరూ కూడా టొమాటోలు విసరడం చేయరు. వెంటనే టౌన్‌లోని వీధులన్నీ శుభ్రం చేసే కార్యక్రమం మొదలవుతుంది. పర్యాటకులు దగ్గరలో ఉన్న బ్యునెల్ నదిలో స్నానం చేస్తారు. మొత్తంగా ఫుడ్‌ఫైట్ మరచిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.



ఈ ఫుడ్‌ఫైట్‌లో పాల్గొనే వారు కొన్ని రూల్స్ పాటించాలి. అవి...

- పదునైన వస్తువులు, బాటిల్స్ తీసుకెళ్లకూడదు.
- ఇతరుల టీషర్టులు చింపకూడదు.
- టొమాటోలు విసిరే ముందు తప్పకుండా చిదమాలి.
- టొమాటోలను తీసుకొచ్చిన లారీలకు దూరంగా ఉండాలి.

దారి కనుక్కోండి







ఇది నిజం !



థాయ్‌లాండ్‌లో షాపింగ్ చేసినపుడు, బిల్లింగ్ కౌంటర్‌లో మిమ్మల్ని చూసి షాప్ యజమాని 'హాహాహా' అంటే.. అపార్థం చేసుకోవద్దు. ఎందుకుంటే థాయ్‌లో 'హా' అంటే ఐదు అని అర్థం. హాహాహా అంటే 555.

రంగులు వేయండి



టంగ్‌ట్విస్టర్స్

1. I feel a feel a funny feel a funny feel feel I,If I feel a funny feel a funny feel feel I.
2. If a fella met a fella in a field of fitchesCan a fella tell a fella where a fella itches?
3. It's a nice night for a white rice fight.




సూక్తి

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

మీకు తెలుసా?

- పాలను తోడుబెట్టి పెరుగు తయారు చేయడం, వెన్న సేకరించడం వంటి ప్రక్రియలు క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల నాటికే మానవులకు తెలుసు.
- ప్రాచీన కాలంలోనే భారతీయులు పాలతో రకరకాల వంటకాలను తయారు చేసేవారు.

ఆంధ్రజ్యోతి
16

విశాఖపట్నం
బుధవారం 9 ఆగస్టు 2017


తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబరు 8 నుంచి డిసెంబరు 3 వరకు ఉన్నాయి
రూ.100 : అక్టోబరు 8 నుంచి డిసెంబరు 3 వరకు ఉన్నాయి.
రూ.50: ఖాళీలు లేవు
శ్రీనివాసమ్: అక్టోబరు 8 నుంచి డిసెంబరు 3 వరకు ఉన్నాయి

రూ.300 దర్శనం: ఆగస్టు 27 నుంచి నవంబరు 30 వరకు ఉన్నాయి (మధ్యలో సెప్టెంబరు 5,19,27 తప్ప)
ఆర్జిత సేవలు : డిసెంబరు 7,8వ తేదీ ఉన్నాయి
టీటీడీ కల్యాణ మండపం: ఆగస్టు నెలలో 10,14,18,19,21,22, 23,24,25,26,27,28,30,31 ఖాళీ ఉంది

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 06333

హామీల అమలు అంతంతే!

మన్యానికి, దత్తత పంచాయతీకి ఏడాది క్రితం భారీగా వరాలు • పెదలబుడులో పూర్తికాని అభివృద్ధి పనులు



ప్రహరీ గోడను దాటని ఎడ్యుకేషన్ హబ్



పెదలబుడు సమీపంలో నిర్మాణం కాని హైలెవెల్ వంతెన



ప్లాట్ ఫారంలేని కుళాయి

అరకురూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఏడాది ఆగస్టు తొమ్మిదిన ప్రపంచ ఆదివాసీ దినోత్సం సందర్భంగా అరకులోయ, దత్తత పంచాయతీ పెదలబుడు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల్లో కొన్ని పూర్తిగా, మరికొన్ని అసంపూర్తిగా అమలయ్యాయి. కానీ ప్రధాన హామీలకు మాత్రం కదలికలేదు. ఏడాది పూర్తయ్యింది. రాష్ట్రస్థాయి ఆదివాసీ దినోత్సవానికి అరకులోయ వరుసగా రెండోసారి వేదక అవుతున్నది. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దత్తత పంచాయతీ పెదలబుడులో గిరిజనులతో ముఖాముఖి సందర్భంగా, అరకులోయలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం వాటి పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి విశ్లేషణ.

అమలు కాని హామీలు

- అరకులోయలో ఇంజనీరింగ్, డీఎడ్, బీఎడ్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కటి కూడా ఏర్పాటు కాలేదు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా రూ.1.4 కోట్లతో విద్యా సంస్థలు(ఆర్ఐటీఐ, డిగ్రీ కళాశాల, యూత్‌ట్రైనింగ్ సెంటర్, బాలుర ఉన్నత పాఠశాల) చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- డల్లాపల్లి, లంబసింగి ప్రాంతాల్లో రూ.8 కోట్లతో రిసార్ట్స్‌లు నిర్మిస్తామని చెప్పారు. ఇవి కూడా కదలలేదు.
- గిరిజన సంప్రదాయ నృత్యం థింసాకు కూచిపూడి తరహా ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఈ హామీ కూడా అమలుకు నోచకోలేదు.
- దత్తత పంచాయతీ పెదలబుడులో ఫైబర్‌గ్రిడ్ సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఇంటికీ ఉచితంగా ఇంటర్నెట్, వైఫై, కేబుల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కేవలం పెదలబుడు పంచాయతీ కార్యాలయానికి ఆరు నెలలు క్రితం ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. అది కూడా రెండు నెలలు మాత్రమే పని చేసింది. ప్రస్తుతం పని చేయడంలేదు. ఇంటర్నెట్, కేబుల్ టీవీ సౌకర్యం కల్పించలేదు. సీఎం రానుండడంతో ఫైబర్ నెట్ వర్క్ అధికారులు హడావిడిగా పెదలబుడు గ్రామానికి ఈ సౌకర్యాలు కల్పించేందుకు హైరానా పడుతున్నారు.

అమలైన/అమలవుతున్న హామీలు

- రూ.10 కోట్లతో పెదలబుడు పంచాయతీ పరిధిలోని 22 గ్రామాల్లో అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశారు.
- అరకులోయ పట్టణం మినహాయించి అన్ని గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు.
- రక్షిత తాగునీటి పథకాలను ఏర్పాటు చేసిన, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు.
- రూ.20 లక్షలతో పెదలబుడులో అంగన్‌వాడీ భవనం, ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మించారు.
- గ్రంథాలయ భవనాన్ని రూ.పది లక్షలతో నిర్మించారు.
- రూ.25 లక్షలతో అరకులోయలో నిర్మించిన సామాజిక భవనం పనులు పూర్తి కాగా, పెదలబుడులో మరో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న భవనం పనులు జరుగుతున్నాయి.
- రూ.10 లక్షలతో మెడిటేషన్ భవనం పనులు జరుగుతున్నాయి.
- అరకులోయలో రూ.60 లక్షలతో రైతుబజార్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- రూ.కోటి 40 లక్షలతో ఎడ్యుకేషన్ హబ్ ప్రహరీ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం రూ.కోటితో నిర్మించిన వసతిగృహం ప్రారంభోత్సవానికి సిద్ధంగా వుంది.
- వంట గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కా ఇళ్లు వంటివాటిని అర్హులందరికీ మంజూరు చేశారు.

ప్రారంభం కాని పనులు

- పెదలబుడు పంచాయతీలో కరసాలిగుడ నుంచి గంజాయిగుడ వరకు తారురోడ్డు, మధ్యలో వంతెన పనులు ప్రారంభం కాలేదు.
- పెదలబుడు సమీపంలో గెడ్డపై ఉన్న లోలెవెల్ వంతెన స్థానంలో హైలెవెల్ వంతెన పనులు ప్రారంభం కాలేదు.
- పెదలబుడు నుంచి గంజూయిగుడ వరకు రోడ్డు పనులు ప్రారంభించి, అర్ధంతరంగా నిలిపివేశారు.
- అరకులోయ హెలీప్యాడ్ నుంచి లిట్టిగుడ వరకు తారురోడ్డు పనులు మొదలు పెట్టలేదు.



డిగ్రీ కళాశాల బాలికల వసతిగృహం



పెదలబుడులో రక్షిత తాగునీటి పథకం



సిద్ధం చేసిన ఆదివాసీ దినోత్సవం సభా ప్రాంగణం



అరకులోయలో ఏర్పాట్ల గురించి చర్చించుకుంటున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి

ఆదివాసీ దినోత్సవానికి

సర్వం సిద్ధం

అరకురూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అరకులోయలో బుధవారం నిర్వహించన్ను రాష్ట్ర స్థాయి సదస్సును ఏర్పాట్లు పూర్తయ్యాయి. గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానుండడంతో పోలీసు శాఖ అసాధారణ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ ఏర్పాట్లను మంగళవారం ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ సృజన, రూరల్ ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మతోపాటు పలు శాఖల అధికారులు పరిశీలించారు. 40 స్టాల్స్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీటిని సీఎం, గవర్నర్, మంత్రులు సందర్శించే సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. వేదిక, బహిరంగ సభ జరిగే ప్రదేశం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వేదిక, వీటి పరసరాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. కొన్ని మార్పులు చేర్పులు చేయాలని వాటి నిర్వాహకులకు సూచించారు.

హెలీప్యాడ్ వద్ద భద్రత పరంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభావేదిక చుట్టూ, లోపల బందోబస్తుకు పెద్ద ఎత్తున పోలీసులను నియమించారు. నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి, డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి, టూరిజం ఈడీ శ్రీరాములు నాయుడు, పాడేరు, చింతపల్లి, డీఎస్పీలు మహేంద్ర, సునీల్, టీడబ్ల్యు ఈఈ శ్రీనివాసరావు, తదితరులు తమ శాఖలకు చెందిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్టీఆర్ మైదానంలో ప్రధాన సభావేదికతో పాటు ఆ ప్రక్కనే కల్చరల్ స్టేజీ ఏర్పాటు చేశారు. సుమారు 20 వేల మంది ప్రజానికానికి సరిపడేలా, వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆర్అండ్‌బీ, టీడబ్ల్యు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు చెందిన రూ.264 కోట్లతో చేపట్టనున్న పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలాకాలను ఒకేచోట ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులకు వ్యవసాయ, అనుబంధ పనిముట్లను పంపిణీ చేయనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, ఐటీడీఏ పీవో

నేడు అరకులో ఆదివాసీ దినోత్సవం

హాజరుకానున్న గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు నాయుడు
ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు
అలరించనున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు

విశాఖపట్న, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశాయి. గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వీరికి భారీ స్వాగతం పలికేందుకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ సృజన, తదితరులు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఆరు ఐటీడీఏల పరిధిలోని గిరిజన కళాకారులు హాజరై సంప్రదాయ నృత్యాలతో అలరించనున్నారు.

గవర్నర్, సీఎం రాక... పోక

గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం 8.50 గంటలకు గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి 9.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు అరుకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 10.35 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంకు చేరుకుంటారు. 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొంటారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఒంటిగంటకు రోడ్డు మార్గంలో బయలుదేరి 1.15 గంటలకు డిగ్రీకళాశాల మైదానానికి చేరుకుంటారు. 1.30 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 2.45 గంటల వరకు వీఐపీ లాంచ్‌లో విశ్రాంతి తీసుకొంటారు. మూడు గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 3.40 గంటలకు గన్నవరం చేరుకొంటారు.

ఆంధ్రజ్యోతి
4
పాడేరు
విశాఖపట్నం ● బుధవారం 9 ఆగస్టు 2017
పాడేరు । చింతపల్లి । గూడెంకొత్తవీధి । కొయ్యూరు । జి.మాడుగుల

220 ఓట్లు తొలగింపు: తహసీల్దార్

కొయ్యూరు: మండలంలోని 220 మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించామని తహసీల్దారు రమామణి తెలిపారు. మండలంలో 53 బూత్‌ల పరిధిలో 35 వేలకు పైగా ఓటర్లు ఉన్నారని, నెల రోజులుగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీలు కలిపి 220 మందిని గుర్తించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన తుది జాబితా రూపొందిస్తామని చెప్పారు. ఓటుహక్కు పొందేందుకు అర్హులైన వారు బీఎల్‌వోలను సంప్రదించాలని ఆమె సూచించారు.

కళల వెలికితీతకు యువజనోత్సవాలు దోహదం

యువజనోత్సవ సభలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్: గిరిజన ప్రాంతంలో ఉన్న కళాకారులను గుర్తించేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సెట్విస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎ.సిరి ఆధ్వర్యంలో మంగళవారం యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న కళాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. యువతీ, యువకులు తమలో ఉన్న కళను పదుగురిలో కనపరిచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కృషి, పట్టుదల ఉంటే విజయాలు సునాయాశంగా సాధించగలమన్న విషయాన్ని యువతరం గుర్తించాలన్నారు. కర్ణాటక సంగీతంలో మన్యానికి చెందిన టి.సునయన నేషనల్ విజేతగా నిలవడం గిరిజన ప్రాంత ప్రజలకు గర్వకారణం అన్నారు. అనంతరం టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు మాట్లాడుతూ, కళలను బహిర్గతం చేసేందుకు మన్య ప్రజలు ముందుకు రావాలన్నారు. సెట్విస్ ఆధ్వర్యంలో చేపట్టే జాబ్‌మేళాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెట్విస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సిరి మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో ఎంపికైన కళాకారులను జిల్లా స్థాయికి, అక్కడ ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కళాకారులను జనవరి నెలలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలకు తీసుకు వెళ్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.అప్పారావు, ఎంపీడీవో ఎస్.ప్రేమాకరరావు, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్, పాడేరు డివిజన్ ఇన్‌చార్జ్ బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


డివిజన్ స్థాయి యువజనోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు


యువజనోత్సవాల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


విద్యార్థులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరి

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

యువజనోత్సవాల సందర్భంగా నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో యువతీ, యువకులు ప్రదర్శించిన నృత్యాలు అబ్బురపరిచాయి. భరత నాట్యం, థింసా, జానపద నృత్యాలు అలరించాయి. అలాగే వారు ఆలపించిన గేయాలు శ్రోతలను కట్టి పడేశాయి. విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే ఈశ్వరి చేసిన గిరిజన సంప్రదాయ థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు థింసా నృత్యంలో పోటీ పడ్డారు.

చైతన్య సంస్థ సేవలు అభినందనీయం

చింతపల్లి: ఆదివాసీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందిస్తున్న చైతన్య సంస్థ ప్రతినిధులు సేవల అభినందనీయమని ఎంఈవో వి.ప్రసాద్ తెలిపారు. గొందిపాకలు పంచాయతీ రోలుగుంట గ్రామంలో చైతన్య సంస్థ ప్రతినిధులు నిర్మించిన పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దుస్తులు, పలకలు, పుస్తకాలు, కంచాలు, చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... లంబసింగి, గొందిపాకలు పంచాయతీలను దత్తత తీసుకున్న చైతన్య సంస్థ ప్రభుత్వ పాఠశాల లేని గ్రామాలను ఎంపిక చేసుకుని పాఠశాల భవనం నిర్మించడం, బోధనకు వలంటీర్‌ను నియమించడం సంతోషకరమన్నారు. రోలుగుంట గ్రామంలో ఆర్ఎస్‌టీ పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించామని, ప్రభుత్వం అనుమతిస్తే వలంటీర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొటుకూరి దేవి, గ్రామ పెద్దలు రాంబాబు, సోమరాజు, చిన్నబ్బాయి, చైతన్య ప్రతినిధి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పేలి గిరిజనుడికి గాయాలు

గూడెంకొత్తవీధి: మండలంలోని గుమ్మళ్లగొంది గ్రామంలో సెల్‌ఫోన్ పేలడంతో గిరిజన యువకుడికి గాయాలయ్యాయి. గుమ్మళ్లగొందికి చెందిన కాకూరి బీమ సెల్‌ఫోన్ చార్జింగ్ పిన్‌ను కనెక్ట్ చేసి పక్కన పెట్టుకుని పడుకున్నాడు. కొంత సమయానికి సెల్‌ఫోన్ భారీ శబ్దంతో పేలింది. దీంతో బీమ వెన్నుకు బలమైన గాయమైంది. బాధితుడ్ని కుటుంబ సభ్యులు జీకే వీధి పీహెచ్‌సీకి తీసుకు రాగా, వైద్యులు చికిత్స చేశారు.

ఇద్దరు గర్భిణులు కేజీహెచ్‌కు తరలింపు

పాడేరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు గర్భవతులకు 108 వాహనంలో మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. పెదబయలు మండలం బొంగరం పంచాయతీ మొట్టలగుమ్మి గ్రామానికి చెందిన కె.బుజ్జిబాబు భార్య నాగమణి(28) కడుపునొప్పితో బాధపడుతూ ఏరియా ఆస్పత్రికి రాగా గైనకాలజిస్టు జయశ్రీ పరీక్షలు నిర్వహించి ట్యూబల్ గర్భిణిగా గుర్తించారు. వెంటనే కేజీహెచ్‌కు వెళ్లాలని సూచించారు. అలాగే జి.మాడుగుల మండలం సొలభం గ్రామానికి చెందిన కె.లక్ష్మీనారాయణ భార్య రాజేశ్వరి తీవ్ర రక్తస్రావంతో బాధ పడుతున్నది. ఐదు నెలల గర్భవతి అయిన ఆమెను కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

గిరిజనాభివృద్ధిపై సర్కారు నిర్లక్ష్యం

● ఆదివాసీ దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నాం ● ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు: గిరిజన ప్రాంత అభివృద్ధిపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం పరంగా గిరిజనులకు సక్రమించిన హక్కులు, చట్టాలను సైతం ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖకు గిరిజనేతరుడ్ని మంత్రి చేయడం విచారకరమన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలోని సహజ వనరుల దోపిడీకి అవకాశం ఉండదనే ఆలోచనతోనే సీఎం చంద్రబాబు గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. గిరిజనులను మభ్య పెట్టాలనే లక్ష్యంతోనే అరకులోయలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని తాము బహిష్కరిస్తున్నామని చెప్పారు. గిరిజన మంత్రి నియామకం విషయంలో అన్యాయం చేసిన ప్రభుత్వం, బాక్సైట్ జీవో-97ను రద్దు చేయడంలోనూ తాత్సారం చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రభుత్వంలో గిరిజనులకు కనీస గుర్తింపు లేకుండా పోయిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ప్రాంత వైసీపీ నేతలు శెట్టి వెంకటరావు, ఎల్‌బీ.బీమరాజు ఉన్నారు.



ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

గూడెంకొత్తవీధి: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో పోషకాహారంతో పాటు దుస్తులు, పుస్తకాలు, అలంకరణ వస్తువులు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. ఆశ్రమాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులపై తల్లిదండ్రులు చింతించాల్సిన అవసరంలేదన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పద్మనాభం, రామకృష్ణ పాల్గొన్నారు.

జ్వర బాధితులు రక్త పరీక్షలు చేయించుకోవాలి

గూడెంకొత్తవీధి: జ్వర బాధితులందరూ తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి కె.నీరజ సూచించారు. సంకాడ, ఎస్.కొత్తూరు గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 156 మందికి సేవలు అందించారు. 11 మంది జ్వర బాధితులకు రక్తపరీక్షలు చేయగా, ఒకరికి మలేరియా పాజిటివ్ వచ్చింది. ఈ సందర్భంగామె మాట్లాడుతూ, సకాలంలో మందులు వేసుకుంటే మలేరియా ప్రాణాంతకం కాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, జె.రాణి, చెల్లయ్యమ్మ, విజయలక్ష్మి, సాగర్ పాల్గొన్నారు.

నేడు గిరిజన భవన్‌లో ఆదివాసీ దినోత్సవం

చింతపల్లి: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో బుధవారం ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లోచల రామకృష్ణ, చల్లంగి సన్యాసిరావు తెలిపారు. గిరిజన ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, కార్మికులు హాజరుకావాలని కోరారు.

ఆదివాసీలకు రక్షిత నీరు అందించేందుకు కృషి

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్

చింతపల్లి: ఆదివాసీలకు రక్షిత నీరు అందించేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవీవీఎస్.ప్రసాద్ తెలిపారు. వామగెడ్డ కొత్తూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు బేరా సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, రక్షిత నీరు అందిస్తే ఆదివాసీలు వ్యాధులకు దూరంగా వుంటారని మంత్రి లోకేష్ ఇటీవల కలిసి చెప్పామన్నారు.

దీనికి ఆయన స్పందించి పాడేరు నియోజకవర్గంలోని 252 గ్రామాల్లో మంచినీటి పథకాల ఏర్పాటుకు రూ.10 నుంచి రూ.20 లక్షలు చొప్పున రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. మరో 300 గ్రామాలకు మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే కొత్తగా మరో 300 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆదివాసీల అభివృద్ధికి చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ నుంచి 200 మంది కార్యకర్తలు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవడం మచ్చమ్మ, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, దేపూరి వెంగళయ్య, రమణ, కిముడు లక్ష్మయ్య, ఏఎంసీ ఉపాధ్యక్షుడు నాజర్‌వల్లి పాల్గొన్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్, ఎంపీపీ మచ్చమ్మ

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	దర్శకుడు
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	నక్షత్రం

సహజ మరణానికి రూ.2 లక్షలు చంద్రన్న బీమా

- ఈ నెల 15 నుంచి అమలు
- మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామానాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

చీడికాడ: పేద కుటుంబాలను ఆదుకునేందుకు చంద్రన్న బీమా అండగా ఉంటుందని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ఇంత వరకూ ప్రమాదవశాత్తు, సహజంగా మరణించిన 20మందికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు రూ.9.48 లక్షల విలువైన బాండ్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, చంద్రన్న బీమా పథకాన్ని 2016 అక్టోబర్ 2వ తేదిన రాష్ట్రంలో చంద్రబాబు ప్రవేశపెట్టగా దీనిలో చేరిన 59ఏళ్లలోపు ఉన్న వారు సహజంగా మరణిస్తే రూ.30వేలు, 70ఏళ్లలోపు ఉన్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు ఇస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ ఏడుగురు ప్రమాదవశాత్తు, 131మంది సహజంగా మరణిస్తే రూ.41.55లక్షలు చంద్రన్న బీమా ద్వారా పేదలకు అందించామన్నారు. ఇటీవల దిబ్బపాలెం గ్రామంలో గాడి అచ్చియ్యమ్మ ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబానికి రూ.4లక్షల 27వేల 500లు, కోనాంలో గింద్రు దేముడు ప్రమాదంతో మృతి చెందితే రూ.70వేలు ఇన్సూరెన్స్ ద్వారా అందించామన్నారు. వీరే కాకుండా అర్జునగిరి, ఎన్.కొత్తూరు, నీలంపేట, తురువోలు, జి.కొత్తపల్లి, చినగోగాడ, ఎ.అగ్రహారం, దిబ్బపాలెం, వైలపూడి, ఎల్‌బి.పట్నం, ఖండివరం, కోనాం గ్రామాల్లో సహజంగా మరణించి 18 మందికి చెందిన కుటుంబాలకు రూ.4.5 లక్షలు అందించామన్నారు. పేదలకు మరింత చేయూతనందించేందుకు సహజంగా మరణిస్తే రూ.2లక్షలు బీమా సౌకర్యాన్ని చంద్రబాబు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది ఈ నెల 15నుంచి అమలు కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుచ్చు కళావతి, వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, కోనాం జలాశయం చైర్మన్ గండి ముసలినాయుడు, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, మండల తెలుగుయువత అధ్యక్షుడు కొల్లి సూరినాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పంచాడ దాలెంనాయుడు, టీడీపీ జిల్లా నాయకుడు లాలం శివకుమార్, షుగర్స్ డైరెక్టర్ బండారు శేషగిరిరావు, సీడీసీ డైరెక్టర్ సింగంపల్లి నాయుడు, పైల ముత్యాలనాయుడు, కోఆప్షన్ సభ్యుడు షేక్ చిన్నా సాహెబ్, బీమా మిత్రలు రెడ్డి నాగమణి, ఎం.వరలక్ష్మి, మండల కన్వీనర్ మైచర్ల నానాజీ, గౌరీపట్టపు నానాజీ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తేనే పనులు చేస్తాం

ఎం.గదబూరు వీఎస్ఎస్ సభ్యుల సభ్యుల స్పష్టీకరణ


అటవీ అధికారులతో వాగ్వాదం చేస్తున్న వీఎస్ఎస్ సభ్యులు

చీడికాడ: బకాయిలు చెల్లించే వరకూ పనులను జరగనివ్వబోమని మండలంలోని మంచాల శివారు ఎం.గదబూరు వీఎస్ఎస్ సభ్యులు (గిరిజనులు) స్పష్టం చేశారు. తెనుగుబూడి ఫారెస్ట్ బీట్ పరిధిలో ఎం.గదబూరు వీఆఎస్ఎస్‌లో పొరుగు కూలీలతో వీఎస్ఎస్ పనులను ఫారెస్ట్ అధికారులు చేస్తుండగా ఇక్కడి వీఎస్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. టేకు ప్లాంటేషన్ కోసం 75శాతం పనులు పూర్తిచేయగా సుమారు రూ.30 వేలకుపైగా అయ్యిందని, ఆ వేతనాలు ఇవ్వకుండా ఎలా పని చేస్తామని, అలాగే వేరొకరి చేత పనులు చేయిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి రమేష్‌కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి దీనిపై ఆరా తీశారు. ఫారెస్ట్ గార్డు రాంబాబు చీడికాడ కూలీలతో పనులు చేయిస్తున్నారని, తమకు కూలి డబ్బులు ఇవ్వకుండా ఎలా చేయిస్తామని నిలదీశారు. దీంతో ఫారెస్ట్ అధికారి కొత్తగా వచ్చిన కూలీలను వెనక్కు పంపించి ఎం.గదబూరు వీఎస్ఎస్ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. మిగతా సొమ్ము రెండు, మూడు రోజుల్లోగా ఇస్తామని చెప్పడంతో వీఎస్ఎస్ సభ్యులు పనులు చేపట్టారు. అంతకు ముందు సీపీఎం జిల్లా నాయకులు డి.వెంకన్న, కేవీపీఎస్ జిల్లా నాయకుడు కె.అప్పారావు, సీపీఎం మండల నాయకుడు రొంగలి దేముడునాయుడు ఫారెస్ట్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. గిరిజన వీఎస్ఎస్ సభ్యులకు చెల్లించవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

దండి సురవరంలో పూరిల్లు దగ్ధం.. పాడిగేదెకు గాయాలు

చీడికాడ: మండలంలోని దండిసురవరం గ్రామంలో మంగళవారం వేకువజామున కాసిన సత్యారావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది.

దీంతో ఇంటిలో ఉన్న మగ్గాలు, దారాలు, ధాన్యం, బియ్యం, మంచాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.50వేలు నష్టం ఉంటుందని అంచనా. ఈ ప్రమాదంలో ఇంటి పక్కనే ఉన్న పాడి గేదెకు గాయాలయ్యాయి.

సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. టీడీపీ నాయకులు తాతారావు, అప్పారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అర్హులందరికీ సబ్సిడీపై రుణాలు : ఎంపీపీ కళావతి



మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి.. హాజరైన సర్పంచ్‌లు, లబ్ధిదారులు

చీడికాడ: అర్హులైన పేదలందరికీ సబ్సిడీపై రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీపీ కుచ్చు కళావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని కార్పొరేషన్‌లలో పేదవారందరికీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ చీడికాడ మండలానికి 130 యూనిట్లు మంజూరు కాగా, రూ.1.30 కోట్లు కేటాయించామని, 50శాతం సబ్సిడీ ఉంటుందఇ అన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా 45మంది లబ్ధిదారులకు రూ.90లక్షలు కేటాయించగా 50శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈవో గురునాథరావు మాట్లాడుతూ, యూనిట్ విలువ లక్ష రూపాయలైతే రూ.60వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. అదే రూ.1.5లక్షలు యూనిట్ అయితే రూ.90వేలు సబ్సిడీ, రూ.52,500లు బ్యాంకు రుణం కాగా రూ.75వేలు లబ్ధిదారుని వాటా అని అన్నారు. రూ.2 లక్షలు, ఆపై ఎన్ని లక్షలు రుణం తీసుకున్నా రూ. లక్ష మాత్రమే సబ్సిడీ ఉంటుందన్నారు. 50 ఏళ్లలోపు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

గ్రామాల్లో మెట్ట పల్లం భూములు లేని దళితులకు తామే భూములను కొనుగోలు చేసి 75శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నామన్నారు. 25శాతం ఎన్ఎస్ఎఫ్‌డీసీ కార్పొరేషన్ రుణం కాగా, రుణంపై ఆరుశాతం వడ్డీ రాయితీతో షెడ్యూల్ కులాలకు చెందిన మహిళా రైతు కూలీలకు భూములు కొని పంపిణీ చేస్తామన్నారు. మండల కోఆర్డినేటర్ టి.సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి, ఎంపీఈవో ఆర్ఎం.గ్లాడ్స్ మాట్లాడారు. ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, సర్పంచ్ లాలం ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఆర్.వెంకటసత్యనారాయణ, కొల్లి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుదర గోవింద తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి : ఏవో

మాడుగుల రూరల్ : మండలంలోని డి.గొటివాడ, గొటివాడ అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఎ.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నారు మడులను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ముఖ్యంగా వరి నారు మడుల్లో నాట్లు వేసేందుకు నారు తీసే పది రోజులు ముందుకు కేజీన్నర కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలను ఐదు సెంట్ల నారుమడుల్లో చల్లుకోవాలని సూచించారు. దీని వల్ల నాటిన 35 రోజులు వరకు చీడపీడలు ఆశించవని చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలపై అందించే యంత్రాలు గురించి వివరించారు. బుధవారం ఎం.కోడూరు, కేజే పురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఏవో రమేష్ తెలిపారు. ఏఈవో ప్రవీణ, ఎంపీఈవో గౌరినాయుడు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పంపిణీ

మాడుగుల రూరల్ : మండలంలోని జేడీ పేట గ్రామంలో మంగళవారం చంద్రన్న బీమా సొమ్మును బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ కోరుకొండ రాజుబాబు అందించారు. గ్రామానికి చెందిన గర్రెడ్డి రాజుబాబు ఇటీవల మృతి చెందాడు. అతడికి రూ.30వేల బీమా మంజూరైంది. ముందుగా రూ.5 వేలు మృతుని భార్య గర్రెడ్డి రమణమ్మకు అందించారు. యూత్ అధ్యక్షుడు వడ్డి రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సినేషన్

మాడుగుల రూరల్ : మండలంలో కేజేపురం వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి మీజిల్స్ రూబిల్లా వేక్సిన్‌ని వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, గొటివాడ, బొడ్డరేవు, కృష్ణంపాలెం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు వేక్సిన్‌లు వేశారు. 1202 మంది విద్యార్థులకు ఎంఆర్ వేక్సిన్‌లు వేశామని ఎంపీహెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కామేశ్వరి, హెచ్‌ఎం రోజ్‌మేరి పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ముట్టడి : సీపీఎం

దేవరాపల్లి: అనకాపల్లి ఆర్డీవో కార్యాలయాన్ని బుధవారం ముట్టడించనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న తెలిపారు.

మంగళవారం ఇక్కడ విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక, కౌలురైతు, చేతివృత్తిదారులు, రైతుల సమస్యలపై ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామన్నారు. రైతు రుణాలు పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని, సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలని, వ్యవసాయ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.350లు కూలీ ఇవ్వాలని, 60సంవత్సరాలు దాటిన సన్న, చిన్నకారు రైతులకు, కూలీకు రూ..5వేలు పింఛన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. కేవీపీఎస్ జిల్లా నాయకుడు కాటపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

చీడికాడ: ప్రతి ఏడాది పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలతో పాటు అన్ని రకాల వస్తువులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చోడవరానికి చెందిన వ్యాపారవేత్త ఉప్పల శ్రీహరి అన్నారు. మండలంలోని బైలపూడి హైస్కూల్‌కి చెందిన 6 నుంచి 10వ తరగతి వరకూ విద్యనభ్యశిస్తున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లను మంగళవారం అందించారు. పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	దర్శకుడు
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	నక్షత్రం

1191 మందికి ఎంఆర్ వ్యాక్సినేషన్

రోలుగుంట : స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొంతలం, భోగాపురం, కొవ్వూరు, పెదబొడ్డేపల్లి హైస్కూల్, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే 1141 మంది విద్యార్థులకు మంగళవారం వైద్యాధికారి విజయకుమారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం పరిధి గుర్రంపేట, రాజన్నపేట, ఎంకే పట్నం, మునిపల్లి పాఠశాలల్లో 150 మంది పిల్లలకు వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో వ్యాక్సిన్ వేశారు.

అందుబాటులో తపాలా సేవలు

బుచ్చెయ్యపేట : ప్రజలందరికీ తపాలా సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని చోడవరం ఐపీవో సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఆర్.శివరామపురంలో మంగళవారం బ్రాంచ్ పోస్టాఫీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నమ్మి నీరజ, బీపీఎం ఎన్.లక్ష్మి, ఎన్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో ఎన్నికల సందడి

బ్యాలెట్ ద్వారా ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్ ఎంపిక



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

చోడవరం రూరల్: మండలంలోని నర్సాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు 2017-18 విద్యాసంవత్సరానికి గాను మంగళవారం సాధారణ ఎన్నికలు జరిపారు. బ్యాలెట్ పద్ధతిన జరిగిన ఈ ఎన్నికలలో 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న 200 మంది విద్యార్థినులు పాల్గొని ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్, సీపీఎల్‌లను ఎన్నుకున్నారు. ఎస్‌పీఎల్‌గా ఎన్.యమున (9వ తరగతి), ఎస్‌పీఎల్‌గా జి.కృష్ణవేణి(ఏఎస్‌పీఎల్) ఎన్నికయ్యారు. ఐదు తరగతులకు క్లాస్ లీడర్లను ఎన్నుకున్నారు. వారి చేత సోషల్ సీఆర్‌టీ ఏఈవీకే రత్నకుమారి ప్రమాణస్వీకారం చేయిచారు. పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్.పద్మావతి పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలకు పీఈటీ నాయుడు, ఆర్.ప్రసాద్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించారు.

పెసలు, మినుము పంటలో పల్లాకు తెగులు నివారించాలి : ఏవో



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాస్

చోడవరం రూరల్: పెసలు, మినుము పంటల్లో పల్లాకు తెగులు వల్ల వాటి ఆకులు పసుపురంగులో మారుతాయని, ఈ తెగులు సోకిన ఆకులను రైతులు గుర్తించి వాటిని తీసివేసి వెంటనే కాల్చేయాలని మండల వ్యవసాయ అధికారి ఈఆర్ఎ.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని వెంకన్నపాలెం, అంభేరుపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు నారుమడులలో, చెరకు తోటలలో సమస్యలను గుర్తించారు. వరినారు మడుల్లో బెట్ట సమస్య అధికంగా ఉందని, దీని నివారణకు యూరియా 200 గ్రాములు, పొటాష్ 100 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వ్యవసాయాధికారి సూచించారు. చెరకులో పీకపురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 320 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని చెరకు రైతులకు సూచించారు.

ఎస్సీ మహిళలకు 75 శాతం సబ్సిడీపై భూ పంపిణీ

ఎస్సీ కార్పొరేషన్ ఈవో గుర్నాథరావు

బుచ్చెయ్యపేట : ఎస్సీ మహిళలకు 75 శాతం సబ్సిడీపై భూ పంపిణీ చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈవో కేబీవీ గుర్నాథరావు తెలిపారు. స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలు లేని జిరాయితీ భూములను చూపితే తమ కార్పరేషన్ కొనుగోలు చేసి దరఖాస్తుదారులకు పంపిణీ చేస్తుందన్నారు. మెట్టు భూమి అయితే 3 ఎకరాలు, ఒక పంట పండిన పల్లం భూమి అయితే 2 ఎకరాలు, రెండు పంటలు పండిన భూమి అయితే ఎకరం చొప్పున ఎస్సీ మహిళలకు అందిస్తామన్నారు. కొన్న ఖరీదులో 75 శాతం సబ్సిడీ పోను మిగతా 25 శాతానికి 6 శాతం వడ్డీపై రుణాన్ని లబ్ధిదారులు భరించాల న్నారు.

బీసీ కార్పొరేషన్ అధికారి బి.అప్పారావు, సత్యనారాయణ, ఎంపీడీవో కొండలరావు, మాజీ ఎంపీపీ ఎంవీవీ .సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గురున్నాథరావు

విద్యాసంస్థల బంద్ రేపు

చోడవరం టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌వో, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల మూసివేత, ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని, మాతృభాషలో విద్యాబోధన కొనసాగించి జీవోనెం-1 రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్‌లతో ఈ బంద్ నిర్వహించనున్నామని పీడీఎస్‌వో చోడవరం డివిజన్ నాయకుడు టి.అర్జున్ తదితరులు పేర్కొన్నారు.

నాగరాజు కుటుంబానికి తహసీల్దార్ పరామర్శ

రావికమతం: ప్రకృతి వైపరీత్యాల వల్ల మరణించిన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తహసీల్దార్ ఎస్.సిద్ధయ్య అన్నారు. మండలంలోని గుడ్డిపలో సోమవారం సాయంత్రం పిడుగు పడి మరణించిన మజ్జి నాగరాజు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. అనంతరం సంఘటనా స్థలాన్ని జీపీఆర్ఎస్ ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వర్షం, గాలి సమయంలో ఎవరూ చెట్ల కిందకు వెళ్లరాదని సూచించారు. చెట్లపై పిడుగులు అధికశాతం పడే అవకాశాలు ఉన్నాయన్నారు.



పిడుగు పడిన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సిద్ధయ్య

గ్రామసభల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక

హౌసింగ్ డీఈ లక్ష్మణమూర్తి

రోలుగుంట : గతంలో చేసిన స్మార్ట్ సర్వే ఆధారంగా ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించామని, గ్రామసభల ద్వారా వారిని ఎంపిక చేస్తామని హౌసింగ్ డీఈ లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని కొమరవోలులో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన పల్స్ సర్వే ఆధారంగా కొమరవోలులో 81 మందిని ఇళ్లు లేనివారిగా గుర్తించామని, వారిలో 63 మందిని అర్హులుగా ఎంపిక చేశామని అన్నారు. దశల వారీగా అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో కె.శచీదేవి, ఏఈ గౌతమ్, సర్పంచ్ చెల్లమ్మనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నేటితో ముగియనున్న శ్రీవారి పవిత్రోత్సవాలు

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ షుగర్స్ ఆవరణలో గల వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. పవిత్రోత్సవాలలో భాగంగా మంగళవారం ఆరాధన, చతుస్థానార్చనలు, హోమాలు, మంగళాశాసనం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరిగాయి. సాయంత్రం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు జీటీ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ ప్రతినిధులు, కార్మికులు, గోవాడ, అంభేరుపురం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నవరత్నాలపై విస్తృత ప్రచారం చేయాలి : ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : వైసీపీ రాష్ట్ర పార్టీ నేత జగన్ ప్రకటించిన నవరత్నాలపై విస్తృత ప్రచారం చేయాలని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ కార్యకర్తలను కోరారు. మంగళవారం బుచ్చెయ్యపేటలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణాల మాఫీ, పింఛన్ నగదు పెంపు తదితర హామీలపై ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 23న బంగారుమెట్ట జంక్షన్‌లో జరగనున్న చోడవరం నియోజకవర్గ స్థాయి వైసీపీ సదస్సు నిర్వహణపై సమీక్షించారు. తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశారు. ఈ సదస్సుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ మండల నాయకులు కె.అచ్చింనాయుడు, దొండా నారాయణమూర్తి, సాయిం రమేష్, బోయిన నారాయణమూర్తి, దొండా అచ్చియ్యదొర, దొండా సన్యాసిరావు, కర్రి తమ్మునాయుడు, పాతాళ శ్రీను, సుంకర శ్రీను, తమరాన రామకోటి, సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

రోలుగుంట : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. 2015-16, 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో ఆయా కార్పొరేషన్‌ల ద్వారా 2105 మంది లబ్ధిదారులు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి నర్సీపట్నం స్టేట్ బ్యాంకు ఏడీబీ, ఆంధ్రాబ్యాంకు, పెదబొడ్డేపల్లి ఆంధ్రాబ్యాంక్, డీసీసీబీ, కెనారా, బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ కొత్తకోట, ఏపీజీవీబీ కొత్తకోట, రోలుగుంట బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

నేరుగా దమ్ములో జింక్ సెల్ఫేట్ వేయాలి : ఏవో

బుచ్చెయ్యపేట : జింక్ లోపం గల భూముల్లో నేరుగా దమ్ములో పొడి ఇసుకతో కలిపి జింక్ సెల్ఫేట్‌ను వేయాలని ఏవో శైలజ రైతులకు సూచించారు. ఆమె మంగళవారం చినఅప్పన్నపాలెం, పి.భీమవరంలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. జింక్ వేసిన 24 గంటల తరువాత మిగతా ఎరువులను వాడాలన్నారు. ఎకరం దమ్ములో రెండు బస్తాల సూపర్ ఫాస్ఫేట్ లేదా ఒకటిన్నర బస్తా డీఏపీ, 30 కిలోల పొటాష్‌ను వేయాలన్నారు. ఎంపీఈవో గణేష్, సర్పంచ్‌లు సకలా దుర్గ వెంకట లక్ష్మి, పినపోలు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతు సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శైలజ

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి

ఉపాధ్యాయులకు ఎంపీడీవో సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

బుచ్చెయ్యపేట : ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలని ఎంపీడీవో టి.కొండలరావు ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన మంగళవారం ఎమ్మార్సీ భవనంలో జరిగిన నూతన ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. డిజిటల్ విద్యాబోధనతో వారిని చైతన్య పరచాలన్నారు. ఎంఈవో కేఏ సత్యనారాయణ, సీఆర్‌పీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వెంకట్రాంపురం గ్రామస్థులు

గొలుగొండ : మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎస్‌కే. ఆన్సారీ, డీవీఆర్ మూర్తిని ఆ గ్రామస్థులు, విద్యార్థులు మంగళవారంఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జీవీఎం నాగేంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు గుర్తింపు తీసుకువస్తాయని చెప్పారు. ఉపాధ్యాయులు ఆన్సారీ, మూర్తి పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

- ఐసీడీఎస్ సీడీపీవో శ్రీకళ
- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

నర్సీపట్నం టౌన్ : బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీకళ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీకాలనీ, శివపురం-2, గంగరాజుమేడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. ఎన్ని పనులున్నప్పటికీ తల్లి బిడ్డకు పాలివ్వాలన్నారుఅలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, అన్న అమృతహస్తం పథకాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గర్భిణులు నెలలు నిండినప్పటి నుంచి ఎటువంటి ఆందోళన చెందారదన్నారు. బాలింతలు కూడా సమయం ప్రకారం ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లందరికీ విధిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. అనంతరం తల్లిపాల ప్రాధాన్యత వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. అంతకుముందు బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో రమణి, సెక్టార్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, టి. జగదీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభారాణి, రమ, రాజేశ్వరి, ఉమ, తదితరులు పాల్గొన్నారు.


బీసీకాలనీ అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు


శివపురం-2 కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో ఎం.శ్రీకళ

గ్రామాల్లో పూడిక పనుల పరిశీలన

గొలుగొండ: ఏటిగైరంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, రావణాపల్లి, పుత్తడిగైరంపేట గ్రామాల్లో జరుగుతున్న డ్రైనేజీల పూడిక పనులను ఈవోపీఆర్‌డీ త్రిమూర్తులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల్లోని కాలువల్లో పూడికలను ఈ నెలాఖరులోగా తొలగించాలని కార్యదర్శులను ఆదేశించామన్నారు. అలాగే వారానికి ఒకసారి రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. రోగాల సీజన్ కావడంతో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయనతో పాటు ఏటిగైరంపేట సర్పంచ్ పాము మహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సారా అమ్మకాలు

నాతవరం : మండలంలోని సరుగుడు, ఎం. బెన్నవరం, ములగపూడి, కె.వి. శరభవరం గ్రామాల్లో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల జోరు తగ్గడంతో మద్యం ప్రియులు సారా వైపు మొగ్గు చూపుతున్నారు. ములగపూడి, సరుగుడు గ్రామాల సమీపంలోని మారుమూల ప్రాంతాల్లో కొందరు సారా తయారు చేస్తూ నమ్మకస్తుల ద్వారా రాత్రి వేళల్లో గ్రామాలకు తరలిస్తున్నారు. సరుగుడు, కె.వి.శరభవరం, ములగపూడి గ్రామాల్లో మందుబాబులు రాత్రులు వాడిన సారా ప్యాకెట్లు వీధుల్లో ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి. ఈ విషయమై కొందరు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీధి దీపాల్లేక అవస్థలు

కృష్ణాదేవి పేట : గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, లింగపేట, నాగాపురం, కుమారపురం, పాతకేడీపేట, గైరంపేట, తాళ్లచీడికాడ గ్రామాల్లో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పటి నుంచో ఆయా గ్రామాల్లో ఈ పరిస్థితి ఉన్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చీకటి పడిన తరువాత వీధుల్లోకి రావాలంటే వృద్ధులు, మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

వరి తెగుళ్ల నివారణకు సూచనలు


రైతులకు సస్యరక్షణపై సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

గొలుగొండ : వరి నారుమళ్లకు వచ్చే తెగుళ్లపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు చారుమతి, సురేష్ అన్నారు. మంగళవారం వారు పాతమల్లంపేట, కొత్తమల్లంపేట గ్రామా ల్లోని వరి నారుమళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త చారుమతి మాట్లాడుతూ నారుమళ్లల్లో ఇనుప ధాతువు లోపానికి 10 గ్రాముల అన్నబేధి మందుకు లీటరు నీటిలో నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. జింక్‌లోపం నివారణకు నాట్లకు ముందు దమ్ము లో ఎకరాకి 20 కిలోల జింక్ వేయాలన్నారు. రైతులు ఈ జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మధుసూదనరావు, పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో సమావేశం

మాకవరపాలెం : నర్సీపట్నంలో ఈనెల మూడో వారంలో బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించనున్నట్టు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాకవరపాలెంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావే శంలో నాలుగు మండలాల్లో 300 మంది బూత్ కమిటీల సభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు. అలాగే సభ్యులు గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. రెండేళ్లు కార్యకర్తలు ప్రజల మధ్యే ఉండేలా పార్టీ అధిష్ఠానం ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రుత్తల సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రుత్తల సర్వం, మాజీ సర్పంచ్ చిటికల వెంకటరమణ, హరిబాబు, ముకల బాలకృష్ణ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గణేష్

గిడుతూరులో భారీ రక్షిత పథకం


రక్షిత పథకం నిర్మించనున్న స్థలం

మాకవరపాలెం: మండలంలోనిగిడుతూరు గ్రామంలో భారీ రక్షిత మంచి నీటి పథకం నిర్మించనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రక్షిత పథకం నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, దీని ద్వారా 14 గ్రామాలకు నీరు అందించనున్నామని చెప్పారు.

సాగునీటి కాలువలకు జలకళ

మాకవరపాలెం : చెరువులు, కాలువల్లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పూడికతీతలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల పడిన వర్షాలకు చెరువులతో పాటు సాగునీటి కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ మేరకు కాలువల పరిధిలోని రైతులు వరి నాట్ల పనులు చేపడుతున్నారు. మాకవరపాలెంలోని మొరక, పల్లపు కాలువలకు రూ.10 లక్షలతో సిమెంటు లైనింగ్ పనులు చేపట్ట డంతో చుక్క నీరు కూడా వృథా కావడం లేదు. దీంతో కాలువల పరిధిలోని భూముల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


మాకవరపాలెంలోని మొరక కాలువ

చురుగ్గా చెక్‌డ్యామ్ పనులు

నర్సీపట్నం టౌన్ : రావణాపల్లి జలాశయం ఆయకట్టు కింద సాగవుతున్న పంట పొలాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన చెక్‌డ్యామ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జలాశయం నుంచి బీసీ కాలనీ మీదుగా గురందొరపాలెం,చెట్టుపల్లి, ఒ.ఎల్.పురం, నగరం తదితర గ్రామాల్లోని పొలాలకు ఈ చెక్‌డ్యామ్ ద్వారా సాగునీరు అందించనున్నారు. ప్రస్తుతం బీసీ కాలనీలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.3 కోట్లలతో ఈ పనులు చేపడుతున్నారు. త్వరలోనే పనులు పూర్తి కానున్నట్టు కాంట్రాక్టర్ తెలిపారు.


బీసీ కాలనీలో జరుగుతున్న చెక్‌డ్యామ్ పనులు

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	9441953611
తహసీల్దార్ కార్యాలయం	9441836336
వెలుగు ఏపీఎం	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : నిన్ను కోరి
సూర్యమహల్ : వాసుకి
సాయిమహల్ : గౌతమ్‌నంద
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న ట్రేడుల్లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.కనకారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వం ఐటీఐలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మెకానిక్ డీజిల్ (ఎస్సీవీటీ), కోపా(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), ఎన్‌సీవీటీ ట్రేడ్‌ల్లో సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థుల నుంచి రెండో విడత దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. ఆసక్తిగలవారు ఈ నెల 15వ తేదీలోగా స్థానిక ఐటీఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు దరఖాస్తు ఫారాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీలు

కోటవురట్ల: మండలంలో ఉపాధి పథకం నిధులు రూ.10.8 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై గురువారం నుంచి సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు ఏపీవో నాగరాజు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు జరిగిన పనులను ఈ బృందాలు పరిశీలిస్తాయని చెప్పారు. ఈ తనిఖీలు 22వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఈ నెల 23న సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు.

కోటవురట్ల ఉపసర్పంచ్ మృతి



కోటవురట్ల: కోటవురట్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బంగారు రాంబాబు గుండెపోటుతో సోమవారం రాత్రి మరణించారు. ఆయన మృతి చెందారన్న వార్త తెలియడంతో సర్పంచ్ గవ్వా గోవిందరావు, టీడీపీ సీనియర్ నాయకులు పి.సూర్యరావు, పినపాత్రుని గుర్రయ్య దొర, పలువురు వార్డు మెంబర్లు స్వగృహానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు చంద్రన్న బీమా పథకం కింద ఐదు వేల రూపాయలను వెలుగు ఏపీఎం కరుణ నిధి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వాసంతి కుమారిని, ఉపాధ్యాయిని భాగ్యవతి బదిలీ అయిన సందర్భంగా వారిని మంగళవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రంగబాబు, ఉపాధ్యాయులు సరస్వతి, సురేష్, బిందుమాధవి దుశ్శాలువలతో వారిని సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. చినదొడ్డిగల్లు గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన సహకారానికి సన్మాన గ్రహీతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ లేఅవుట్‌పై నివేదిక ఇవ్వాలి

- ఈఓపీఆర్‌డీకి డీఎల్‌పీఓ శిరీష ఆదేశం
- పారిశుధ్యపనుల పరిశీలన

కోటవురట్ల: కోటవురట్ల స్టేట్‌బ్యాంకు వెనుక నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్‌ను నర్సీపట్నం డీఎల్‌పీఓ శిరీషారాణి మంగళవారం పరిశీలించారు. లేఅవుట్‌లో నిర్మాణాలు, లేఅవుట్ అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సమగ్ర నివేదికను తనకు పంపించాలని స్థానిక ఈఓపీఆర్‌డీ ప్రభాకర్‌ను ఆదేశించారు. మండలంలో అన్నవరం, జల్లూరు, కోటవురట్ల గ్రామాల్లో ఆమె పర్యటించి పారిశుధ్య పనులను కూడా పరిశీలించారు. పారిశుధ్య మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం వినతి

నక్కపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయు, కార్మిక సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రాణీ అమ్మాజీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయు డివిజన్ కార్యదర్శి ఎం.అప్పలరాజు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో పలు ప్రైవేట్ పరిశ్రమలు, జీడిపిక్కల ఫ్యాక్టరీలు, రొయ్యల పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నాఉ. ఈ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజనం అమలు కమిటీ కార్మికులు, సాక్షరభారత్, ఐకేపీ, ఉపాధి హామీ పథకం కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఘనంగా నగేష్ జన్మదిన వేడుకలు



ఢిల్లీలో తోట నగేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ



పాయకరావుపేటలో పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ జన్మదిన వేడుకలను పాయకరావుపేటలో ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బృందావనంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగేష్ బర్త్‌డే కేక్‌ను కట్‌చేశారు. శ్రీ సరస్వతి విద్యా సేవా సమితి ప్రతినిధి గొర్రెల శివరామకృష్ణ(ఏసుబాబు)కి నెల రోజులు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహణకు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు రొట్టె, పళ్ళు పంపిణీచేశారు. కార్యక్రమంలో జగతా శ్రీను, ఎం.రమాకుమారి, దేవాది మంగాదేవి, అక్కిరెడ్డి వరహాలు, జగతా వెంకటరమణ, పెంకే శ్రీను, అల్లు అప్పారావు, యల్లపు నూకరాజు, ఇంజరపు సూరిబాబు, మూర్తి, ముక్కుడుపల్లి నాగరాజు, వామాల శ్రీను, కువల కుమార్, గుల్లా నాగరాజు, వేముల వెంకటేశ్వరరావు, మేకా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో...

తోట నగేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఢిల్లీలో నిర్వహించారు. బర్త్ డే కేక్‌ను కట్ చేసిన అనంతరం ఎంపీ తోట నరసింహం నగేష్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

నక్కపల్లిలో

నక్కపల్లి : నక్కపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు తోట నగేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కక్కిరాల అప్పారావు, టీడీపీ నాయకులు దేవవరపు శివ, కొప్పిశెట్టి హరిబాబు, కోసూరి శ్రీను, పి.నాగేశ్వరరావు, అబ్దుల్ అజీమ్, తోలేటి శ్రీనివాసరావు, మేరుగు నూకరాజు, కె.వీరబాబు, గోవిందరాజులు పాల్గొన్నారు. గొడిచెర్ల పీహెచ్‌సీలో నాయకుడు నల్లల దొరబాబు ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ఎస్.రాయవరం (నక్కపల్లి) : ఎస్.రాయవరం, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖాధికారి ఉమాప్రసాద్ వరి నాట్లు వేసే విధానం, పొలంలో కాలిబాటలు ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వరిలో జింక్ లోపం వుంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఆయా గ్రామాల పెద్దలు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరు తర్వాత ప్రత్యామ్నాయం కోసం ఆలోచించాలి

సోమశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటవురట్ల

ఇంటర్వ్యూ



కోటవురట్ల : ఈ నెలాఖరు వరకూ వరి నాట్లు వేసుకోవడానికి గడువు ఉందని, నెలాఖరు తర్వాత వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంట కోసం ఆలోచించాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ అన్నారు. ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూ...

ప్ర: వరి నాట్లు ఎప్పటిలోగా వేయకపోతే రైతులు నష్టపోతారు?

జ : వరి నారు ఎదిగినప్పటికీ వర్షాలు పడకపోవడం వల్ల నాట్లు వేయలేకపోయారు. అయినే నెలాఖరు వరకూ వేచి చూడాలి. నెలాఖరులోగా వరి నాట్లు పడకపోతే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. మండలంలో అనేక మంది రైతులు ఆర్‌జేఎల్ విత్తనాలు వేశారు. ఈ వరి ఆకు ముదిరిన పెద్దగా నష్టం లేదు.

ప్ర : నెలాఖరులోగా వర్షాలు కురవకపోతే ఏమి చేయాలి?

జ : నెలాఖరులోగా వర్షం పడకపోతే తక్కువ కాలం పండే వరి విత్తనాలు ఎంచుకోవాలి. అలాగే ప్రత్యామ్నాయంగా అపరాలు వేసుకోవాలి. పెసర, మినుములు, కంది తదితర పంటలను వేసుకోవాలి.

ప్ర : చెరకు సాగు తగ్గడానికి కారణమేమిటి?

జ : మండలంలో రెండేళ్ల క్రితం వరకు 935 హెక్టార్లు చెరకును రైతులు సాగు చేసేవారు. గత ఏడాది 840 హెక్టార్లకు పడిపోయింది. ఈ ఏడాది 631 హెక్టార్లుకు తగ్గిపోయింది. మదుపులు పెరగడం, కూలీలు దొరక్కపోవడం, గిట్టుబాటు లేకపోవడంతో చెరకు సాగు తగ్గింది. చెరకుకు ప్రత్యామ్నాయంగా సరుగుడు సాగు చేస్తున్నారు.

ప్ర : హుద్‌హుద్ సమయంలో కూలిన వ్యవసాయ కార్యాలయం భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణం ఎప్పడు చేపడతారు?

జ: ప్రభుత్వం కొత్త భవనం నిర్మాణానికి పది లక్షల రూపాయలు కేటాయించింది. మండల పరిషత్ ఆవరణలో భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటారు.

ప్ర: మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలం కేటాయించడానికి ఏమన్నారు?

జ: స్థలం ఇవ్వడానికి ఎంపీపీ, ఎంపీడీఓ సిద్ధంగా ఉన్నారు. మండల సర్వ సభ్యసమావేశంలో తీర్మానం చేయాల్సి ఉంది.

గోపాలమిత్ర కేంద్రం ప్రారంభం

కోటవురట్ల: మండలంలోని ఆక్సాహెబ్‌పేటలో గోపాలమిత్ర కేంద్రాన్ని స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 31 పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలమిత్ర కేంద్రాలు ఇంటింటా పశువులకు వైద్యసేవలు అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి వెయ్యి పశువులకు గోపాలమిత్ర కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్

కోటవురట్ల : జల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్లు మంగళవారం వేశారు. మీజిల్ (తట్టు) రూబెల్లా వ్యాధుల నివారణకు మండలంలో 7680 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు లక్ష్యంగా ఉన్నట్టు కె.వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు.

పంచాయతీ స్థలాన్ని కమ్యూనిటీ హాలుకు కేటాయించాలి

ఎమ్మార్పీఎస్ యూత్ సభ్యుల డిమాండ్

పాయకరావుపేట : స్థానిక ఇందిరాకాలనీలో ఎన్నో ఏళ్ళుగా ఉపయోగంలో లేని సామూహిక మరుగుదొడ్డి స్థలాన్ని కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ యూత్ సభ్యులు కోరుతున్నారు. ఇందిరాకాలనీకి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు సలికే గోవిందరావు ఆధ్వర్యంలో పలువురు సభ్యులు పంచాయతీ ఈఓ ఎంవీఎస్ లవరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పంచాయతీ అధికారులు స్పందించి ఇందిరాకాలనీలో మాదిగపేటలో ఉన్న సామూహిక మరుగుదొడ్డి స్థలాన్ని కమ్యూనిటీ హాలుకు కేటాయించాలని కోరారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - దండుపాళ్యం-2
తులసీ చిత్రమందిర్ - నిన్నుకోరి
పరమేశ్వరి - పటేల్...సార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

సమస్యలను సకాలంలో పరిష్కరించండి : ఎంపీపీ

రాంబిల్లి : శాఖాపరమైన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఎంపీపీ కె.అనిత సూచించారు. మంగళవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరగతిన పరిష్కరించాలని ఆ శాఖాధికారులకు సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని కార్యదర్శులకు చెప్పారు. ప్రజా సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో నిర్మల, ఈఓపీఆర్డీ పద్మజ, టీడీపీ మండల నాయకుడు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై సమావేశం

రాంబిల్లి : మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో పలు బ్యాంకుల ప్రతినిధులతో అధికారులు మంగళవారం సమావేశమయ్యారు.ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి శంకరరావు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా రెండు వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటికి బ్యాంకుల అధికారులు ఏయే తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కె. అనిత, ఎంపీడీవో నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆర్థికంగా ఆదుకోండి



అచ్యుతాపురం/రూరల్ : క్రైస్తవుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కె. ప్రభాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభాకరరావు చర్చ్‌లో జరిగిన పాస్టర్ ఫెలోషిప్‌లో ఆయన మాట్లాడారు. చర్చ్‌లు నిర్మాణానికి ప్రభుత్వం గ్రామాల్లో స్థలాలు కేటాయించాలని, పేద క్రైస్తవులకు రాయితీపై రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రత్యేక బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలన్నారు. సమావేశంలో ఎల్. తిమోతి, డి సుద ర్శన్, ఎం. సుధీర్, డిజయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కశింకోటరూరల్: మండల కాంగ్రెస్ కార్యాలయంలో లీగల్ సెల్ కార్యకర్త సమక్షంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మజ్జి ప్రసాదరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాదులపాలెం భూ కుంభకోణంలో రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కత్తెర శ్రీధర్ మాట్లాడుతూ దేవాలయ భూములను అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

అనకాపల్లి రూరల్: ఇళ్లులేని అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని సర్పంచ్ చీకటి రాంబాబు,ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మిలు చెప్పారు. మండలంలోని రేబాక, గొలగాం గ్రామాల్లో మంగళవారం హౌసింగ్ లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన ప్రజా సాధికారిత సర్వేలో లబ్ధిదారులను గుర్తించి జాబితాలను తయారు చేశారు. జాబితాల్లో ఉన్నవారికిఇళ్లుమంజూరు చేస్తామన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తరగతుల బహిష్కరణ

మునగపాక : ఆదర్శ పాఠశాల పేరుతో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి ఇప్పుడు ఆంగ్ల టీచర్‌ను బదిలీ చేయడం అన్యాయమని తోటాడ ఆదర్శ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించకుండా తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ ఛైర్మన్ దాడి జగన్నాధరావు మాట్లాడుతూ గతంలోనూపలుమార్లు అధికారులకు ఈ విషయమై విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి వీరమహాలక్ష్మి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు దాడి లతాశ్రీను, జోగినాయుడు, రాపేటి పరమేష్, దొడ్డి రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



రాంబిల్లి : పంచదార్ల పంచాయతీ శివారు ధారబోగాపురం గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ నిర్మలకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ధారపాలెంలోని ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోని పణిగిరిపై ఉన్న రక్షిత పథకం ద్వారాతమ గ్రామానికి నీరు సరఫరా అయ్యేదని, అయితే హుద్‌హుద్ తుపాను తరువాత రక్షిత పథకం నుంచి నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.ఈ విషయమై పలుమార్లు అధికారులకు, పంచాయతీ పాలకులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణలో వివాదం

నాగులాపల్లిలో ఫిర్యాదుదారుపై దాడి చేసిన సర్పంచ్ వర్గీయులు



విచారణ చేస్తున్న ఈవోఆర్డీ కళ్యాణి

మునగపాక : నాగులాపల్లి పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా జీవీఎంసీ పరిధిలోని రోడ్లు వేయడానికి ఉపయోగించారని వచ్చిన ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం ఈవోఆర్డీ కళ్యాణి మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ఫిర్యాదుదారుడు కర్రి భాస్కరరావుపై సర్పంచ్ యల్లపు భాస్కరరావు వర్గీయులు దాడి చేయడంతో వివాదాస్పదమైంది. దీంతో ఇరువర్గాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. కర్రి భాస్కరరావు గతంలో పంచాయతీ పరిధిలో లేని జీవీఎంసీ పరిధిలోని ప్రాంతంలో రోడ్లు వేసి సర్పంచ్ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, సత్తర్వు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు వేశారని కలెక్టర్‌కు, పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అచ్యుతాపురం ఈవోఆర్డీ కళ్యాణి విచారణకు వచ్చి పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారుడు పేర్కొన్న స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆమెతో పాటు సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ మొల్లేటి ఆదినారాయణ, కార్యదర్శి ఆంజనేయులు, పంచాయతీ గుమస్తా అధికారి నూకరాజు ఉన్నారు. విచారణ జరుగుతున్న సమయంలోనే ఫిర్యాదుదారు రావడంతో సర్పంచ్ అనుచరులు ఆయనపై దాడి చేశారు. తమకు సంబంధం లేకుండా తమ భూమి రికార్డులను ఫిర్యాదులో ఎందుకు ఉపయోగించుకున్నావని భాస్కరరావును ప్రశ్నించారు. భాస్కరరావు సమాధానం చెప్పే లోపు పలువురు ఆయనపై దాడి చేశారు. దీంతో విచారణాధికారి కళ్యాణి అక్కడ నుంచి సత్తర్వు భూమి వద్దకు వెళ్లి విచారణ చేసుకొని వెళ్లిపోయారు.

పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

సర్పంచ్ వర్గీయులు తనపై దాడి చేశారని కర్రి భాస్కరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే కర్రి భాస్కరరావు బంధువులు తమపై దాడి చేశారని సర్పంచ్ వర్గీయులు ఫిర్యాదు చేశారు.

అన్ని పంచాయతీల్లోనూ చెత్తశుద్ధి కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంతోషం

రాంబిల్లి : అన్ని పంచాయతీల్లోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్. సంతోషం అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు,అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చెత్తశుద్ధి కేంద్రాల ఏర్పాటు వల్ల పారిశుద్ధ్యం మెరుగుపడుతుందన్నారు. పంచాయతీకి కూడా ఆదాయం వస్తుందన్నారు. అలాగే కేంద్రాల్లో వర్మీకంపోస్టులు కూడా ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. వంద టన్నుల పేడతో వర్మీకంపోస్టు ఏర్పాటు చేస్తే వందరోజుల్లో రూ.4.50 లక్షలు ఆదాయం వస్తుందన్నారు. ఇప్పటికే రాంబిల్లిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రాలపై సర్పంచులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ఈ చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు ఏర్పాటు చేసుకొని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కె. అనిత, ఎంపీడీవో నిర్మల, ఈఓపీఆర్డీ పద్మజ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు వి.దిన్‌బాబు, టీడీపీ మండల నాయకుడు కె. తిరుపతిరావు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ఆరోగ్యానికి భద్రత

ఎలమంచిలి : చిన్నారుల ఆరోగ్యానికి ఎంఆర్ వ్యాక్సిన్‌తో పూర్తి భద్రత లభిస్తుందని కౌన్సిలర్ గోపీ అన్నారు. మంగళవారం సోమలింగపాలెం వార్డులోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులంతా తమ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అచ్యుతాపురం : చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంచాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. వైద్యాధికారి డి. బీమారావు మాట్లాడుతూ చిన్నపిల్లలకు ప్రాణాంతకమైన తట్టు (పొంగు), రూబెల్లా వ్యాధులు రాకుండా 9 నెలలు నుంచి 15 ఏళ్ల వయసు గల పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం మండలంలో నాలుగు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాస రావు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దేశం శెట్టి ఎల్లయ్య నాయుడు, ఎంపీడీఓ బలరాముడు, ఉండా అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.



సోమలింగపాలెంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఒకే ఇంజక్షన్‌తో రెండు వ్యాధులు నయం

మునగపాక :ఎంఆర్ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల పిల్లలను రెండు వ్యాధుల బారిన నుంచి రక్షించవచ్చునని ఎంపీపీ ఆడారి మంజు అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిజిల్స్, తట్టు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అరుణ్ కుమార్, ఎస్పీఎం పర్యవేక్షకులు రాజ్యలక్ష్మి, సర్పంచ్ టెక్కలి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఎంపీపీ మంజు



మురుగునీటితో దర్శనమిస్తున్న చెర్లోపలి కాలువ

దోమల బెడదతో రోగాల బారిన పడుతున్న ప్రజలు

బోరును తొలగించడంతో తాగు నీటి కోసం ఇక్కట్లు

సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీవాసుల వినతి

పట్టించుకోని అధికారులు

సమస్యల వలయంలో ఇందిరాకాలనీ



తుమ్మపాల: ఇందిరాకాలనీలో ప్రజలు పలు సమస్యలతో అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీని ఆనుకొని ఉన్న చెర్లోపలి కాలువ మురుగునీటితో దర్శనమిస్తోంది. ఏళ్ల తరబడి ఈ ప్రాంతీయులు దుర్వాసన, దుర్గంధం మధ్య కాలం వెల్లదీస్తున్నారు. దీనికి తోడు దోమల బెడద అధికమై కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. సుమారు 100 కుటుంబాలకు పైగా ఈప్రాంతంలో నివాసముంటున్నారు. ఇటీవల కాలనీకి చెందిన రోడ్డును విస్తరించాలని కాలనీకి ఆనుకొని ఉన్న బోరును సైతం తొలగించి చెర్లోపలి కాలువ గట్టు వరకు మట్టితో చదును చేశారు. దీంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి రావడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. వాటిని తొలగించాలని పంచాయతీ అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం కానరాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల చెర్లోపలి కాలువలోని వ్యర్థాలను తొలగించినా అధికారులు వాటిని ఎత్తివేయకుండా రోడ్డుపై నెరిపి చేతులు దులుపుకున్నారు.కాలనీకి ఉన్న ఒకే ఒక్క బోరును అధికారులు తొలగించడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంచాయతీ నుంచి వచ్చే కుళాయి నీరు మురికివాసన వేస్తుండడంతో వాటిని తాగలేని పరిస్థితుల్లో ఉన్నామని స్థానికులు పేర్కొన్నారు. కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు కాలువలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

దోమల బెడద ఎక్కువ



కాలనీని ఆనుకొని చెర్లోపలి కాలువ ఉండడంతో అందులో విడిచిపెట్టే వ్యర్థాల వల్ల దోమలు పెరిగి రోగాల భారిన పడుతున్నాం. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మట్టి దిబ్బలు రోడ్డుపైనే రోజుల తరబడి విడిచిపెట్టారు. రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులకు గురవుతున్నాం.

ఎం. మాణీలు, ఇందిరాకాలనీ

నీరు తాగలేకపోతున్నాం



పంచాయతీ నుంచి విడుదలయ్యే కుళాయినీటిని తాగలేకపోతున్నాం. చెర్లోపలి కాలువను ఆనుకొని పైపులైన్లు ఏర్పాటు చేయడం వలన మంచినీటితో పాటు మురికినీరు వ స్తుంది. మురికినీటి మధ్యలోనే కుళాయినీరు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలి.

డి.అక్కమ్మ, ఇందిరాకాలనీ

బోరు తొలగించడం అన్యాయం



కాలనీరోడ్డును విస్తరిస్తామని అందరికీ ఉపయోగపడే బోరును తొలగించారు. నెలలు గడుస్తున్నా తొలగించిన బోరును వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడం గాని, రోడ్డు పనులు ప్రారంభించడం గాని అధికారులు చేపట్టలేదు. తక్షణం ఈపనులను చేపట్టి కాలనీవాసులను ఆదుకోవాలి. **ఎం.సుధీర్‌కుమార్,** ఇందిరాకాలనీ

ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం

తుమ్మపాల: ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన అవసరమని ఎంపీపీ కొణతాల వెంకటసావిత్రి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్.సుజాత, కొణతాల శ్రీనివాసరావు, చదరం మహలక్ష్మినాయుడు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కశింకోటరూరల్: మండల కాంగ్రెస్ కార్యాలయంలో లీగల్ సెల్ కార్యకర్త సమక్షంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మజ్జి ప్రసాదరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాదులపాలెం భూ కుంభకోణంలో రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కత్తెర శ్రీధర్ మాట్లాడుతూ దేవాలయ భూములను అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి

కశింకోటరూరల్: సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. ఒడిశాతో ఉన్న జలవివాదాలు పరిష్కరించాలన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్డీవో సూర్యకళ,హాజరైన కళాశాల విద్యార్థినులు

ఆడపిల్లలకు చదువు తప్పనిసరి

ఆదినారాయణ మహిళా కళాశాల వార్షికోత్సవంలో ఆర్డీవో సూర్యకళ

గవరపాలెం: ఆడపిల్లలకు చదువు తప్పనిసరి అని ఆర్డీవో సూర్యకళ అన్నారు. స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా జూనియర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల 41వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. ఆడపిల్ల చదువే ఇంటిల్లాపాదికి మంచిదన్నారు. కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ మాట్లాడుతూ కుటుంబ వ్యవహారాల కోసం విద్యను మధ్యలో ఆపేసిన నాన్నగారు ఎలాగైన పేద విద్యార్థుల కోసం కళాశాల స్థాపించాలని కంకణం కట్టుకొని స్థాపించారన్నారు. పేద, వెనుకబడిన వర్గాల వారి కోసం ఈ ఏడాది నుంచే ఈ కళాశాలలో జూనియర్ విద్యను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్డీవో సూర్యకళ, ఆంధ్రాయూనివర్సిటీ గవర్నింగ్‌బాడీ మెంబర్ ఎం.శారదాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతాకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

అనకాపల్లి రూరల్: ఇళ్లులేని అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని సర్పంచ్ చీకటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మిలు చెప్పారు. మండలంలోని రేబాక, గొలగాం గ్రామాల్లో మంగళవారం హౌసింగ్ లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన ప్రజా సాధికారిత సర్వేలో ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి జాబితాలను తయారు చేశారు. ఈ జాబితాల్లో ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తారని వారు వివరించారు. మంత్రి వెంకటేష్, కె.అర్జునరావు,హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లువి.శ్రీనివాసరావు, కనకరాజు పాల్గొన్నారు.

తాళ్లపాలెం అభివృద్ధిపై సమీక్ష

కశింకోటరూరల్: తాళ్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ అభివృద్ధిపై ఆర్డీవో సూర్యకళ సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనుబాబు మాట్లాడుతూ అన్నిశాఖల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాజంగి వైద్యాధికారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

చింతపల్లి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తాజంగి వైద్యాధికారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు లోకుల గాంధి తెలిపారు. మంగళవారం లంబసింగి, తాజంగి ఆరోగ్య కేంద్రాలతో పాటు పినపాడులో జ్వర బాధితులను పరామర్శించారు. పినపాడులో వ్యాధుల పరిస్థితి, మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైద్యాధికారి సతీష్‌కుమార్ ఈ నెల రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకూ ఆస్పత్రికి హాజరుకాలేదని స్థానికులు చెబుతున్నారని, ప్రతి రోజూ విధులకు హాజరైనట్టు సంతకాలు ఉన్నాయని తెలిపారు. జ్వరాలతో ముగ్గురు మృతి చెందినా వైద్యాధికారి స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆయనపై చర్యల కోసం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ప్రత్యేక బస్సులు

ఏజెన్సీ వ్యాప్తంగా 250 వాహనాల ఏర్పాటు

పాడేరు: అరకులోయలో బుధవారం జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి భారీ స్థాయిలో జనాన్ని తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఏజెన్సీ వ్యాప్తంగా 250 బస్సులను సమకూర్చారు. జిల్లాలో వివిధ ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులను మంగళవారం సాయంత్రానికి మండల కేంద్రాలు, కీలక గ్రామాలకు తరలించారు. భారీ స్థాయిలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం, ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ హాజరు అవుతుండడంతో భారీగా జన సమీకరణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో వచ్చే జనాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ఆహారం సైతం సమకూర్చుతున్నారు. టీడీపీ శ్రేణులు కూడా కార్యకర్తలను ప్రత్యేక వాహనాల్లో అరకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్న ఆర్టీసీ బస్సులు

నెలాఖరు వరకు దూర విద్యలో ప్రవేశాలు

పాడేరు రూరల్: దూర విద్యలో టెన్త్, ఇంటర్‌లో ఈ నెల 31 వరకు చేరవచ్చని తలారిసింగి పాఠశాల హెచ్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. నెలాఖరు వరకు అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు చేపడతామన్నారు. అలాగే సెప్టెంబర్ 30వ తేదీ వరకు అపరాధ రుసుంతో ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. పూర్తి వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంపీడీవో ప్రేమాకర్

జి.మాడుగుల: ఎంపీడీవోగా ఎస్.ప్రేమాకర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎంపీడీవో ఆర్‌వీ పద్మజ బదిలీపై విజయనగరం జిల్లాను వెళ్లారు. ఆమె స్థానంలో పాడేరులో పనిచేస్తున్న ప్రేమాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గిరిజన సంక్షేమానికి కచ్చితమైన హామీ ఇవ్వాలి

కొయ్యూరు: ఏజెన్సీకి వచ్చామా, వెళ్లామా అని కాకుండా గిరిజన సంక్షేమానికి సీఎం చంద్రబాబు కచ్చితమైన హామీ ఇవ్వాలని గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు గోకిరి చిన్నారావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వారా నూకరాజు, సమితి సభ్యుడు గండేపల్లి నూకరాజులతో కలసి మంగళవారం విలేఖరులతో ఆయన మాట్లాడారు. సీఎం ఏజెన్సీలో పర్యటించేందు రావడం సంతోషదాయకమన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వస్తున్న ముఖ్యమంత్రి బాక్సైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని కోరారు. అలాగే గిరిజన సలహా మండలిని పునరుద్ధరించాలని, ఎస్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు గతంలో ఇచ్చిన హామీలలో భాగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు.



సదస్సులో మాట్లాడుతున్న గోపాలకృష్ణ



గోపాలకృష్ణను, ఆయన తండ్రిని సన్మానిస్తున్న దృశ్యం

పట్టుదల, కార్యదీక్షతో ఉన్నత స్థానం

సివిల్స్‌లో మూడో ర్యాంకర్ రోణంకి గోపాలకృష్ణ

కె.కోటపాడు: పట్టుదల, కార్యదీక్ష ఉంటే ఏదైనా సాధించవచ్చని సివిల్స్‌లో ఆలిండియా 3వ ర్యాంకు సాధించిన రోణంకి గోపాలకృష్ణ విద్యార్థులకు సూచించారు. స్థానిక అయ్యన్న విద్యాసంస్థల్లో నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ముర్రు ముత్యాలనాయుడు సౌజన్యంతో మంగళ వారం ఏర్పాటు చేసిన విద్యార్థులకు అవ గాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలం అత్యంత విలువైనదని, ఒక్క క్షణం గడిచిపోతే తిరిగి రాదని అన్నారు. ప్రతి క్షణాన్నీ మన ఆశయాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని అన్నారు. మిల్లీ సెకెండ్ విలువను ఏ విధంగా వినియోగించుకోవాలో హుస్సేన్ బోల్ట్‌ను ఉటంకిస్తూ తెలియజేశారు. తాను ఈ స్థాయికి ఎదగడానికి ఎంత కష్టపడిందీ ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుతం విద్యా ర్థులకు అన్ని సదుపాయాలూ ఉన్నాయని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని అన్నారు. ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు అహరహం శ్రమించాలని అన్నారు. మంచి ఆలోచనతో ముందుకు వెళ్లే ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటా రని చెప్పారు. విద్యార్థుల చదువుకు తల్లిదం డ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమ న్నారు. చదువుకు పేదరికం, కులం, మతం, భాష అడ్డురావన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను తీర్చారు. నన్నయ వర్సిటీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ గురువులను, తల్లితండ్రులను ఎవరైతే గౌరవి స్తారో వారే గొప్ప వారవుతారన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణను, ఆయన తండ్రి అప్పారావును ఘనంగా సన్మానించారు. అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌కే.ఖాసీం, ఏవో దాట్ల చంద్రశేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గోపాలకృష్ణ స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా విధుల్లో చేరాక విద్య, వైద్యం, వ్యవసాయరం గాలతోపాటు మహిళా సాధికారితపై దృష్టి సారిస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు కృషి చే స్తానన్నారు. నిరుద్యోగ యువతకు స్వచ్ఛంద సంస్థల ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు.

సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కె.కోటపాడు: సస్యరక్షణ చర్యలు చేప ట్టడం ద్వారా రైతులు వరిలో అధిక దిగుబ డులు సాధించవచ్చునని అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ జి.పద్మజ అన్నారు. మంగళవారం మండలంలోని రొంగలినాయు డుపాలెం, ఆర్‌వై.అగ్రహారం, చిరికివానిపాలెం గ్రామాల్లో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ రినాట్లు వేసేటప్పుడు నారు చివర్లను తుంచి నాట్లు వేయాలన్నారు. నారుకట్టలను జీవా మృతంలో ముంచి వేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చునని అన్నారు. పురుగు మందు లకు బదులుగా కషాయాలను తయారు చే సుకుని పిచికారీ చేయాలన్నారు.

మరో ఏడీఏ ఎన్.వసంతకుమార్ మాట్లా డుతూ, వేరుశనగ పంటలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయడం వల్ల గింజ బరువు పెరిగి నూనెశాతం పెరుగుతుందన్నారు. రైతు శిక్షణ కేంద్రం ఏవోలు బీవీ పద్మశోభ, కె.ధనలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కేవీ రాంప్రసాద్, ఎంపీఈవోలు గణేష్, శ్రావణ సంధ్య, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

11న కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు

మాడుగుల: రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 11న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ఎండీవో ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుద్యోగ యువకులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం



క్విట్ ఇండియా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాడుగుల రూరల్ : మండలంలోని పెంటయ్యపాలెం మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో మంగళవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవి విద్యా ర్థులకు క్విట్ ఇండియా దినోత్సవ ప్రత్యేక తను వివరించారు. తెల్లదొరలను మన దేశం నుంచి పారదోలేందుకు 1942 ఆగస్టు 8న క్విట్ ఇండియా ఉద్యమానికి జాతిపిత మహా త్మాగాంధీ పిలుపునిచ్చారన్నారు. అనంతరం విద్యార్థులు క్విట్ ఇండియా పేరుతో ప్లకా ర్డులు, జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు మూర్తి, అప్పలరాజు, భాగ్యలక్ష్మి, పార్వతి, ప్రశాంత్, శివ, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



చీడికాడ : అంకితభావంతో పనిచేసిన వారందరికీ గుర్తింపు ఉంటుందని దిబ్బపా లెం సర్పంచ్ అరిశంకుల రమణమ్మ అన్నారు. మండలంలో దిబ్బపాలెం యూపీ స్కూల్ నుండి కె.నారాయణమూర్తి, జె.ప్ర సాద్ బదిలీపై వెళ్లగా వారికి పాఠశాలలో మంగళవారం మాజీ సర్పంచ్ ఎస్.రమణ బాబు సొంత నిధులతో సమకూర్చిన శాలు వాలతో ఘనంగా సన్మానించారు. కొత్తగా వచ్చిన ఐదుగురు ఉపాధ్యాయులకు పుష్పగు చ్ఛాలు ఇచ్చి ఆహ్వానించారు. ప్రధానోపాధ్యా యుడు రాళ్లపల్లి దేముడుబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.కన్నంనాయుడు పాల్గొన్నారు

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం : రామానాయుడు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్ : ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ముఖ్యోద్దేశమని మాడు గుల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మంగళవారం సత్యవరం గ్రామంలో తగ రపువలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజ మాన్యం, ఎన్టీఆర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన రామానాయుడు మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు మందులను అందజేశారు. గ్రామస్తులతో పాటు పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది వైద్యసేవలు పొందారు. ఎంపీపీ ఒంట్రు గంగమ్మ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు మజ్జి రామారావు, మాజీ అధ్యక్షుడు మజ్జి తాతబాబు, అద్దెపల్లి జగ్గా రావు, మరువాడ ఈశ్వరరావు, గట్టెడ్డి శ్రీనివా సరావు, బుద్దాల రమణ వైద్యులు లోకనాథం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాల కోసం ఇంటర్వ్యూలు : ఎంపీడీవో

కె.కోటపాడు: ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేష న్ల రుణాల కోసం దరఖాస్తు చేసు కున్నవారికి ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. 9న కె.కోటపా డు స్టేట్‌బ్యాంకు పరిధి అభ్యర్థులకు, 10న చౌడువాడ, ఆనందపురం ఏపీజీవీబీ బ్యాంకులు, 11న లంకవానిపాలెం ఇండియన్ బ్యాంకు, తుమ్మపాల ఇండియన్ బ్యాంకు, కె.కోటపాడు డీసీసీబీ పరిధి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు దారులు ఆన్‌లైన్‌లో తాము దరఖాస్తు చేసిన ఫారం జెరాక్స్ కాపీ తీసుకుని హాజరు కావాలని కోరారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకన్న

చీడికాడ: పోరాటాలతోనే సమస్యల పరిష్కారం అవు తాయని సీపీఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. మండలంలోని కోనాం శివారు కొండ కొత్తూరు గ్రామంలో భూ సమస్యల పరిష్కారాల మార్గాలు అనే అంశంపై సదస్సు జరిగింది. ముందుగా సీపీఐఎం జిల్లా అధ్యక్షుడు ఎం.సూర్యనారా యణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. గిరిజనుల సమస్యల కోసం సూర్యనారాయణ ఎన్నో ఉద్యమాలు చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు విడి చారన్నారు. ఆయన అడుగుజాడల్లో గిరిజను లందరూ తమ సమస్యలు తామే పరిష్కరిం చేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, కేవీపీఎస్ జిల్లా నాయ కుడు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భూమి అన్యాక్రాంతంపై రెవెన్యూ విచారణ

రావికమతం: మాజీ సైనికోద్యోగికి, అతని భార్యకు ప్రభుత్వం ఇచ్చిన సాగుభూమి అన్యాక్రాంతమైందని పల్లె రాజారావు సిట్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులు తోటకూరపాలెంలో విచారణ చేపట్టారు. మండలంలోని తోటకూరపాలెం గ్రామ సర్వే నెంబరు 13/2, 13/3లో మాజీ సైనికోద్యోగి పల్లె అప్పలస్వామికి ఐదు ఎకరాలు, అతని రెండో భార్య విజయలక్ష్మి పేరున మరో 4.15 ఎకరాలను ప్రభుత్వం ఉచితంగా 25 ఏళ్ల క్రితం ఇచ్చింది. అప్పలస్వామి మరణాంతరం ఆయన కుమారుడు, ఫిర్యాదుదారుడు పల్లె రాజారావు తండ్రి పేరున ఉన్న ఐదు ఎకరాలు భూమి సాగుచేస్తుండగా, విజయలక్ష్మి పేరున ఉన్న 4.15ఎకరాలు భూమిని తోటకూరపాలెం గ్రామానికి చెందిన పైలా మహలక్ష్మికి కౌలుకు ఇచ్చారు. విజయలక్ష్మి ఇటీవల మరణించారు. ఆమెకు సంతానం లేనందున ఈ భూమి కూడా తనకే చెందుతుందని మాజీ సైనికోద్యోగి మొదటి భార్య కుమారుడైన రాజారావు కౌలురైతు కుమారుడు పైలా నాగరాజును కోరగా, తన పై దౌర్జన్యానికి దిగు



తట్టబందలో నంబారు నూకరాజు భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

తున్నాడని సంబంధిత భూమికి నిజమైన వారసుడిని తానే కనుక తనకు భూమి అప్పగించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే తిరిగి స్వాధీనం చేసుకోవాలని పల్లె రాజారావు సిట్‌కు జూలై 14న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్‌డీటీ జె.భాస్కరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ నూకరత్నం, వీఆర్‌వో తదితరులు ఆ భూమి విషయమై గ్రామంలో బహిరంగ విచారణకు వెళ్లగా, ఫిర్యాదుదారుడు హాజరుకాక, కౌలురైతునే విచారించి వెనుతిరిగారు. అలాగే తట్టబంద, గుడ్డిప రెవెన్యూ పరిధిలో తాతల నుంచి తమ ఆధీనంలో సాగులో ఉన్న భూమికి పట్టా కల్పించకపోవడంతో బూరుగుపాలెం గ్రామానికి చెంద్న నంబారు నూకరాజు సిట్‌కి ఇచ్చిన ఫిర్యాదుపై సదరు భూములను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు.



విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

120మందికి ఎంఆర్ వ్యాక్సినేషన్

రావికమతం: మండలంలో టి.అర్జాపురం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం 120 మంది విద్యార్థులకు కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. హైస్కూల్ హెచ్‌ఎం జగన్నాధీశ్వరరావు, సీఆర్‌పీ రామారావు, వైద్య సిబ్బంది మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై మురుగునీరు

చోడవరం రూరల్: మండలంలోని అంభేరుపురం ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ఆయా ఇళ్లల్లో వాడుకనీరు కాలువల్లోకి చేరినా, మురుగునీరు పోయే దారిలేక ప్రధాన రహదారిపై చేరుతోంది. వాహనాలు వెళ్ళేటప్పుడు మురుగునీరు పాదచారులపై తుళ్లి పడుతోంది. గ్రామంలో ఎక్కడికక్కడ కాలువలు ఆక్రమణలకు గురవడంతో కాలువల్లో పూడిక తొలగించడం పంచాయతీ సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. దీంతో ఏళ్లతరబడి గ్రామంలో మురుగు కాలువల సమస్య తీరడంలేదు.



సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

రావికమతం: సేంద్రియ ఎరువుల వాడకంతోనే జీడిమామిడి సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం (కొండెంపూడి) ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు తెలిపారు. మండలంలో వమ్మవరం గ్రామంలో మంగళవారం జీడిమామిడి సాగు రైతులతో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవన ఎరువులైన పాస్ఫో బ్యాక్టీరియా, జీవ సిలీంద్ర నాశిని అయిన ట్రైకోడెర్మాను పశువుల గెత్తంలో కలిపి జీడిమామిడి చెట్లుకు వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఎరువులను చెట్లకు ఏ విధంగా వేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు.

నాగరాజు కుటుంబానికి చంద్రన్న బీమా

రావికమతం: పిడుగుపడి మృతి చెందిన నాగరాజు కుటుంబానికి తక్షణ సహాయంగా చంద్రన్న బీమా సొమ్ము రూ.5వేలు మంగళవారం సర్పంచ్ గల్లా అన్నపూర్ణ అందజేశారు. మండలంలోని గుడ్డిప గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి గ్రామానికి చెందిన మజ్జి నాగరాజు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు చంద్రన్న బీమా తక్షణ సహాయం కింద మంగళవారం వెలుగు, బీమామిత్ర లక్ష్మి, పుష్పల ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి సర్పంచ్ ఈ సహాయాన్ని అందజేశారు. త్వరలోనే మరో రూ.4.95లక్షలు ఆర్థిక సహాయం చంద్రన్న బీమా ద్వారా అందుతుందని సర్పంచ్ అన్నపూర్ణ తెలిపారు. జన్మభూమి కమిటీ సభ్యులు



చంద్రన్న బీమా సహాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, తదితరులు

గల్లా సత్యారావు, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు గల్లా పార్వతి, ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

• ఎమ్మెల్యే రాజు హామీ • వంట పాత్రల పంపిణీ

చోడవరం టౌన్: మండలంలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్ఎస్ రాజు హామీ ఇచ్చారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలకు వంటపాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ అంగన్‌వాడీ భవనాల నిర్మాణంతోపాటు వాటికి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు జడ్పీటీసీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు, ఎంపీడీవో జీవీ.చిట్టిరాజు, ఈవోపీఆర్‌డీ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ భూతనాధు నానికుమార్, దొమ్మేసి గిరి, టీడీపీ మండలఅధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, ముడుసు గోవింద, మాదిరెడ్డి జోగినాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు వంటపాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

నేటి నుంచి విద్యార్థులకు పోటీలు

చోడవరం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చోడవరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, బార్ అసోసియేషన్ సౌజన్యంతో బుధవారం నుంచి రెండురోజుల పాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం కోర్టువర్గాలు తెలిపాయి. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వతంత్ర భారతం-ప్రముఖుల పాత్ర అనే అంశంపై చిత్రలేఖనం, 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జాతీయపతాకం-వివిధ చట్టాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. 10వ తేది గురువారం దేశభక్తి, భారతీయుల కర్తవ్యం అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుంది. మొదటిగా వచ్చిన 200మందికి మాత్రమే ఈ పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని, చిత్రలేఖనం పోటీలో పాల్గొనే విద్యార్థులు బ్రష్‌లు, ఇతర పరికరాలు ఎవరికి వారే తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో విజేతలకు 15న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

వరి గట్లపై కంది సాగుతో అదనపు ఆదాయం

మండల వ్యవసాయాధికారి విజేత

రోలుగుంట: రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించడాలని, వరి గట్లపై కంది వేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని మండల వ్యవసాయాధికారి పి. విజేత అన్నారు. చంద్రన్న రైతుక్షేత్రంలో భాగంగా మంగళవారం మండంలోని కొమరవోలులో వరినాట్లు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సలహాలు, సూచనలు ఇచ్చారు. వరినాట్లు వేసే ముందు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. దమ్ము



సమయంలో జింకు వేసుకోవాలన్నారు. పొలం గట్టను సమర్థవంతంగా కంది పంట వేయడం ద్వారా అదనపు ఆదాయం పొందాలన్నారు. ఉపయోగించుకుని రైతులు అదనపు ఆదాయంను పొందవచ్చన్నారు. ఎంపీఈవోలు వాణి, రాజాన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుదల

ఐసీడీఎస్ సీడీపీవో శ్రీకళ

రోలుగుంట : మండల కేంద్రమైన రోలుగుంటలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీకళ మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. కనీసం ఏడాది వరకైనా తల్లిపాలు ఇవ్వాలన్నారు. డబ్బాపాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టించవద్దని సూచించారు. దీనిపై మారుమూల గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీకళ

చేయాలన్నారు. ఏసీడీపీవో జీవీ రమణి, సూపర్‌వైజర్ విజయకుమారి, సర్పంచ్ పోతల లక్ష్మీరమణమ్మ, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.



గోపాలకృష్ణ, ఆయన తండ్రి అప్పారావును సత్కరిస్తున్న స్థానికులు



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

- అప్పుడే విజయం వరిస్తుంది
- ప్రతి విద్యార్థి టెన్త్‌లోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
- సివిల్స్ ఆల్ ఇండియా మూడో ర్యాంకర్ రోణంకి గోపాలకృష్ణ
- శారదానగర్‌లో నిరుద్యోగ యువతకు సివిల్స్‌పై అవగాహన సదస్సు

నర్సీపట్నం రూరల్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే సత్ఫలితాలు సాధించగలరని సివిల్స్‌లో ఆల్ ఇండియా మూడో ర్యాంకు సాధించిన రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని శారదానగర్‌లోని కొప్పర్తి రామారావు గార్డె న్స్‌లో పీఆర్‌టీయూ,కొప్పర్తి రామారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యా ర్థులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివిద్యార్థి పదో తరగతిలోనే ఉన్నతమైన లక్ష్యం ఏర్పర్చుకోవాల న్నారు. ఇంటర్ తరువాత ఆ లక్ష్యంపై పూర్తి స్పష్టత కలిగి ఉండాలన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, అనుకు న్నది సాధించాలన్న తపన ఉన్నట్టయితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చునని చెప్పారు. తాను ఈ స్థాయికి రావడా నికి 11 ఏళ్లు పట్టిందన్నారు.పేదరికంలో ఉన్న విద్యార్థులు ఏదొక చిన్న ఉద్యోగం పొంది తర్వాత అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలుఅధిరోహించాలన్నారు.ప్రతీరోజూతెలుగు, ఇంగ్లీష్ పత్రికలు క్షుణ్ణంగా చదివి జాతీయ, అంతర్జాతీయ వార్తలపై దృష్టి సారించాలని సూచించారు. సివిల్స్‌కు సంబంధించి విషయ పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జి, సిలబ స్‌పై అవగాహన అవసరమన్నారు. తాను చిన్న తనంలో ప్రతిరోజూ ఎనిమిది కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లే వాడినని, ఇంటర్ వరకు తన ఇంటికి విద్యుత్ సదు పాయం కూడా లేదన్నారు. ధృఢ సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరికి 16 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు చాలా విలువైనది ఆ కాలాన్నీ వృథా చేయరాదన్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు మాట్లాడుతూ పలాస లాంటి చిన్న పల్లెటూరులో పేద రైతు కుటుంబం నుంచి వచ్చినగోపాలకృష్ణ పలువురికి ఆదర్శప్రాయుడు అన్నారు. లక్ష్యసాధన ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఆత్మవి శ్వాసం, ఏకాగ్రతతో ఈ ప్రాంతం నుంచి వంద మంది సివిల్స్ ర్యాంకులు సాధించాలని కోరారు.

అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు గోపాలకృష్ణ సమాధానాలు చెప్పి, వాటిని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గోపీనాథ్, కొప్పర్తి రామారావు ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత రామారావు గోపాలకృష్ణ, ముత్యాలనాయుడును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు వరహాలనాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా అధ్యక్షుడు జి. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నిలిచిన పాల సరఫరా

నర్సీపట్నం టౌన్ : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రా లకు పాల సరఫరా నిలిచిపోవడంతో గర్భిణిలు, బాలింతలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని కేంద్రాలకు పది రోజులుగా పాలు సరఫరా కావడం లేదు. పట్టణంలోని పలు కేంద్రా ల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విషయం బయటకు పొక్క కుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. మంగళవారం మండలంలోని కొన్ని గ్రామాల్లో పాలు సరఫరా కాకపోవ డంపై పలువురు విలేకరులకు తెలిపారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే పాల ప్యాకెట్లు అయిపోయాయని, ఇండెంట్ పెట్టామని త్వరలోనే వస్తాయని చెబుతున్నారు.

ఆక్రమణదారుడిపై పోలీసులకు ఫిర్యాదు

మాకవరపాలెం : బయ్యవరం గ్రామంలోని సర్పానది పక్కనున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వంటాకుల సత్యనారాయణపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తహసీ ల్దార్ కె. రమామణి తెలిపారు. మంగళవారం ఆమె ఇక్కడి విలేక రులతో మాట్లాడారు. సత్యనారాయణ 93 సర్వే నంబ రులో ఉన్న ఎనిమిది ఎక రాల ప్రభుత్వభూమిని ఆక్రమించి ఇసుకఅక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు కూడా ఇక్కడి నుంచి ఇసుక అను మతులు నిలిపివేసినట్టు చెప్పారు. నదిలో ఇష్టారా జ్యంగా తవ్వకాలుజరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో నానాజీ ఆక్రమణ భూమిలో ఉన్న జీడి మొక్కలు, తాటి ఆకు పాకలను తొల గించారు. అలాగే భూమిలో ఉన్న గట్లను పూర్తిస్థాయిలో తొలగించారు.

రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ



గొలుగొండలో వ్యవసాయకార్యాలయం వద్ద పవర్‌టిల్లర్‌ను రైతులకు అందిస్తున్న ఎంపీపీ

గొలుగొండ : రైతులు యాంత్రీకరణ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో 70 శాతం రాయితీపై రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ లతో యాంత్రీకరణపై రైతులను ప్రోత్సహిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే వ్యవసాయా ధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగులో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మధుసూదనరావు, ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుర్ల బాబ్జి, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

18న పట్టాల పంపిణీ

నాతవరం : మండలంలో 165 మందికి ఈనెల 18వ తేదీన మంత్రి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీపీ సింగం పల్లి సన్యాసిదేముడు తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. గన్నవరం, నాతవరం, వైబీ పట్నం, గొలుగొండపేట, గాంధీనగరం గ్రామాల్లోని లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేస్తామన్నారు. అలాగే మూడేళ్లలో మండలంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజ లకు వివరిస్తామన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నర్సీపట్నం రూరల్ : మండలంలోని గురందొర పాలెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ అందజేసిన నోట్ పుస్తకాలు, పెన్నులను సర్పంచ్ సేనాపతి వెంకటరత్నం చేతులమీదుగా మంగ ళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినట్టయితే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. వసుధ ఫౌండేషన్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీటీసీ సభ్యురాలు రాయి శివలక్ష్మీకుమారి, గ్రామ పెద్దలు రాయిపెదబాబు, హెచ్ఎం ప్రసాద్, తది తరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్



విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌమ్య నేతృత్వంలో సిబ్బంది మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ముందుగా వైద్యాధికారిణి సౌమ్య ఉపా ధ్యాయులకు, విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగా హన కల్పించారు. అనంతరం 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 1035 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణమూర్తి, పాఠశాల డీన్ సంతోష్, ఇన్‌చార్జిలు సురేంద్ర, మైథిలి, హెల్త్ సూపర్‌వైజర్ రమాకాంత్, తది తరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

డీఎల్‌పీవో శిరీషారాణి




నర్సీపట్నం టౌన్ : పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు కు కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్ పీవో ఆర్. శిరీషారాణి ఆదేశించారు. మంగళ వారం ఆమె గబ్బాడ పంచాయతీలో జరుగుతున్న పనులు పరిశీ లించారు.గ్రామంలోని వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలపై ఆరా తీశారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వ హణ కేంద్రం నిర్మించే స్థలాన్ని పరి శీలించారు. పనులు త్వరితగతిన ప్రారంభించాలన్నారు. అలాగే తాగునీటి కొళాయిల్లో క్లోరినేషన్ చేయించి నీరు సరఫరా చేయా లని చెప్పారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని తెలిపారు. ఆమెతో పాటు సర్పంచ్ ఈర్లె రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి పెదవేగి రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

శరవేగంగా నూకాలమ్మ ముఖ ద్వారం పనులు

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ అమ్మవారి ముఖ ద్వారం పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. ఈ పనులకు గ్రామస్థుల విరాళాలతో పాటు ఇద్దరు కాంట్రాక్టర్లు రూ.3 లక్షలు ఇచ్చారు. ఈ మేరకు పది రోజులుగా ముఖ ద్వార పనులు చేపడుతున్నారు. సర్పంచ్ పర వాడ అప్పనాయుడు,ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పారావు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.







హై రిస్క్... హైవే జంక్షన్లు

- ప్రాణాలు తీస్తున్న డ్రైవర్ల నిర్లక్ష్యం
- రాత్రయితే అంధకారమే
- రోడ్డు దాటాలంటే హడల్
- నాలుగు జంక్షన్లల్లో నిత్యం టెన్షన్

నక్కపల్లి : మండలంలోని హైవే జంక్షన్లు అంటే ప్రజలు హడలిపోతున్నారు. జిల్లాలోనే హైరిస్క్ జోన్‌గా ఉద్దండపురం, ఉపమాక, వెదుళ్లపాలెం, గొడిచెర్ల జంక్షన్లను పోలీసులు గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారి విస్తరించిన తర్వాత మండలంలోని ఉద్దండపురం, వెదుళ్లపాలెం, గొడిచెర్ల, వేంపాడు, ఉపమాక, నక్కపల్లి ఆస్పత్రి జంక్షన్లు ఉన్నాయి. ఈ జంక్షన్లలో రహదారికి ఇరువైపులా గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆలయాలకు, దుకాణాలకు వెళ్లాలన్నా జాతీయ రహదారి దాటాల్సి ఉంటుంది. పాయకరావుపేట, తుని వెళ్లాలంటే రహదారికి ఎడమ వైపు, ఎలమంచిలి, అనకాపల్లి, విశాఖ వెళ్లాలంటే కుడి వైపు నిలబడి బస్సులను ఆశ్రయించాల్సి ఉంటుంది. దీంతో ప్రయాణికులు కూడా రహదారి దాటాలి. ఆయా గ్రామాల నుంచి విద్యార్థులను బస్సులు ఎక్కించడం కోసం తల్లిదండ్రు దగ్గర ఉండి రోడ్డు దాటిస్తుంటారు. అయితే వాహనాల జోరు చూసి రోడ్డు దాటడానికి వృద్ధులు, పిల్లలు, మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు.

జాతీయ రహదారిలో వాహనాలు దూసుకు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం ఆరు గంటల దాటితే చీకటి అలముకుంటుంది. జంక్షన్‌లలో ఎక్కడా లైటింగ్ ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళ దాటాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవల్సిందు. దాటేటప్పుడు మరోవైపు వాహనాలు వస్తుంటే తప్పుకోవడానికి కనీసం హైవే మధ్యలో నిలబడేందుకు అనువైన డివైడర్ కూడా లేదు. దీంతో చాలా మంది మహిళలు, వృద్ధులు వాహనాలను తప్పించుకోవాలన్న తపనతో రోడ్డును దాటేటప్పుడు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రధానంగా వేంపాడు, ఉద్దండపురం, నక్కపల్లి ఆస్పత్రి జంక్షన్, వెదుళ్లపాలెం, గొడిచెర్ల హైవే జంక్షన్లలో లైట్లు లేకపోవడంతో చీకటిపడితే అంధకారం అలముకుంటుంది. లైటింగ్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తులు వాహనదారులకు కనిపించకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమవుతుంది.

తీసుకోవల్సిన చర్యలు

- ప్రతి జంక్షన్‌లోనూ లైటింగ్ ఏర్పాటు చేయాలి
- జంక్షన్‌ల వద్ద వాహనదారుల స్పీడు అదుపు చేయడానికిపోలీసులు చర్యలు తీసుకోవాలి
- స్టాపర్లు దగ్గరదగ్గరగా ఏర్పాటు చేయాలి
- ప్రతి జంక్షన్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణగా హోంగార్డులను గానీ, పోలీసులుగానీ నియమించాలి
- ప్రమాదాలను హెచ్చరిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

జరిగిన ప్రమాదాలు



- ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 16 మంది మృత్యువాత పడ్డారు.
- వేంపాడు, వెదుళ్లపాలెం, ఉపమాక జంక్షన్లలో ఏడుగురు, ఉద్దండపురంలో నలుగురు, వెదుళ్లపాలెంలో ఇద్దరు, ఒడ్డిమెట్ట వద్ద ఇద్దరు, వేంపాడు వద్ద ఒకరు మృత్యువాతపడ్డారు.
- 2016లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 29 మంది మరణించారు.
- ఏప్రిల్ 10న వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జిల్లాలో అతి పెద్దది. ఆ రోజు జరిగిన ప్రమాదంలో 11 మంది మృత్యువాత పడ్డారు.
- ఉద్దండపురంలో ఆరుగురు, వేంపాడులో ముగ్గురు, ఉపమాకలో ముగ్గురు, గొడిచెర్లలో ముగ్గురు, దేవవరంలో ముగ్గురు ప్రమాదాల్లో మరణించారు.

చర్యలు చేపట్టాం : ఎస్ఐ

జాతీయ రహదారిలో ఉన్న జంక్షన్‌ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నక్కపల్లి ఎస్ఐ పి.సింహాచలం చెప్పారు. ప్రధానంగా ఉద్దండపురంతోపాటు మరో రెండు జంక్షన్లలో స్టాపర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే పలు జంక్షన్‌లో బ్లాక్ జోన్ బోర్డులు, ఫ్లాష్ బోర్డులు ఏర్పాటు చేశామని, ఉద్దండపురంలో కూడా వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిబంధనలు అత్రిక మిస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రోడ్డు దాటాలంటే భయమే!



ఏ పనిపై ఇతర గ్రామాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా జాతీయ రహదారి దాటాలి. రోడ్డు దాటాలంటే భయమేస్తోంది. వాహనదారులు అతివేగంగా నడుపుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినా చాలా మందిలో మార్పు రావడం లేదు.

తూము తాతారావు, డి.కొత్తూరు

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



హైవే జంక్షన్లలో విద్యుదీపాలు ఏర్పాటు చేయాలి. విద్యుదీపాలు లేకపోవడంతో రాత్రి వేళ చీకటిగా ఉంటుంది. దీనివల్ల రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహన లైటింగ్ వల్ల రోడ్డు కూడా సక్రమంగా కనిపించడం లేదు. లైటింగ్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తులు ద్విచక్ర వాహనదారులకు కనిపించడం లేదు.

డి.తాతబ్బాయి, విశ్రాంత ఉద్యోగి

3,419 మందికి ఎంఆర్ వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట : ఎంఆర్ వ్యాక్సిన్‌తో పిల్లల్లో తట్టు, రుబెల్లా తదితర ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని పాల్తేరు సర్పంచ్ కడింపల్లి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పాల్తేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఏఎఫ్ బి.తులసీ మాట్లాడుతూ శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో 3,419 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ లక్ష్యం మేరకు వేసినట్లు చెప్పారు. శ్రీరాంపురం సబ్ సెంటర్ పరిధిలో శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, కేశవరం, రాజవరం, గజపతినగరం గ్రామాల్లో వ్యాక్సిన్ పూర్తయినట్లు చెప్పారు. కందిపూడి సబ్ సెంటర్ పరిధిలో కందిపూడి, పాల్తేరు, ఈదటం గ్రామాల్లో వ్యాక్సిన్ వేయడం ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.వి.వి.ఎస్.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది జయలక్ష్మి, రత్నం, సోమేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై పునర్విచారణ



విచారణ నిర్వహిస్తున్న సునీత

నక్కపల్లి : మండలంలోని జానకయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల ఆరోపణల మేరకు సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడు ఈశ్వరరావుపై మంగళవారం పునర్విచారణ జరిగింది. ఉప విద్యాశాఖాధికారి సునీత, ఎంఈవో డీవీడీ ప్రసాద్ జానకయ్యపేట గ్రామంలో విచారణ నిర్వహించి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, జానకయ్యపేట సర్పంచ్ కురందాసు నాగరాజు, చినతీనార్ల సర్పంచ్ ఎరుపిల్లి శ్రీనివాస్ నుంచి వివరాలు సేకరించారు. విచారణ నివేదికను డీఈఓకు అందజేస్తామని సునీత తెలిపారు.

70 మందికి రక్తపరీక్షలు

నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో మంగళవారం సమిధ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.వీరభద్రరావు, కో-ఆర్డినేటర్ కె.నాగమణి హెచ్ఐవీ వ్యాప్తి చెందడం, తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం 70 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పిక్కి శ్రీనివాసరావు, టెక్నిషియన్ దుర్గ, ప్రతినిధులు మోసెస్, సింహాచలం పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయంలో అర్చకుడు వేములకొండ విశ్వనాథ శర్మ గ్రహణ శాంతులు చేపట్టారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిచ్చారు. స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు సింధూర, తమలపాకు పూజలను భక్తులు నిర్వహించారు.

ఉపమాకలో దర్శనాలు ప్రారంభం



ఆలయాన్ని తెరుస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాక క్షేత్రంలో మంగళవారం గ్రహణ శాంతులు చేశారు. సోమవారం రాత్రి చంద్రగహణం ఏర్పడ్డంతో అదే రోజు సాయంత్రం 4-30 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని అర్చకులు తెరిచారు. అనంతరం గ్రహణ శాంతులు, ఆలయ సంప్రోక్షణ, శుద్ధిపుణ్యాహవచనములు చేశారు. తదుపరి నిత్య పూజాది, హోమ క్రతువులను ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాద్, అర్చకస్వామి సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి దర్శనాలకు అనుమతిచ్చారు.

పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక కార్యక్రమం

ఈఓపీఆర్‌డీ వెంకటనారాయణ



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు ఈఓపీఆర్డీ పి.వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం పాల్తేరు పంచాయతీ శివారు అంకంపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ముగ్గురు అధికారులు మూడు పంచాయతీలు ఎంపిక చేసుకుని సోమవారం నుంచి శనివారం వరకు ఆయా గ్రామాల్లో వారం రోజులు పర్యటించి వంద శాతం పారిశుధ్య మెరుగుకు కృషి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంపిక చేసిన పంచాయతీల్లో కాలువలు, తాగునీటి వనరులు శుభ్రం చేయించడం, క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈ వారం మండలంలోని కేశవరం పంచాయతీ ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు, పాల్తేరు పంచాయతీని ఆర్‌డబ్ల్యూఎస్ టీపే మౌనిక, తాను సీతారాంపురం పంచాయతీలో వంద శాతం పారిశుధ్య మెరుగుకు కృషి చేయాల్సి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు వాట్సాఫ్ ద్వారా సీఎం డ్యాష్ బోర్డుకి అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ కడింపల్లి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తదితరులున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ సత్యనారాయణ

ముంపు నివారణకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

ఎలమంచిలి : పట్టణంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి, తక్షణమే గ్రావెల్‌తో పూడ్చాలని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన 19వవార్డులో పర్యటించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు కాలనీని సందర్శించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వలే ముంపునకు గురయ్యే అవకాశం లేకుండా ముందస్తుగా ప్రధాన కాలువల్లో పూడిక తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు కాలనీ ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున వార్డులోని అన్ని మేజర్ కాలువల్లోనూ పూడికలు తీయించాలని తెలిపారు. అనంతరం వార్డులోని పలు సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోదెపు ఆదిశేషు, సామాజిక వేత్త సాయిబాబు, డీఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఆర్‌ఓ పట్నాయక్, ఆర్‌ఐ, అమర్, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ రేపు

ఎలమంచిలి : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వై.అప్పలరాజు తెలిపారు. మంగళవారం ఆయన బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ విద్యావ్యాప్తికి కృషి చేయాల్సిన ప్రభుత్వం వసతిగృహాలను, పాఠశాలలను దశల వారీగా మూసివేస్తుండడం అన్యాయమన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, ఉపకార వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్స్ విడుదల చేయాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దందాను అరికట్టాలని, అన్ని విద్యా సంస్థల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం. మధన్, అనిల్, అశోక్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

- ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు
- సిబ్బంది సమయ పాలన పాటించాలి
- విధి నిర్లక్ష్యం వద్దు
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్మన్ హరిబాబు



మాట్లాడుతున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హరిబాబు

రోగులకు మెరుగైన సేవలు

ఎలమంచిలి : ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందేలా సిబ్బంది పని చేయాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హరిబాబు చెప్పారు. ముఖ్యంగా వైద్యులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఆస్పత్రిఅభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు అన్ని రకాల వైద్య సేవలందేలా వైద్యులు కృషి చేయాలని, ఆస్పత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం సభ్యులు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా శానిటేషన్ విభాగం మెరుగుపరచాలని, ఆపరేషన్ థియేటర్‌లో ఏసీ లేదని, నాలుగో తరగతి సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని చెప్పారు. దీనిపై స్పందించిన హరిబాబు ఆస్పత్రి అభివృద్ధికి 20 లక్షలు మంజూరు కానున్నాయని, వాటితో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ సందీప్, ఆస్పత్రి ప్రతినిధి డాక్టర్ శ్రీలక్ష్మి, సామాజిక కార్యకర్త పాల అప్పారావు, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి : పట్టణంలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో 1 నుంచి 6వ వార్డులోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీతో నిర్మితమయ్యే ఇళ్ల నిర్మాణాలు 3 కేటగిరీల్లో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీను, బీసీ సంఘం జిల్లా నేత మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు పండూరి శ్రీను, గోపీ, చంద్రరావు, నేతలు గంగాధర్, సురేష్ , ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి



స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

అచ్యుతాపురం : వెదురువాడ గ్రామంలోని ఆశ్రయ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మూడువ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యశోద సొసైటీ ముఖ్య కార్యదర్శి యార్లగడ్డ రమేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు మరువలేనివి

అచ్యుతాపురం : సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం. సూర్యనారాయణ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఆ సంఘం జిల్లా కార్యాదర్శి రొంగలి రాము అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సూర్యనారాయణ 3వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ రైతుల బకాయిలు, అటవీ హక్కుల చట్టం గురించి సూర్యనారాయణ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. అలాగే హెటెరో కార్మికుల సమస్యలు, ఫార్మా కార్మికుల సమస్యలపై కూడా రాజీలేని పోరాటం చేశారని చెప్పారు. అనంతరం పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సోమునాయుడు, శ్రీను, నూకరాజు, వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'వివాదాలు సృష్టించడం తగదు'

మునగపాక : ఒకే స్థలానికి ఇద్దరికి పట్టాలు ఇవ్వడమే కాకుండా వారి మధ్య తగువులు పెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు దాడి జమున ఆరోపించారు. మునగపాకలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో గతంలో ఒకే స్థలానికి ఇద్దరికి పట్టాలు ఇవ్వడంతో వివాదం తలెత్తింది. వారిరువురిని ఆ స్థలంలో ఎటువంటి కట్టడాలు చేపట్టకూడదని ఆదేశించినప్పటికీ ఒక వ్యక్తి కట్టడం చేపట్టడంతో వివాదం మొదలైంది. దీంతో ఎంపీటీసీ సభ్యురాలు జమున, ఏఎన్‌పే మహేష్, కాలనీ ప్రతినిధులు అంజలినాయుడు తదితరులు మంగళవారం ఈ విషయమై తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కాలనీలో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంటనే ఆ కట్టడాలను నిలుపుదల చేస్తామని చెప్పారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మునగపాక : చూచుకొండ గ్రామానికి ఆర్‌టీసీ బస్సు వేయాలని కోరుతూ మేముసైతం-మనఊరికోసం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంగళవారం అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణకు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఆర్‌కే అప్పారావు మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో సుమారు 400 మంది వనితాకారులు తీసుకున్నారని, విద్యార్థులు కూడా బస్సు పాసులు తీసుకున్నారని చెప్పారు.ఈ మేరకు గ్రామానికి ఆర్టీసీ బస్సు వేయాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఎలమంచిలి రూరల్ :మండలంలోని మర్రిబంద ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి లాలం సోమునాయుడు మంగళవారం నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మూర్తి మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లవుడు లోవరాజు, మాజీ సర్పంచ్ లాలం రామకృష్ణ, పాల సొసైటీ అధ్యక్షుడు రుత్తల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లలో జాగ్రత్తలు అవసరం

- వ్యవసాయాధికారి రంగాచారి
- పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

అచ్యుతాపురం రూరల్ : రైతులు వరి నాట్లు వేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఏఓ రంగాచారి సూచించారు. మంగళవారం ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరాకు 50 కిలోల డీఏపీని, 25 కిలోల పొటాషియంతో కలిపి వేసుకోవాలన్నారు. నారు తీయడానికి వారం రోజులు ముందుగా 5 సెంట్లు నారుమడికి 1.5 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు జల్లుకోవాలని సూచించారు. దీనివల్ల నారు ఊడ్చిన 20 రోజుల వరకూ పీక పురుగు సోకకుండా ఉంటుందన్నారు. అలాగే ఆకుముడత పురుగు ఆశించకుండా ఉండడానికి ఎకరా భూమిలో 20 కిలోల జింక్ సల్ఫేట్, ఇసుకలో కలిపి వారం రోజుల్లోగా చల్లాలని చెప్పారు. నారు కట్టల చివర త్రుంచి నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మూర్తి, అపర్ణ, రైతులు మళ్ల ఆదేశ్వరరావు, ఆడారి వెంకట అప్పారావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



నాట్లపై కూలీలకు సూచనలు ఇస్తున్న ఏఓ రంగాచారి

పులపర్తి, ఏటికొప్పాక, రేగుపాలెంలో..

ఎలమంచిలి రూరల్ : మండలంలోని పులపర్తి, ఏటికొప్పాక, రేగుపాలెం,పద్మనాభరాజుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకుడు మాలకొండయ్య రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేముడు, సర్పంచ్ గెంజి శ్రీనువాసరావు, వూటకూటి బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలోని పులపర్తిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మాలకొండయ్య

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాంబిల్లి : వరినారుమళ్లలో తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ గాయత్రి అన్నారు. మంగళవారం కొప్పగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నారుమళ్లలో పొడ తెగులు నివారణకు హెక్షాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీచేయాలన్నారు. అలాగే రైతులకు పలు సూచనలు అందజేశారు.

నేడు ఆర్టీసీ డిపోలో వికలాంగుల మేళా

అనకాపల్లిటౌన్: ఆర్టీసీ డిపోలో బుధవారం వికలాంగుల మేళ నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ వి.ప్రవీణ తెలిపారు. వికలాంగులకు మంజూరు చేసే పాసుల నిమిత్తం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ మేళాను నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - రారండోయ్ వేడుకచూద్దాం
రాజా - ఏజెంట్ భైరవ
షిర్డీసాయి - దర్శకుడు
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : గౌతమ్‌నంద
శ్రీసత్యనారాయణ స్కీన్2: అమీతుమీ

డాక్టర్ హిమశేఖర్ కాలేజీలో స్వచ్ఛభారత్

అనకాపల్లిటౌన్: స్థానిక రింగురోడ్డులోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కాలేజి ఆవరణలో ఆంధ్రాయూనివర్సిటీ స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం పరిశుభ్రతకు నడుం బిగించారు. కళాశాల పరిసరాలను, ఆవరణలో ఉన్న వ్యర్థ పదార్థాలను, పనికిరాని ప్లాస్టిక్ కవర్లను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.చిన్నికృష్ణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కే.రమేష్, ఎంజీ రాజ్‌కుమార్, అధ్యాపకులు ఎస్.ధర్మలింగం, కె.పరమేష్, కె.సీతారాం, ఎస్.కె. సలీమా, వి.లీలా, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధిలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో రాఘవేంద్ర గురుసార్వభౌముల 346వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్వామి వారికి వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మహిళా బృందంచే సుందరకాండ పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రపంచ రికార్డు గ్రహీత, ప్రముఖ జుగల్‌వాది కళాకారుడు పులకండం విజయ్‌బాబుచే ఏర్పాటు చేసిన ఈలపాట, తబలా కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాఘవేంద్రస్వామి బృందావన సమితి అధ్యక్షుడు బొగ్గారపు కృష్ణాజీ, కార్యదర్శి వాకాడ రమ, కోశాధికారి మళ్ల చంద్రశేఖర్, సమితి మాజీ అధ్యక్షుడు గుండా రమణాజీగుప్తా పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

కొత్తూరు: మండలంలోని మొండిపాలెం గ్రామం నుంచి 16 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు విశాఖ కేజీహెచ్‌లో రెండో రోజు వైద్య పరీక్షల కోసం తీసుకు వెళ్లారని ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు చదరం నాగేశ్వరరావు, రాపేటి నాగేశ్వరరావు, కాళ్ళ ఏడుకొండలు, కాండ్రేగుల చందు తెలిపారు. కొణతాల సుబ్రమణ్యం, అప్పలనర్సమ్మ ట్రస్ట్ సహకారంతో మంగళవారం ఉదయం కేజీహెచ్‌కు రెండోరోజు తరలించామన్నారు.

విద్యా సంస్థల బంద్ రేపు

అనకాపల్లిటౌన్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న విద్యాసంస్థల బంద్ చేయనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి సీహెచ్.శివాజీ, పీడీఎస్‌వో జిల్లా నాయకుడు శంకర్‌లు తెలిపారు. మంగళవారం దొడ్డి రామునాయుడు భవనంలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జమాదులపాలెంలో బీజేపీ బృందం పర్యటన

కశింకోటరూరల్: జమాదులపాలెం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ కర్షక కన్వీనర్ జి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బృందం మంగళవారం పర్యటించింది. రైతులు, గ్రామస్థులతో భూ సమస్యలపై చర్చించారు. నరసింహమూర్తి, ఒమ్మి లోవరాజు, నరసింగయాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం నూకాంబిక ఆలయ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లతో పాఠశాలల అభివృద్ధిపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు పూర్తి వివరాలను నివేదిక రూపంలో ఇంజనీరింగ్ అధికారులచే అంచనాలు తయారుచేయించి ప్రతిపాదనలు ఇస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. డిప్యూటీ డీఈవో రేణుక మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కోరారు. పలువురు హెచ్ఎంలు పాఠశాలల్లోని సమస్యలు, అభివృద్ధిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ కొణతాల వెంకట సావిత్రి, ఎంపీడీవో పీవీ రమణ, ఎంఈవో దివాకర్, మలసాల రమణరావు, పంచదార్ల సూరిబాబు, బీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, పచ్చికూర రాము, చెక్కల శ్రీను, సిరసపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పీలా'

మాస్టర్ ప్లాన్‌తో నూకాంబిక ఆలయ అభివృద్ధి

అనకాపల్లిటౌన్: నూకాంబిక ఆలయాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధిపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం దేవాదాయశాఖ స్తపతి పరమేశ్వరప్ప నూకాంబిక ఆలయానికి వచ్చారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్తపతితో ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఆలయ అభివృద్ధి ఏ విధంగా చేపట్టాలో ఇప్పటికే తయారుచేసిన మ్యాప్‌ను పరిశీలించి చర్చించారు. ఆర్కిటెక్ అమన్‌రాజన్, డీఈ శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుద్ద నాగజగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొణతాల బాబురావు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌తో సమీక్ష


అనకాపల్లి: అనకాపల్లిజోన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ దుర్గా ప్రసాద్‌తో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

అనకాపల్లికి 35 కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు మంజూరు చేశారని పన్నులు వేగవంతంగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని సీఈని కోరారు. శంకరంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అది పనిచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూకాంబిక ఆలయానికి వచ్చే రోడ్డు, చింతావారివీధి, గూడ్స్‌రోడ్డు, నాయుళ్ల వీధి విస్తరణకు త్వరతగతిన చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ పరిధిలో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు.

జమాదులపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

కశింకోట: జమాదులపాలెంలో వివాదాస్పద భూములకు సంబంధించి సర్వే కోసం ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డీవో సూర్యకళ, రెవెన్యూ సిబ్బంది మంగళవారం జమాదులపాలెం గ్రామాన్ని సందర్శించారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ గత పాలకుల తప్పిదాల వల్లే ఇక్కడ భూములు వక్ఫ్‌బోర్డు భూములుగా నమోదయ్యాయన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీధర్ మాట్లాడుతూ కావాలని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, నాయకులు మలసాల రమణ రావు, కరక రాజు, పంచదార్ల సూరిబాబు, కుమార్‌రాజా, వేగి గోపీకృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో
డీవీఎన్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



డి.రాజకుమారి, కె.లావణ్య, డి.స్వప్న, కె.హిందుజా, సీహెచ్ ఇందూ

అనకాపల్లిటౌన్: ఆంధ్రాయూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయం స్థాయిలో మంచి గ్రేడు పాయింట్లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కోరుబిల్లి రమేష్ తెలిపారు. ఈ ఫలితాల్లో బీఎస్సీ విభాగానికి చెందిన డి.రాజకుమారి 9.40, కె.లావణ్య 9.32, కె.హిందుజా 9.22, సీహెచ్. ఇందూ 9.14, బీకాం విభాగంలో డి.లావణ్య 9.23 పాయింట్లతో టాపర్స్‌గా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ అభినందించారు.

విద్యార్థి గణనను రేపటిలోగా పూర్తిచేయాలి

కొత్తూరు: విద్యార్థి గణన కార్యక్రమాన్ని ఈనెల10వ తేదీలోగా పూర్తి చేయాలని సర్వశిక్షా అభియాన్ ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి సురేష్ అన్నారు. మండలంలోని ఏఎంఏఏ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన అనకాపల్లి రెవెన్యూ డివిజన్ స్థాయి రివ్యూ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 6 నుంచి 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన బడిఈడు పిల్లల వివరాలను ఏపీజీఈఆర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఐఈఆర్‌టీ కో-ఆర్డినేటర్ బీవీ రమణ మాట్లాడుతూ విద్యార్థి గణన కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు రోజుకు 30 నుంచి 60 మంది పిల్లల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు.గంగుపాంనాగేశ్వరరావు,సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

లేఅవుట్ ఆక్రమణలను అరికట్టాలి

కొత్తూరు: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 385, 387లలోగల నివాసితుల లేఅవుట్‌లో ఆక్రమణలను అరికట్టాలని లబ్ధిదారులు తహసీల్దార్ బి.సత్యనారాయణకు మంగళవారం ఫిర్యాదు చేశారు.దీనిపై తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ బుధవారం ఉదయం రెవెన్యూ సిబ్బందిని పంపించి ఆక్రమణలను అడ్డుకుంటామన్నారు. మళ్ళ శ్రీనివాసరావు, బుద్ధ నాగేశ్వరరావు, పెచ్చేటి రమేష్, మురళి, అప్పన్న రాము, వాసు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను అమలు చేయాలి

అనకాపల్లిటౌన్: మహాత్మగాంధీ ఆశయాలను చిత్తశుద్ధితో అమలుచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం దొడ్డిరామునాయుడు భవనంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. క్విట్ ఇండియా స్ఫూర్తితో అనకాపల్లి నియోజకవర్గంలో త్వరలోనే అవినీతి వ్యతిరేక వేదికను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఎ.బాలకృష్ణ, విల్లూరి పైడారావు, రాజాన దొరబాబు, కోరుబిల్లి శంకరరావు, బొట్టా చిన్నియాదవ్, గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన

అనకాపల్లిటౌన్: రైతు సమస్యలపై బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టనున్నట్టు కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ రైతులకు పిలుపునిచ్చారు. స్థానిక కార్మిక కర్షక నిలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సమస్యలన్నింటిపై నిర్వహించే ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు.ఎస్.రమేష్, గంటా శ్రీరామ్, బుద్ద శ్రీను,నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.